ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్

20-10-2026 మంగళవారం సంపుటి: 32
సంచిక: 261 పేజీలు: 10+4 వెల: 6.50

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

: fb.com/vaartha Digital


వాణిజ్య ఒప్పందంపై తుదిదశకు చర్చలు

టైగర్‌ప్రూఫ్‌పై దాడి చేసిన నిందితుల అరెస్టు 5

## కూరగాయల ధరలు పైపైకి

ఉల్లి: రూ. 70

టమాట: రూ. 60

70 నుంచి 150% పెరిగిన రేట్లు




**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణలో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో పండుగ వేళ సామాన్య, మధ్యతరగతి కుటుంబాల గృహ బడ్జెట్ తలకిందులవుతోంది. ధరల >>2

### సెలవు

పండుగ సందర్భంగా మంగళవారం 'వార్త' కార్యాలయానికి సెలవు. బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 22వ తేదీ గురువారం.



### దసరా శుభాకాంక్షలు!

విజయదశమి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

-డా॥ గిరీష్ కుమార్ సంఘీ,
'వార్త' సిఎండి & మేనేజింగ్ డైరెక్టర్



### కోల్ ఇండియా స్థాయిలో

## సింగరేణి వేతనాలు

### అధికారులకు సిఎం రేవంత్ విజయదశమి కానుక

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** సింగరేణి ఉన్నతాధికారులకు తెలంగాణ ప్రభుత్వం విజయదశమి కానుక అందజేసింది. సింగరేణి అధికారులకు కోల్‌ఇండియా తరహాలో వేతనాల పెంపునకు ఉత్తర్వులు వెలువరించింది. ఈ పెంపుతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ లెవెల్ 1 నుంచి 7 వరకు.. దాదాపు 1,800 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. సెప్టెంబర్ 25 నుంచి ఈ ప్రయోజనాలు వర్తించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తమకు మహారత్న ప్రభుత్వ రంగ సంస్థ కోల్‌ఇండియా తరహాలో తమకు వేతనాలు అందజేయాలని గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారులు విజ్ఞప్తి చేశారు. అప్పట్లో వారికి ఇచ్చిన హామీ ఈమేరకు నెరవేర్చారు. దసరాకు ముందు దాదాపు 39,000 మంది సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.596కోట్ల బోనస్‌ను >>2

### ఆహార భద్రతకు

# భరోసా




సోమవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్

### ఎల్‌నినో నేపథ్యంలో 14 నెలల పాటు ఆహార కొరత రాకుండా ప్రణాళిక

రేషన్ సరఫరాకు అంతరాయం లేకుండా ధాన్యం సేకరణ

నిత్యావసరాల ధరలు పెరగకుండా చర్యలు

ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం

పౌరసరఫరాల సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు19:** ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావం, పంట నష్టాలు, ఆహార ధరల పెరుగుదలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఆధారపడిన 3.42 కోట్ల మంది ప్రజల ఆహార భద్రతకు భరోసా కల్పించేందుకు 14 నెలల వరకు అవసరాలను తీర్చేలా ఆహార ధాన్యాల నిల్వలను బలోపేతం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాబోయే వ్యవసాయ సీజన్లలో వర్షపాతం తగ్గినా రేషన్ సరఫరాలకు అంతరాయం కలగకుండా ధాన్యం సేకరణ, బియ్యం నిల్వల నిర్వహణకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రానున్న వరి పంట దిగుబడిపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం >>2



### ఎల్‌నినో, కరవుపై

## కేబినెట్ సబ్‌కమిటీ

### ఆరుగురు మంత్రుల బృందానికి అధ్యక్షునిగా డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎల్ నినో. కరువు పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు, సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్‌గా, మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ, వాకిటి శ్రీహరిలను నియమించింది. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి >>2

### గ్లోబల్ సమ్మిట్‌కు భారీ

## ఏర్పాట్లు

### నవంబరు నెలాఖరులోగా పూర్తి

ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనరేట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్



ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్. చిత్రంలో డిజిపి ఆనంద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు19:** అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం భారత్ ఫ్యూచర్ సిటీలో >>2

నేడు కొండారెడ్డిపల్లికి ముఖ్యమంత్రి రేవంత్ 2

### నవంబరు నుంచి

## సీతమ్మ సాగర్ పనులు



అశ్వాపురం మండలంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు

నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు: మంత్రి తుమ్మల

**అశ్వాపురం,ప్రభాతవార్త, అక్టోబర్ 19:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను రాష్ట్ర వ్యవసాయ,సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలను అధికారులతో సమీక్షించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.గోదావరి నదిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు జిల్లాలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున, రానున్న నెలల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు కారణమవుతున్న సూపర్ ఎల్‌నినో భూతం ప్రభావంతో రానున్న కాలంలో తీవ్రంగా ఉండే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, దక్షిణ భారతదేశంలో వర్షపాతంపై కూడా ప్రభావం పడుతుంది అని తెలిపారు. ఇప్పటికే >>2



## రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు

### రాష్ట్రంలో 131 సేకరణ కేంద్రాలు

### 25.85 లక్షల టన్నుల ఉత్పత్తి

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** ఈ నెల 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పూర్తి చేసింది. కాటన్ కార్పొరేషన్ అధికార వర్గాల సమాచారంమేరకు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 131 కొనుగోలు కేంద్రాల్లో ఒకేసారి కార్యకలాపాలు ప్రారంభించనుంది. ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 48,21,503 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, తద్వారా మొత్తం 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. జిన్నింగ్ ప్రక్రియ అనంతరం సుమారు 50.68 లక్షల బేళ్ల పత్తి లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా సీసీఐ ఎంపిక చేసిన 131కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండామౌలిక సదుపాయాలు, >>2

### భూ సమస్యలకు

## రీ సర్వేతో చెక్



సోమవారం సమీక్షలో మంత్రి పొంగులేటి

వివాదాల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం

34 నెలల్లో 12.40 లక్షల పాస్‌బుక్కుల జారీ

సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూసేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.గత ప్రభుత్వంలోని పెద్దల నిర్లక్ష్యం,నిర్వాకం, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల పదేళ్లలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు సలహాల మేరకు రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు.సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతిచట్టం అమలు, రైతులకుపట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీసర్వే, భూ సమస్యల పరిష్కారం, ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయాల అమలు తీరును సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో మరింత బాగా పనిచేయాలని ఆదేశించారు.ప్రజలు కోరిన భూవివాదాలు లేని తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏప్రిల్ 14, 2025 నుంచి ఇప్పటి వరకు 5,68,858 పాస్ బుక్కులు జారీ చేశామని, అలాగే ఈ చట్టానికి ముందు 6,71,508 మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాస్‌బుక్‌లను రైతులకు అందజేశామని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీసర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నా రికార్డుల్లో హక్కులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై ఇబ్బందులు పడుతున్న రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలిచి సమగ్ర సర్వే >>2



లష్కరే తోయిబా కీలక కమాండర్ చౌధరి మహమ్మద్ సర్వర్ మృతి 3

కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి 3

వచ్చే నెలాఖరులోగా పనులు పూర్తి చేయకుంటే కన్నేపల్లి వద్ద ఆందోళన

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

### యాసంగి సీజన్‌కు

## రాయితీపై విత్తనాలు

### ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించేందుకు సన్నాహాలు

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఎల్‌నివో ప్రభావం వల్ల రైతులు నష్టపోతున్న క్రమంలో కీలక నిర్ణయం తీసుకుంది. రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. ఎల్‌నివో ఎఫెక్ట్ వద్ద పెద్దగా వర్షాలు లేకపోవడంతో రైతులు పంటల సాగు చేపట్టడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా అరుతడి పంటల వైపు రైతులను మళ్లించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా కూరగాయలు, వప్పు ధాన్యాలు, నూనెగింజల సాగు చేపట్టేలా >>2

## పట్టణాలకు కొత్తరూపు

### వచ్చే 20ఏళ్ల అవసరాల దృష్ట్యా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

### 2028 జూన్ 2కు రూపకల్పన పూర్తి

### చెరువులు, నీటి నిల్వల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ పట్టణాల రూపురేఖలు మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా రాబోయే 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో జనాభా పెరుగుదల, రవాణా రద్దీ, తాగునీటి కొరత, మురుగునీటి నిర్వహణ వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. 2028 జూన్ 2 నాటికి పట్టణ ప్రణాళికల రూపకల్పన పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పట్టణాలు విస్తరించిన తర్వాత సమస్యలకు పరిష్కారాలు వెతకడం కాకుండా, భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. రహదారులు, రవాణా వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి, పచ్చదనం, ప్రజా ప్రదేశాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. పట్టణాల అభివృద్ధి కేవలం భవనాలు, రహదారులకే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా ఉండాలని పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో పట్టణాల జనాభా, ఆర్థిక కార్యకలాపాలు, రవాణా అవసరాల్లో చోటుచేసుకునే మార్పులను అంచనా వేయాలని అధికారులకు సూచించారు. పట్టణాల విస్తరణ క్రమబద్ధంగా జరిగేలా భూ వినియోగ ప్రణాళికలు >>2



# నేడు కొండారెడ్డిపల్లికి సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** దసరా పండుగ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం సొంత ఊరుకు ముఖ్యమంత్రి ఎ,రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి వెడతారు. మధ్యాహ్నం.12.30 గంటలకు కొండారెడ్డిపల్లిలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తారు. సాయంత్రం కొండారెడ్డిపల్లిలో జరిగే జమ్మి కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు రాత్రి కొండారెడ్డిపల్లి నుంచి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# రీ సర్వేతో చెక్

>> నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం, నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీసర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకుపైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాలలో 15 గ్రామాలల్లో రీసర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450ఎకరాలకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పట్టాదారు పాస్‌బుక్‌లతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం లభించిందన్నారు. అలాగే ములుగు జిల్లా ముల్కాపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వరావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగుఆ కొనసాగుతున్న సమస్యకు పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాస్‌బుక్కులు అందిస్తామన్నారు. ఇదే పద్ధతిలో ఇతర ప్రాంతాల్లో కూడా సర్వే నిర్వహించి దశాబ్దాలుగా భూమిపై హక్కుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు హక్కులు కల్పించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజాకోణంలో రెవెన్యూ శాఖలో ప్రభుత్వం తీసుకుంటున్న విధాన పరమైన నిర్ణయాలు, ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు జరిగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అన్నారు. జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపై ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# కేబినెట్ సబ్‌కమిటీ

>> కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. అలాగే ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితునిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ కేబినెట్ సబ్ కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

# ఆహార భద్రతకు భరోసా

>> కింద మధ్యాహ్న భోజనం తదితర అవసరాలకు కలిపి నెలకు సుమారు 2.38 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని మంత్రి తెలిపారు. ఈ లెక్కన వార్షిక అవసరం 28.56 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు.

2026 అక్టోబర్ 16 నాటికి రాష్ట్రంలోని బఫర్ గోదాముల్లో 9.64 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇందులో కేంద్ర పూల్, ఇతర సంక్షేమ పథకాల కింద 3.50 లక్షల మెట్రిక్ టన్నులు, రాష్ట్ర పూల్ కింద 6.14 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్), ఇతర గుర్తించిన సరఫరాల ద్వారా మరో 18.39 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందాల్సి ఉందన్నారు.ప్రస్తుత నిల్వలు, అందాల్సిన బియ్యం కలిపితే మొత్తం లభ్యత 28.03 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ పరిమాణం ప్రజాపంపిణీ, ఇతర సంక్షేమ పథకాల అవసరాలకు సుమారు 11.7 నెలలపాటు, అంటే 2027 సెప్టెంబర్ వరకు సరిపోతుందని వివరించారు. మిల్లర్లు, ఇతర వనరుల నుంచి రావాల్సిన బియ్యం నిర్ణీత గడువులోగా ప్రభుత్వ గోదాములకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలతో భవిష్యత్తులో పంటలు దెబ్బతిన్నా లక్షలాది కుటుంబాల ఆహార భద్రతకు భంగం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

**నిత్యావసరాల పంపిణీపై కసరత్తు**

ధరల పెరుగుదల వల్ల పేద కుటుంబాలపై పడే భారాన్ని తగ్గించేందుకు రేషన్ వ్యవస్థ ద్వారా గోధుమపిండితోపాటు ఎంపిక చేసిన నిత్యావసర వస్తువులను అందించే అవకాశాన్ని మంత్రి పరిశీలించారు. గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి తదితర వస్తువుల పంపిణీ అంశం సమీక్షలో చర్చకు వచ్చింది. సబ్సిడీ ధరలకు అందించడంతోపాటు వివిధ పంపిణీ విధానాలకు సంబంధించిన వ్యయ అంచనాలను అధికారులు సమర్పించారు. లబ్ధిదారులకు అందించాల్సిన పరిమాణాలు, సరుకుల సేకరణ ఏర్పాట్లు, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని సమగ్రంగా లెక్కించాలని మంత్రి సూచించారు. ఈ వివరాలతో ప్రతిపాదన సిద్ధం చేసిన అనంతరం పంపిణీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సమీక్షలో పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లు

>> పత్తి తూకం, నిల్వ, రవాణా వంటి అంశాలపై తగిన చరర్యలు తీసుకున్నారు. కొనుగోళ్ల ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతుల నుంచి పత్తిని సకాలంలో సేకరించాలని నిర్ణయిచారు. గతంలో ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరీల ఆధారంగా జిన్నింగ్ మిల్లులను గుర్తించి, దశలవారీగా పత్తిని జిన్నింగ్ కోసం పంపించేవారు. అయితే ఈసారి ఎంపిక చేసిన 353 జిన్నింగ్ మిల్లులకు ఒకేసారి పత్తిని పంపించే ఆలోచన చేస్తున్నారు. దీంతో పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన తర్వాత జిన్నింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగించే అవకాశం ఉంది. కాగా మార్కెట్‌లో పత్తి ధరలపైనా రైతుల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కొన్ని ప్రైవేటు కొనుగోలు కేంద్రాల్లో ప్రాంతాన్ని బట్టి క్వింటా పత్తికి సుమారు రూ.8 వేల నుంచి రూ.8,300 వరకు ధర చెల్లిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనూ రైతులకు మంచి ధర లభిస్తుందని అధికారులు, రైతులు ఆశిస్తున్నారు. అయితే పత్తి నాణ్యత, మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ కొనుగోలు నిబంధనలను బట్టి రైతులకు లభించే ధరలో మార్పులు ఉండే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

20-10-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి.నవమి మ.12.47
న. శ్రవణ సా.5.58
వ.రా.10.15-రా.11.58
దు1. ఉ.8.20-ఉ.9.07
దు2. రా.10.24-రా.11.11
రాహు మ.3.00-మ.4.30 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** కార్యాలయంలో అనుకూలం. స్వల్ప ధనలాభ సూచన. చర్చలు ఫలవంతంగా సాగుతాయి.

**వృషభం :** నిదానమే ప్రధానమన్న విధంగా వ్యవహరిస్తారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహింగలుగుతారు.

**మిథునం :** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. బ్యాంక్ లావాదేవీలు లాభిస్తాయి. మంచితనం పదిమంది మెప్పును సాధిస్తుంది.

**కర్కాటకం :** లీజ్‌లు కాంట్రాక్ట్‌లు లాభిస్తాయి. ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా కలిగి ఉంటారు.

**సింహం :** ఆరోగ్యం నలతగా ఉంటుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు సానుకూల పడతాయి.

**కన్య :** కష్టించే తత్వాన్ని అలవరచుకుంటారు. ఇతరులకు కూడా నేడు మీవంతు సహాయ సహకారాన్ని అందిస్తారు.

**తుల :** వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. మీరు ఊహించని విధంగా పనులు సానుకూల పడతాయి.

**వృశ్చికం :** దీర్ఘాలోచనలు సాగిస్తారు. పరపతి కలిగిన వారితోటి పరిచయాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** మితిమీరిన ఆత్మ విశ్వాసంతో నిర్ణయాలు తీసుకుంటారు. సందర్భోచితమైన ప్రసంగాలను సాగిస్తారు.

**మకరం :** విభేదాలు ఏర్పడకుండా సమస్యలను ఆదిలోనే పరిష్కరించుకుంటారు. కండరాల నొప్పులు ఇబ్బంది పెడతాయి.

**కుంభం :** కొత్త దనాన్ని కోరుకుంటారు. గోప్యంగా వ్యవహరిస్తారు. అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు.

**మీనం :** మీరంటే గౌరవం, భయం ఏర్పడుతుంది. ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

21-10-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి.దశమి మ.2.07
న.ధనిష్ట రా.7.43
వ.రా.3.13-తె.4.53
దు.ఉ.11.28-మ.12.15
రాహు.మ.12.00-మ.1.30
శుభ ఉ.6.00-ఉ.7.00

## వార్తాఫలం

**మేషం :** భూవివాదాలు పరిష్కార దశకు చేరుతాయి. కీలక వ్యవహారాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**వృషభం :** సంతానానికి నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కళారంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**మిథునం :** వాహనాలు, ఆరోగ్య విషయాలలో మెలుకువ అవసరం. వృత్తిలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కర్కాటకం :** నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు.

**సింహం :** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. ఊహించని సంఘటన జరుగుతుంది.

**కన్య :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం :** సన్నిహితుల నుండి ఆసక్తికరమైన వార్తలు వింటారు. నూతన విద్యలపై ఆసక్తి చూపుతారు. వస్తువుల లాభం.

**ధనుస్సు :** ఎంతటి పనైనా పట్టుదలతో పూర్తి చేస్తారు. జీవిత భాగస్వామి సలహాతో సమస్యలు పరిష్కరించుకుంటారు.

**మకరం :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన జరుగుతుంది. విలువైన వస్తువులు ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం :** ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**మీనం :** సంతానానికి సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక అనారోగ్యాలు కొంతవరకు తీరుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు

>> పర్యటించిన ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్దేశిత గడువుకు పదిహేను రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచాలని తెలిపారు. నవంబరు నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు.'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ప్రాంగణంలో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సమ్మిట్ ఏర్పాట్లపై కసరత్తు చేయాలన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఆ స్థాయిలో సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు. బహిరంగ ప్రాంగణ పనులను నవంబరు 15లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' కేవలం వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని సీఎం అన్నారు. అందుకే సమ్మిట్ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు ఒక కమిటీని నియమించుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించే ముందు ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భవనంలోని కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించి తరుణ్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించిన ఆయన.. ఎఫ్‌సీడీఏ కార్యాలయఆవరణలో ఎన్ఐయుఎం(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంపస్ నమూనాను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యాసంగి సీజన్‌కు రాయితీపై విత్తనాలు

>> రైతులను ప్రోత్సహించడంతో పాటు రాయితీపై విత్తనాలు అందించనుంది. ఎల్‌నినో క్రమంలో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై వ్యవసాయ శాఖ ఒక నివేదికను సిద్ధం చేసింది. యాసంగి సీజన్‌కు రాయితీపై విత్తనాలు అందించేందుకు రూ.224 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని వల్ల రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయవనరులు లభిస్తాయని యోచిస్తోంది. రైతులకు రాయితీపై విత్తనాలు అందించడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించేలా ప్లాన్ చేస్తోంది. ఉద్యాన పంటలు సాగును పెంచి రైతులకు ఆదాయం లభించేలా వ్యవసాయశాఖ ప్రణాళికలు రచిస్తోంది. వరి పంటకు బదులుగా కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగు చేసేలా ప్రోత్సహించనుంది. వర్షాలు లేకపోవడంతో భూమిలో తేమ శాతం తగ్గుతుంది. దీని వల్ల మొక్కల పెరుగుదల మందగించడం వల్ల రైతులకు దిగుమబడి తగ్గే అవకాశముంది. నేలలో తేమను ఎలా కాపాడుకోవాలనే దానిపై పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలనే దానిపై ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎల్‌నినో పరిస్థితుల క్రమంలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక నివేదికను సిద్ధం చేసింది.

# పట్టణాలకు కొత్తరూపు

>> రూపొందించడంతో పాటు, ప్రజలకు అవసరమైన సదుపాయాలను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు ఒకదానికొకటి సంబంధం లేకుండా కాకుండా, సమగ్ర పట్టణ ప్రణాళికలో భాగంగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రణాళికల రూపకల్పన, అమలులో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) కీలక పాత్ర పోషిస్తోంది. పట్టణ స్థానిక సంస్థలకు సాంకేతిక సహకారం అందించడం, అధికారులకు శిక్షణ ఇవ్వడం, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, భవన అనుమతుల వ్యవస్థను మెరుగుపరచడం వంటి అంశాల్లో ఈ సంస్థ సేవలందిస్తోంది. పట్టణాల పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. పట్టణాల్లో చెరువులు, నీటి నిల్వలు, పచ్చని ప్రదేశాలను పరిరక్షించడంతో పాటు వర్షపు నీటి సంరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. భవిష్యత్‌లో వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునేలా పట్టణాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తూనే పర్యావరణ సమతుల్యతను కాపాడే విధంగా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన 2028 జూన్ 2 నాటికి పట్టణాల దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు.

# నవంబరు నుంచి సీతమ్మ సాగర్ పనులు

>> ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జలవనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, దీంతో విద్యుత్ వినియోగం, డిమాండ్ కూడా పెరిగి విద్యుత్ కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తవచ్చని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని అన్నారు. ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు చర్యలతో పాటు నీటి వినియోగాన్ని కూడా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. సమీపంలోని ప్రైవేటు జలవిద్యుత్ కేంద్రానికి నీటి వినియోగం విషయంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆనకట్టలో తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడు, అదనంగా ప్రవహించే మిగులు నీటిని మాత్రమే ఇతర అవసరాలకు వినియోగించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఇతర అవసరాలకు నీటి వినియోగాన్ని నియంత్రించాలని స్పష్టం చేశారు.సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి మాట్లాడుతూ, వివిధ అనుమతులు, న్యాయపరమైన అడ్డంకుల కారణంగా గత ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని అన్నారు.




మనోరి డీశాలినేషన్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా సోమవారం ముంబయి బాంద్రా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కోలి వర్గానికి చెందిన సభ్యులు, మత్స్యకారులు

# కూరగాయల ధరలు పైపైకి

>> మోతతో వినియోగదారులు కూరగాయల కొనుగోళ్లను గణనీయంగా తగ్గించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో టమాటా, ఉల్లిపాయలతో పాటు, ఇతర నిత్యావసర కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గడచిన రెండు వారాల్లో హైదరాబాద్‌లో టమాటా ధరలు ఒక్కసారిగా దూసుకెళ్లాయి. గతంలో రోడ్డు పక్కన రూ.20 ఉన్న కిలో టమాటా ధర ఇప్పుడు రూ.50కి చేరింది. ఇక సూపర్ మార్కెట్లలో అయితే కిలో రూ.60 వరకు అమ్ముతున్నారు. రోడ్డు పక్క మార్కెట్లలో 150 శాతం, సూపర్ మార్కెట్లలో 71 శాతం మేర ధరలు పెరిగాయి. తీవ్రమైన ఎండలు, నీటి కొరత, పంట నష్టం, మార్కెట్లకు సరుకు రాకపోవడం వంటి కారణాలే దీనికి ప్రధాన కారణమని టీఎస్ఐఈ నివేదించింది. మరోవైపు ఉల్లిపాయల ధరలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. నెల రోజుల క్రితం రూ.30 ఉన్న ఉల్లి ధర అక్టోబర్ ప్రారంభానికి రూ.65, ఇప్పుడు అది రూ.70కి చేరుకుంది. రైతుబజార్లలో రూ.45 నుండి రూ.50కి విక్రయిస్తుండగా, క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో కిలో రూ.70 వరకు కోట్ చేస్తున్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి ఉల్లి సరఫరా తగ్గిపోవడంతో మలక్‌పేట హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాల్ ధర జూలైలో రూ.18 వేల నుండి 20 వేల వరకూ ఉండగా, ఇప్పుడు రూ.45 వేల నుండి 52 వేలకు ఎగబాకింది. ఆయా ప్రాంతాల్లో వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, రైతులు నష్టాల కారణంగా సాగు తగ్గించడం ఇందుకు కారణమని వ్యాపారులు తెలిపారు. కేవలం టమాటా, ఉల్లి మాత్రమే కాకుండా వంకాయ, బెండకాయ, పచ్చిమిర్చి, కాకరకాయ, బీరకాయ వంటి ఇతర కూరగాయల ధరలు కూడా కిలో రూ.50కి పైగా పలుకుతున్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి, అల్లం ధరలు గతేడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. గతంలో ఒకేసారి మూడు నుంచి నాలుగు కిలోగ్రాముల కూరగాయలు కొనుగోలు చేసే వినియోగదారులు ఇప్పుడు తమ కొనుగోళ్లను సుమారు ఒక కిలోగ్రాముకు పరిమితం చేసుకుంటున్నారు. గతంలో 3 నుంచి 4 కిలోలు కొనుగోలు చేసిన వినియోగదారులు ఇప్పుడు కేవలం కిలోకు మాత్రమే పరిమితమవుతున్నారు.



గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ ఆలయంలో సోమవారం కన్యాపూజలు చేస్తున్న యుపి సిఎం యోగి

# యుపి సిఎం యోగి కన్యాపూజలు!

## మహార్నవమి సందర్భంగా విశేష కార్యక్రమాలు

**లక్నో, అక్టోబరు 19:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం మహార్నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ ఆలయంలో సంప్రదాయబద్ధంగా కన్యా పూజ నిర్వహించారు. శరన్నవరాత్రులలో భాగంగా తొమ్మిదో రోజున నిర్వహించే ఈ విశిష్ట పూజలో ఆయన పాల్గొన్నారు. శక్తి స్వరూపిణులైన బాలికలను ఆరాధించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ స్వయంగా బాలికల పాదాలను ప్రక్షాళన చేసి, వారికి తిలకం దిద్దారు. అనంతరం హారతి ఇచ్చి, పూజలు నిర్వహించి, వారికి వస్త్రాలు, ప్రసాదం, దక్షిణలను సమర్పించి గౌరవించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భండారా (సామూహిక భోజనం) ఏర్పాటు చేశారు.

అనంతరం యోగి ఆదిత్యనాథ్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, విజయదశమి వేడుకల సందర్భంగా కీలక సూచనలు చేశారు. పండుగను ప్రతిఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, అయితే అదే సమయంలో భద్రతా ప్రమాణాలను ఏమాత్రం విస్మరించకూడదని ఆయన కోరారు. చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి, దుర్గుణాల నుంచి విముక్తి పొందాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. శరన్నవరాత్రులలో నవమి తిథికి అత్యంత ప్రాముఖ్యత ఉందని, ఈ రోజున జగజ్జనని తొమ్మిదో స్వరూపమైన సిద్ధిధాత్రి అమ్మవారిని పూజిస్తారని యోగి వివరించారు. సనాతన ధర్మంలో మాతృశక్తికి ఇచ్చే అత్యున్నత గౌరవానికి కన్యా పూజ ఒక నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. మహిషాసురుడిపై దుర్గామాత సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగుస్తాయి.

# ప్రజలకు గవర్నర్ విజయదశమి శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** విజయదశమి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మంపై అధర్మం, సత్యంపై అసత్యం, మంచిపై చెడు సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతిఒక్కరిలో ధైర్యం, ధర్మనిష్ఠ, సత్ప్రవర్తన, సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో తెలంగాణశాంతి, సౌభాగ్యం,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలందరి జీవితాల్లో విజయం, ఆనందం వెల్లివిరియాలని గవర్నర్ ఆకాంక్షించారు. సమైక్యత, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యతతో ప్రగతిశీల తెలంగాణ పురోగతికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజలకు సిఎం రేవంత్ దసరా శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని అన్నారు.ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తుచేస్తుందన్నారు.

తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మిచెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటి చెబుతుందని అన్నారు.

# సింగరేణి వేతనాలు

>> ప్రకటించిన కొద్దిరోజులకే ఈ వేతన సవరణ నిర్ణయం వెలువడింది. సింగరేణి ఎగ్జిక్యూటివ్‌ల వేతన సవరణ వివరాలు: ఈ1 అధికారికి రూ.40,000 నుంచి రూ.60,000, ఈ2 క్యాడర్‌కి రూ.50,000 నుంచి రూ.70,000, ఈ3 లెవెల్ రూ.60,000 నుంచి రూ.80,000, ఈ4 లెవెల్ రూ.70,000 నుంచి రూ.90,000, ఈ5 లెవెల్ రూ.80,000 నుంచి రూ.1 లక్ష, ఈ6 లెవెల్ రూ.90,000 నుంచి రూ.1.20 లక్షలు, ఈ7 రూ.1 లక్ష నుంచి రూ.1.20 లక్షలకు పెరుగుతుంది.



## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో బండారు దత్తాత్రేయ భేటీ

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలోని అలై బలై ప్రతినిధి బృందం సోమవారం లోక్‌భవన్‌లో కలిసింది. ఈ నెల 22న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న అలై బలై వేడుకలకు గవర్నర్‌ను ఆహ్వానించింది.

**గవర్నర్‌ను కలిసిన దౌత్యాధికారులు**

ఈజిప్టులోని కైరోలో భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) సి. సుష్మ, కువైట్‌లోని భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) సంజయ్ కుమార్ ములుకా కూడా గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## మంత్రి పొంగులేటి, పిసిసి చీఫ్ మహేశ్‌కు బిఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు

### కొండపోచమ్మ సాగర్ నీటిని కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠను దెబ్బతీసేలా, కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి గడ్డం వంశీకృష్ణలకు బిఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు జారీ చేసింది. సోమవారం బిఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించారు. తమ సోషల్ మీడియా ఖాతాల్లో చేసిన సంబంధిత పోస్టులను తక్షణమే బేషరతుగా తొలగించి, తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని బిఆర్ఎస్ లీగల్ సెల్ డిమాండ్ చేసింది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని, నోటీసులకు స్పందించని పక్షంలో పరువునష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

## హైదరాబాద్‌లో 75 మంది ఎస్‌ఐల బదిలీ

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** నగర పోలీసు విభాగంలో 75 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కొత్వాల్ సజ్జన్నర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో శాంతి భద్రతల విభాగంతో పాటు ట్రాఫిక్, సిసిఎస్, ఎస్‌బి సహా ఇతర విభాగాలకు చెందిన వారు వున్నారు. బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## లష్కరే తోయిబా కీలక కమాండర్ చౌధరి మహమ్మద్ సర్వర్ మృతి

**లాహోర్, అక్టోబరు 19:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా కీలక కమాండర్, హాఫీజ్ సయీద్‌కు సన్నిహిత సహాయకుడిగా పేరొందిన



చౌధరి మహమ్మద్ సర్వర్ అలియాస్ అబూ అల్‌హాషీమ్ భాయ్ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. అతడి మరణానికి దారితీసిన పరిస్థితులు ఏమిటన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ పంజాబ్ విభాగానికి సర్వర్ అధ్యక్షుడిగా వ్యవహరించాడు. లాహోర్‌లోని మార్కజ్ ఖుదేసియాయ్ భవనం నాలుగో అంతస్తు నుంచి సర్వర్ అనుమానాస్పద పరిస్థితుల్లో కిందపడటంతో మరణించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. లష్కరే తోయిబా ఉగ్రవాద విభాగానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడంలో సర్వర్ కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. పంజాబ్ ప్రావిన్స్‌లో రాజకీయ విభాగమైన పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ ద్వారా నిధుల సమీకరణ, నిర్వహణకు కూడా అతడు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. సర్వర్‌కు హాఫీజ్ సయీద్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. లష్కరే తోయిబాలో సీనియర్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్న సర్వర్‌ను అమెరికా 2016లో ఉగ్రవాదిగా ప్రకటించింది. 2000వ సంవత్సరం నుంచి అతడు ఈ సంస్థ కార్యకలాపాల్లో చురుకుగా ఉన్నట్లు అమెరికా వర్గాలు పేర్కొన్నాయి. 2015 నుంచి లాహోర్ ప్రాంతానికి లష్కరే తోయిబా ఎమిర్‌గా కూడా అతడు బాధ్యతలు నిర్వహించినట్లు సమాచారం. గతంలో అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, లాహోర్‌లో లష్కరే తోయిబా ఎమిర్‌గా ఉన్న సర్వర్‌కు సంస్థలోని అత్యున్నత నాయకులతో సంబంధాలు ఉండేవి. 2012 నుంచి 2013 మధ్య కాలంలో లష్కరే తోయిబా విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ హాఫీజ్ అబ్దుల్ రెహమాన్ మక్కీతో సర్వర్ కలిసి పనిచేసినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. 2013 ప్రారంభంలో పాకిస్థాన్‌లో తన ప్రయాణ ఖర్చుల కోసం డబ్బు అవసరమని మక్కీ సర్వర్‌ను కోరినట్లు కూడా ఆ ప్రకటనలో పేర్కొంది. సర్వర్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు, ఘటన వెనుక ఉన్న పరిస్థితులపై మరింత సమాచారం వెలువడాల్సి ఉంది.


**From: Date: 07.10.2026**
**M/S. M.V. KINI LAW FIRM ADVOCATES,**
312/313, 3rd Floor, Diamond Towers, Sarojini Devi Road, Secunderabad - 500003. Telangana State.
hyderabad@mvkini.vcom
**To,**
**1. M/s. Legend Power Solutions,**
Rep. by its Proprietor,
Mr. Nakka Chandraih,
Plot No.4, Beside Inner Circle Hotel, Somajiguda, Hyderabad - 500082, Telangana State.
Mail ID. legenddgsets@gmail.com
**Also at:**
**M/s. Legend Power Solutions,**
Rep. by its Proprietor,
Mr. Nakka Chandraih, Shop/Factory: 1st Floor, H.No.6-3-456/13, Near Yashoda Hospital, Dwarakapuri colony, Panjagutta, Hyderabad - 500082, Telangana State.
...Respondent No.1
**Sub: I.A.No.2584 of 2025 (SECONDARY EVIDENCE PETITION) IN O.A.NO. 445 OF 2024 pending before the Hon'ble Debts Recovery Tribunal-II, Hyderabad.**
As per the directions of the Hon'ble Presiding Officer-2, dated 01-10-2026 has ordered for issuance of Notice to the Respondent No.1 through Paper publication in **"Vaartha", Telugu Daily, Newspaper.** Please take notice that the Petitioner in the above matter has filed **I.A.No.2584 of 2025 (SECONDARY EVIDENCE PETITION)** and the same is posted to 16-11-2026 for hearing and appearance. This is for your information.
**For Ms M.V. Kini Advocates**


# బెయిల్ విచారణలో మేజిస్ట్రేట్‌కు బెదరింపులు!

### గుర్తుతెలియని వ్యక్తులపై ఢిల్లీ పోలీసుల ఎఫ్ఐఆర్

### సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా విడుదలలో జాప్యంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపణలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయ కులు ఆశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌ల బెయిల్ విచారణకు సంబంధించి ప్రత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేట్‌ను బెదిరించినట్లు వచ్చిన ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ విషయాన్ని పోలీసు వర్గాలు వెల్లడించాయి. బెయిల్ విచారణ సమయంలో తనకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయని మెజిస్ట్రేట్ ఆరోపించడంతో పోలీసులు తొలుత నాన్‌కాగ్నిజబుల్ రిపోర్టు నమోదు చేశారు. తాజాగా ఈ వ్యవహారంలో గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. మరోవైపు, తమ పార్టీ నాయకుల విడుదలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని సీజేపీ ఆరోపిస్తోంది. బెయిల్‌కు సంబంధించిన నాలుగు పూచీకత్తులను అస్పష్టమైన కారణాలతో తిరస్కరించారని పార్టీ పేర్కొంది. మెజిస్ట్రేట్‌కు బెదిరింపులు వచ్చినట్లు వచ్చిన వార్తలు, బెయిల్ విచారణలో జాప్యంపై సీజేపీ చేసిన ఆరోపణల నేపథ్యంలో న్యా యవాది ఖుష్బూ జైన్ స్పందించారు. ఎలాంటి తుది నిర్ణయానికి వచ్చే ముందు సంబంధిత ఫిర్యాదులు, ఉత్తర్వులను మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చట్ట ప్రకారం న్యాయ ప్రక్రియ కొనసాగాలని, బెదిరింపులు లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకూడదని ఆమె పేర్కొన్నారు. మీడియా కథనాలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, సీజేపీ నాయకుల బెయిల్ విచారణకు సంబంధించి తన ప్రాణాలకు ముప్పు ఉందని ప్రత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేట్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.



బెదిరింపుల ఆరోపణలు లేదా విచారణ వాయిదా వేయడానికి గల కారణాలపై తుది నిర్ణయానికి రావాలంటే సంబంధిత ఫిర్యాదు, ఉత్తర్వులను పరిశీలించాలని ఖుష్బూ జైన్ తెలిపారు. విచారణను ప్రభావితం చేయడానికి లేదా అడ్డుకోవడానికి నిజంగానే బెదిరింపులకు పాల్పడితే, అది న్యాయ నిర్వహణలో తీవ్రమైన జోక్యంగా పరిగణించాలి. దీనిపై విచారణ జరిపి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి. న్యాయపరమైన అధికారాలు వినియోగించే అధికారి ఎలాంటి బెదిరింపులు, బాహ్య ఒత్తిళ్లు లేకుండా స్వతంత్రంగా విధులు నిర్వహించగలగాలని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో అధికారుల స్పందన మేజిస్ట్రేట్ భద్రతను మాత్రమే కాకుండా, బెయిల్ కోరుతున్న వారి వ్యక్తిగత స్వేచ్ఛను కూడా కాపాడేలా ఉండాలని ఖుష్బూ జైన్ అన్నారు. విచారణ వాయిదా వేస్తే అందుకు సంబంధించిన కారణాలను అధికారికంగా నమోదు చేయాలి. సంబంధిత అధికారి విచారణను కొనసాగించలేని పరిస్థితి ఉంటే, నిర్దేశిత విధానం ప్రకారం ఈ కేసును వెంటనే మరో సమర్థ అధికారి ముందు ఉంచాలి. బెదిరింపుల ఆరోపణలను బెయిల్ దరఖాస్తులోని అంశాల నుంచి వేరుగా పరిశీలించాలి. ఆధారాలు లేనప్పుడు ఈ బెదిరింపులకు దరఖాస్తుదారులే బాధ్యులని ఆరోపించకూడదని ఆమె వివరించారు. మరో ప్రకటనలోనూ ఆమె ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. చట్టబద్ధమైన ప్రక్రియే మార్గదర్శక సూత్రమని, విచారణాధికారిపై బెదిరింపులు లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన నిర్ణయాల్లో నివారించగలిగే జాప్యం న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకూడదని పేర్కొన్నారు. సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. నిరసనలకు నిర్దేశించిన ప్రాంతంగా గుర్తింపు తొలగించిన జంతర్ మంతర్‌లోకి, తాళం వేసి ఉన్న గేట్లను ఎక్కి వారు ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం

### ప్రైవేట్ వ్యక్తులూ ఫిర్యాదు చేయొచ్చు: సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలకు పాల్పడిన ఎన్నికల అభ్యర్థులపై ప్రైవేట్ వ్యక్తులు కూడా ఫిర్యాదు చేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 125ఎ కింద ఇలాంటి ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని వెల్లడించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు సభ్యులుగా ఉన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973లోని సెక్షన్ 195(1) పరిధిలోకి ఈ తరహా ఫిర్యాదులు రావని ధర్మాసనం పేర్కొన్నట్లు లైవ్ లా వెల్లడించింది. కొన్ని నేరాలకు సంబంధించి సంబంధిత ప్రభుత్వ అధికారి మాత్రమే ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని సెక్షన్ 195(1) నిర్దేశిస్తుంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125ఎను సెక్షన్ 195(1) పరిధిలో చేర్చలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ పత్రాలు లేదా అఫిడవిట్‌లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు ఇవ్వడం, కీలక సమాచారాన్ని దాచిపెట్టడం వంటి చర్యలకు పాల్పడే అభ్యర్థులకు సెక్షన్ 125ఎ శిక్షను నిర్దేశిస్తుంది. చట్ట సవరణ చేసి ఉండేవారు ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో అభ్యర్థి అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన సందర్భాల్లో, ప్రభుత్వ అధికారి ఫిర్యాదు చేస్తేనే న్యాయస్థానం కేసును పరిగణనలోకి తీసుకోవాలన్నది శాసనసభ ఉద్దేశమై ఉంటే, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 195కు సవరణ చేసి ఆ విషయాన్ని స్పష్టంగా చేర్చే అవకాశం ఉండేది" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సెక్షన్ 125ఎను 2002లో అమల్లోకి తీసుకురాగా, సిఆర్‌పిసిలోని సెక్షన్ 195కు 2006లో సవరణలు చేసిన విషయాన్ని జస్టిస్ దత్తా ప్రస్తావించారు. అయినప్పటికీ సెక్షన్ 125తిను సెక్షన్ 195 కింద పేర్కొన్న నేరాల జాబితాలో పార్లమెంట్ చేర్చలేదని ధర్మాసనం గుర్తుచేసింది. దీన్ని ఉద్దేశపూర్వకంగానే చేసిన మినహాయింపుగా పరిగణించవచ్చని పేర్కొంది. సెక్షన్ 125ఎ కింద ఫిర్యాదు చేయడానికి ప్రభుత్వ అధికారి మాత్రమే అర్హుడని చెప్పే నిబంధన ఏ చట్టంలోనూ లేదని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇతర చట్టాల్లో ఏవైనా నిబంధనలు ఉన్నప్పటికీ ఈ సెక్షన్ వర్తిస్తుందనే భావాన్ని దాని శిక్షా నిబంధనలోని పదజాలం సూచిస్తోందని పేర్కొంది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాజ్‌కుమార్ మడ్కీ అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించే క్రమంలో సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. కర్ణాటక శాసనసభ్యుడు డాక్టర్ శైలేంద్ర బెల్దాలేపై ఆయన చేసిన క్రిమినల్ ఫిర్యాదును హైకోర్టు కొట్టివేసింది. బీదర్ నియోజకవర్గం నుంచి 2023లో ఎమ్మెల్యేగా ఎన్నికైన శైలేంద్ర బెల్దాలే, తన అఫిడవిట్‌లో నివాస చిరునామాకు సంబంధించి తప్పుడు ప్రకటన చేశారని పిటిషనర్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లలో తప్పుడు సమాచారం ఇచ్చే అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయంలో ఈ తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది.

## సరస్ మేళాలో రూ.9.29 కోట్ల రికార్డు అమ్మకాలు

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్న సరస్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ నెల 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో నిర్వహించిన మేళాలో రికార్డు స్థాయిలో రూ.9.29 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. మేళాను మొత్తం 5,98,029 మంది సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేశారు. 225 స్టాళ్లతో నిర్వహించిన ఈ మేళా మహిళా వ్యాపారులకు మంచి మార్కెట్ వేదికగా నిలిచింది.

చివరి నాలుగు రోజుల్లో ప్రతిరోజూ రూ.కోటికి పైగా అమ్మకాలు జరగడం విశేషం. సరస్ మేళా విజయవంతం కావడం, మహిళా సంఘాల ఉత్పత్తులకు పెద్దఎత్తున ఆదరణ లభించడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించి, వారి కష్టానికి తగిన ఆదాయం సమకూరడం సంతోషకరమని పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగి, సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ స్వావలంబన సాధించాలన్నదే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. సరస్ మేళాలో గత మూడేళ్ల అమ్మకాల గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాల ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ స్పష్టమవుతుంది. 2024లో రూ.7.81 కోట్ల అమ్మకాలు జరగగా, 2025లో రూ.3.28 కోట్ల వ్యాపారం నమోదైంది. ఈ ఏడాది ఏకంగా రూ.9.29 కోట్ల అమ్మకాలు జరిగాయి. 2025తో పోలిస్తే ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగాయి. అలాగే సందర్శకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2025లో 1,69,015 మంది మేళాను సందర్శించగా, ఈ ఏడాది 5,98,029 మంది సందర్శించారు.

మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, చేనేత వస్త్రాలు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభించింది. అమ్మకాలు ఆశించిన స్థాయిని మించడంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## అతిపెద్ద గ్యాంగ్‌స్టర్‌ను అల్లుడిలా చూసుకుంటున్న కేంద్రం

### ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఎద్దేవా



**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనపై ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశంలో నేరాలు, భద్రత విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించారు. నేర కార్యకలాపాలు నిర్వహించడానికి కేంద్రం ఒక గ్యాంగ్‌స్టర్‌కు సౌకర్యాలు కల్పించిందని ఆరోపించారు. బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ శాంతిభద్రతలను కాపాడుకోలేకపోతోందని మండిపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్యాంగ్‌స్టర్‌ను అల్లుడిలా చూసుకుంటూ, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నేరాలకు పాల్పడటానికి అతడికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. త్వరలో జరగబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల గురించి కూడా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అక్కడ కమలం పార్టీకి ఓటు వేయడమంటే పంజాబ్‌లోకి గ్యాంగ్‌స్టర్‌ను ఆహ్వానించడమేనని హెచ్చరించారు. ఈ విషయం పంజాబ్ ప్రజలకి తెలుసన్నారు. మరికొద్ది రోజుల్లో బీజేపీకి చెందిన వ్యక్తులు శాంతి భద్రతలపై ఉపన్యాసాలు ఇవ్వడానికి పంజాబ్‌కు వస్తారని ఎద్దేవా చేశారు. మరోవైపు, టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ముంబయి పోలీసులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 109(1) (హత్యాయత్నం), సెక్షన్ 3(5) (ఉమ్మడి ఉద్దేశంతో చేసిన నేరపూరిత చర్యలు) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

## మహారాష్ట్రలో సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీని రట్టు చేసిన ఈగల్

### బీబీనగర్, మౌలాలిలో రట్టయిన రాకెట్‌లతో లింకులు



మహారాష్ట్రలో ఈగల్ పోలీసులు రట్టు చేసిన సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీ

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని గోండియా జిల్లా మారేగాంలో గుట్టుగా సాగుతున్న సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీని రాష్ట్ర ఈగల్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. గత ఆగస్టు నెల ఎనిమిదవ తేదీన హైదరాబాద్ శివార్ల లోని బీబీ నగర్, మౌలాలిలో వెలుగు చూసిన సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీల రాకెట్‌కు దీనికి సంబంధం వుందని తేలింది. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా సోమవారం మీడియాకు వెల్లడించారు. బీబీ నగర్‌లో వెలుగు చూసిన సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీ కేసులో భారీగా మెఫెడ్రోన్‌తో పాటు ఎసెటోన్ పట్టుబడగా ముగ్గురు నేరగాళ్లు అరెస్టయ్యారు. వీరిని విచారించగా నగర శివార్లలోని మౌలాలిలో గల వెటు కూరి లాబ్‌లో తయారవుతున్న సింథటిక్స్ డ్రగ్స్ బండారం రట్టయ్యింది. ఈ కేసులో మరో నలుగురు అరెస్టవగా తదుపరి విచారణ సాగుతున్న తరుణంలో మహారాష్ట్రలోని మారేగాంలో కొనసాగుతున్న మరో సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీ బంగారం బట్టబయలయ్యింది. జెస్ఎవి గ్లోబల్స్ పేరిట కొనసాగుతున్న ఈ సింథటిక్స్ డ్రగ్స్ ఫ్యాక్టరీ బీబీ నగర్, మౌలాలిలో రట్టయిన ఫ్యాక్టరీలతో లింకులున్నట్లు తేలింది. తాజా కే సులో జెఎస్‌వి గ్లోబల్స్ యజమాని జయ్‌రాజ్ కృష్ణ శెట్టితో పాటు అతని అనుచరులుగా వున్న నల్లగొండ జి ల్లా అక్కినపల్లి వాసి సద్దాంహుస్సేన్, పెనుమత్స రాకేష్ వర్మను అరెస్టు చేశారు. ఇందులో రాకేష్ శర్మను ఎన్‌సిబి గత జూలై నెల 23వ తే దీన అరెస్టు చేసి ఇండోర్ జైల్లో వుంచగా తాజాగా అతన్ని మహారాష్ట్ర కేసులో ఈగల్ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఈ కేసులో అయూబ్ అలీ, చంద్రప్రదీప్‌ఠాకూర్, ఏటకూరి రామరాజు, ప్రియాచేతన్ మెశ్రం, నిప్త హీరాలాల్ గరుడె, ఇక్రముల్ హుస్సేన్, ఫిర్దోస్ అహ్మద్, మొయినుల్ హక్, మఫిదుల్ ఇస్లా ం, కిషన్ సింగ్, తుఫాన్ సింగ్, పెద్దిరెడ్డి రాము, ఫాద్ ఫయాజ్ షేక్ అనే 13 మంది పరారీలో వున్నారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృ ందాలు రంగంలో దించామని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా తెలిపారు. డ్రగ్స్‌కు సంబం ధించి ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి

### వచ్చే నెలాఖరులోగా పనులు పూర్తి చేయకుంటే కన్నేపల్లి వద్ద ఆందోళన

### మేడిగడ్డను బూచిగా చూపి రైతులకు నష్టం చేయొద్దు

### తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**మహాదేవపూర్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నుంచి రైతాంగాన్ని గట్టెక్కించాలంటే వెంటనే కన్నేపల్లి పంప్ హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యామ్‌ను నిర్మించి, ప్రాణహిత నీళ్లను మళ్లిం చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో నెలన్నర రోజుల్లో పూర్తి చేయగల ఈ డ్యామ్ నిర్మాణ ప్రతిపాదనపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించిన ఆమె, ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాఫర్ డ్యామ్ నిర్మాణం, దానివల్ల రైతులకు కలిగే ప్రయోజ నాలను వివరించారు. ప్రాణహిత నదిలో ప్రతిరోజూ 2 టీఎంసీల నీరు ప్రవహిస్తుందని, ఆ నీటిని సమర్థవంతంగా వాడుకుంటే కరువును జయించవచ్చని తెలి పారు. నిపుణులతో మాట్లాడి ఈ సాంకేతిక పరిష్కారాన్ని రూపొం దించామని, దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 1.10 కోట్ల ఎకరాల పంటకు సాగునీరు, విద్యుత్ అవసరమని, నవంబర్ నెలాఖరు వరకు రైతులకు ఉచిత కరెంట్, నీటి సరఫరా నిరంత రాయంగా అందించాలని కోరారు. నవంబర్ లోగా కాఫర్ డ్యామ్ నిర్మించకపోతే కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ వచ్చి 13 ఏళ్లవుతున్నా మన నీటి వాటాను సంపూర్ణంగా వాడు కోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం కోసం రూ. 93 వేల కోట్లు ఖర్చు చే సినా ఆశించిన కొత్త ఆ యకట్టు రాలేదని, ప్రస్తు త కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసినా తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని విమర్శిం చారు. మేడిగడ్డ బ్యారేజ్ పనులు పూర్తి చేయ డానికి ఇదే సరైన సమయమని, అలాగే మంథని నియోజక వర్గంలోని



సోమవారం పార్టీ నాయకులతో కలిసి కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తర్వాత ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి ముంపు బాధితులకు తగిన పరిహారం అందించాలని మంత్రి శ్రీధర్ బాబును డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మాజీ మంత్రి బోడ జనార్దన్, సీనియర్ నాయకులు రియాజ్ అహ్మద్, ఇస్మాయిల్, నవీన్ కుమార్, రవిచంద్ర, వెంకట్, నరేశ్ నేత తదితరులు పాల్గొన్నారు.




వార్త

గొప్ప మేధ నలుగురూ నడిచిన దారిలో నడవదు. ఇది ఇంతవరకూ ఆవిష్కరించని మార్గాలను అన్వేషిస్తుంది.

- లింకన్

# 'కరవు' పై కలవరపాటు!

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరవు మండలాల ప్రకటన వ్యవసాయ రంగాన్ని, ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులను కలవరపెడుతోంది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోయిన పొలాలు, అడుగంటిన భూగర్భ జలాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే, ప్రభుత్వాలు కొన్ని మండలాలను మాత్రమే కరవు ప్రాంతాలుగా ప్రకటించి, సమానంగా నష్టపోయిన పక్క మండలాలను వదిలేయడం అనేక అనుమానాలకు, వివాదాలకు దారితీస్తోంది. కరవు ప్రకటనకు కేంద్ర మార్గదర్శకాల ప్రకారం వర్షపాత లోటు, భూగర్భ జలాల మట్టం, పంట నష్టం, శాటిలైట్ సూచికలను ఉపయోగిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఉమ్మడి ఖమ్మం కృష్ణా లేదా నల్గొండ, గుంటూరు సరిహద్దు మండలాల్లో వాతావరణం,వర్షపాతం, వర్షాభావ పరిస్థితులు ఒకేలా ఉంటాయి. కానీ, సరిహద్దులో ఆంధ్రప్రదేశ్ వైపు ఉన్న ఒక మండలాన్ని 'కరవు మండలం'గా ప్రకటిస్తే, దానికి కేవలం కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న తెలంగాణ వైపు మండలాన్ని మినహాయించారు. భౌగోళికంగా ఒకే వాతావరణం ఉన్నప్పటికీ, రెవెన్యూ ప్రకటనల్లో ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని 45 మండలాలు తీవ్ర కరవు బారిన పడ్డాయి. జూన్, ఆగస్టుల మధ్య కేవలం 112 మి.మీ వర్షపాతం నమోదై, సాధారణం కంటే 58 లోటు. అనంతపురం, కడప, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాల్లో భూగర్భ జలాలు 400 అడుగులకు పడిపోయాయి. పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరుసగా మూడో ఏడాది వరుణుడి కృప అందక వ్యవసాయం కుదేలైంది. నివేదికల ప్రకారం సరిహద్దుల్లో ఉండే మండలాల్లో దాదాపు ఒకే రకమైన వాతావరణం, వర్షాభావం ఉంటుంది. కానీ ఒక మండలాన్ని 'కరవు మండలం'గా ప్రకటించి, పక్కనే ఉన్న మండలాన్ని మినహాయించడం ద్వారా రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. శాటిలైట్ గణాంకాలు లేదా సగటు వర్షపాతం కాగితాలపై సరిగ్గా కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విత్తనాలు మొలకెత్తక, వేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వాలు కరవు మండలాల సంఖ్యను వీలైనంత తగ్గించడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. ఎక్కువ మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటిస్తే ఉచిత ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్టపరిహారం, బ్యాంక్ రుణాల రీషెడ్యూలింగ్, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు , తాగునీటి సరఫరా వంటి ఉచిత ఉపశమన చర్యలకు భారీగా నిధులు కేటాయించాలి. మండల స్థాయిఅధికారుల ప్రాథమిక క్షేత్రస్థాయి నివేదికలకు సచివాలయ/ జిల్లాస్థాయి సమాచారానికి మధ్య సమన్వయం లోపించడం వల్ల కొన్ని ప్రాంతాలు జాబితా నుంచి మాయమవుతున్నాయి. కరువు జాబితాలో చేరని మండలాల్లోని రైతులకు క్రింది సమస్యలు ఎదురవుతాయి. పంటల నష్టపరిహారం పొందలేరు. బ్యాంక్ రుణాలు రీషెడ్యూల్ కావు, దీనివల్ల ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఆదరణ లభించక వ్యవసాయ కూలీలు, చిన్నకారు రైతులు ఉపాధి కోసం నగరాలకు వలస బాట పడతారు. మినహాయించిన మండ లాల విషయంలో కేవలం కాగితపు నివేదికల పైనే ఆధారపడకుండా, జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో క్షేత్రస్థాయి రీ సర్వే తక్షణమే జరపాలి. కేంద్ర సాయం కోసం నివేదికలు పంపడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధుల ద్వారా మినహాయించిన మండలాల్లోని బాధిత రైతులకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ లేదా ప్రత్యేక సహాయం అందించాలి. కరవు జాబితాతో సంబంధం లేకుండా తాగునీటిఎద్దడి, పశుగ్రాసం కొరత ఉన్న ప్రతి గ్రామానికి అత్యవసర సదుపాయాలు కల్పించాలి. కరవు మండలాలను ప్రకటించడానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్షపాతలోటు శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, భూగర్భ జలాలు అనే మూడంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇక్కడే ప్రధాన లోపాలు బయటపడ్డాయి. మండలంలో ఏదో ఒక రోజు మాత్రమే భారీ వర్షం పడి, మిగిలిన సీజన్ అంతా ఎండిపోతేకాగితాలపై 'సాధారణ వర్ష పాతం'గా నమోదవుతుంది. దీనివల్ల వర్షాభావంతో పంట నష్టపోయిన మండలాలను సాంకేతికంగా మినహాయించారు. ఉపగ్రహ చిత్రాలు గడ్డి లేదా కలుపు మొక్కల పచ్చదనాన్ని కూడా 'పంట పచ్చదనం'గా నమోదు చేయడం వల్ల పంటలు ఎండిపోయిన మండలాలకు కరువు జాబితాలో స్థానం దక్కలేదు. ఖజానాపై పడే ఈ భారీ ఆర్థిక భారాన్ని నివారించడానికి ప్రభుత్వాలు కరవు మండలాల సంఖ్యను తగ్గించడమంటే రైతును అధఃపాతాళానికి తొక్కినట్లే! చూపుతున్నాయనే విమర్శ ఉంది. గ్రామీణ సచివాలయాలు/వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలకు, విపత్తు నిర్వహణ శాఖ ప్రకటించిన తుది జాబితాకు మధ్య తీవ్ర సమన్వయ లోపం కనిపిస్తోంది. కింది స్థాయి అధికారులు కరవు తీవ్రంగా ఉందని నివేదికలిచ్చినా, సచివాలయ స్థాయి స్క్రీనింగ్‌లో అనేక మండలాలు తొలగించబడ్డాయి. తక్షణ ప్రభావపక్క మండలంలో ఉన్న రైతుకు పరిహారం, ఉచిత విత్తనాలు లభిస్తుంటే, సరిహద్దు దాటినందుకే పంట పూర్తిగా నష్టపోయిన ఇతర రైతు రూపాయి కూడా పొందే అర్హత కోల్పోతున్నాడు. బ్యాంకులు రుణాల రీషెడ్యూలింగ్‌కు అంగీకరించకపోవడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. శాస్త్రీయ సాంకేతిక విధానాలను ఉపయోగించడం మంచిదే అయినప్పటికీ, మానవీయ దృక్పథం, క్షేత్రస్థాయి నిజాయితీ వర్టికల్ సర్వేలు లేకపోతే కరవు ఎంపిక ప్రక్రియలో ఇలాంటి తారతమ్యాలు, లోపాలు పునరావృతమవుతూనే ఉంటాయి. పునఃసమీక్ష ద్వారా బాధితులకు న్యాయం చేయడమే సరైన మార్గం.



దృఢమైన, బలశాలియైన, తీవ్ర మేధాశక్తి గల ఉత్సాహవంతుడైన మనిషి మాత్రమే పరమేశ్వరుని చేరగలుగుతాడు.

స్వామి వివేకానంద



ఒకప్పుడు మానవుడు జీవితంలో నటన వృత్తిగా తీసుకునేవాడు. ఇప్పుడు నటనే జీవితంగా జీవిస్తున్నాడు.

అక్కినేని నాగేశ్వరరావు

## ప్రజావాక్కు



### రావణ కాష్టం

ఈ మధ్య ప్రధాని నరేంద్ర మోడీ గారు లఢక్ ప్రాంతం భారత్‌కు ముఖ్యమైనదని దానిని సంరక్షించుకునేందుకు ప్రాధాన్యమిస్తామని చెప్పుకొచ్చారు. చైనా మన సొంత గడ్డ అయిన అరుణాచల్ ప్రదేశ్‌లో వేల మైళ్ల ప్రదేశాన్ని కబ్జా చేసి తన ఆధీనంలోకి తెచ్చుకుందని వార్తా పత్రికల ద్వారా దశాబ్దాల క్రితమే తెలుసుకున్నాం. దీనిపై భారత్ స్పందన ఏమిటి? వీటన్నిటికన్నా అతి ముఖ్యమైనది, జటిలమైనదిపాకిస్థాన్ ఆన్యాయంగా ఆక్రమించిన కాశ్మీర్‌లోని భారత భూభాగం.ఈసమస్య రావణ కాష్టంలా స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి కాలుతూనే ఉంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మన ప్రధాని ఈ భాగాన్ని భారత్‌లో శాశ్వతంగాకలిపే చర్యలు ఎందుకు తీసుకోలేదు? ఎందుకీ తాత్సారం?పాక్‌తో యుద్ధం చేసి బంగ్లాదేశ్‌ను ఏర్పరచిన మనకు ఇదొక సమస్యా? మనసుంటే మార్గం దొరకదా?

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### ఆడవారిని గౌరవిద్దాం

ఆడపిల్లలను మన సోదరీమణులుగా భావించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఎక్కడైనా మహిళలను గౌరవంగా చూడాలి,వారికి అవసరమైనప్పుడు అండగా నిలిచి రక్షణగాఉండాలి.చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆడపిల్లలను, మహిళలను గౌరవించడం, వారితో మర్యాదగా, బాధ్యతగా మెలగడం తల్లిదండ్రులు నేర్పించాలి. ప్రతి తల్లిలో అమ్మను,ప్రతి సోదరిలో ఆత్మీయతను చూడగలిగే మంచి సంస్కారాన్ని పిల్లల్లో పెంపొందించాలి. స్త్రీలను గౌరవించడం కేవలం ఒకరి బాధ్యత కాదు, మంచి సమాజాన్ని నిర్మించడానికి అందరి బాధ్యత.స్త్రీకి ఇచ్చే గౌరవమే మన వ్యక్తిత్వానికినిజమైన గుర్తింపు.ప్రతి స్త్రీలోఅమ్మను చూడగలిగితే, ఆ దేవుడిని సేవించినట్టే.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### మినీ బస్సులు అవసరం

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న 12769 గ్రామాలకు వెళ్ళడానికి గాను మినీ బస్సులు అవసరం. చిన్న రోడ్డులలో సులువుగా వెళ్ళగలవు. తక్కువ మంది ప్రయాణికులు ఉంటారు. సిటీలలో కూడా చాలా అవసరం ఉంటాయి. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి. నిరుద్యోగ యువతకు బ్యాంక్ రుణ సౌకర్యం కలిపించాలి. ఆటో కార్మికులకు సామూహిక మినీ బస్సు కొనుగోలు పథకం పెట్టాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### అతి వినయం ..

అవసరానికిమించి అతిగా వంగినమస్కరిస్తూ, వినయం ప్రదర్శించేవారినిఅసలునమ్మకూడదు.వాళ్ళ నిజస్వరూపాన్ని, స్వార్థాన్ని కప్పిపుచ్చుకోవడానికి పైకి నకిలీ వినయాన్ని ప్రదర్శిస్తారు. ఎప్పుడూ తానే ప్రత్యేకంగా కనిపించాలని భావిస్తారు. ఇలాంటి వారు మనకు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటారు. ఎవరైనామనపైఅతిగాపొగడ్తలుకురిపించినా,విపరీతమైన మర్యాద చూపించినా, వారిపట్ల అప్రమత్తంగాఉండాలి. పొగడ్తలు అవసరమేగానీ వాటిపైనే ఆధారపడకూడదు. పొగడ్తలను జాగ్రత్తగా గమనించకపోతే అన్ని విధాల నష్టపోతాం. కొందరు తమలోని చెడు గుణాలను కప్పిపుచ్చుకునేందుకు ఎదుటివారి ముందు చాలా అతి వినయం ప్రదర్శిస్తుంటారు. వినయవిధేయతలతో మెలగానేగానీ, అతి వినయం అసలు పనికిరాదు. వారు చెప్పే మాయ మాటలు నిజమని నమ్మినట్లయితే వారి చేతిలో దారుణంగా మోసపోయినట్లే!

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### ముందుగా అంచనా వేయాలి

ఒకే దేశంలో, ఒకే సమయంలో ఒక ప్రాంతం చుక్క నీటి కోసం ఎదురుచూస్తుంటే మరో ప్రాంతం వరద నీటిలో మునిగిపోవడం భారత భౌగోళిక వైవిధ్యానికి విషాదకరమైన ప్రతిబింబం. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇదే విరుద్ధ దృశ్యం ఒక్కోసారి ఒకే రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కనిపిస్తుంది. ప్రకృతివైవిధ్యం సహజమే అయినా, ప్రజల కష్టాలు మాత్రం ప్రతి ఏటా పునరావృతం కావడం సహజం కాదు. వర్షం తక్కువైతే కరువు, ఎక్కువైతే వరద అన్నట్టుగా పరిస్థితి మారింది. ప్రతి ఏడాది ఉపశమన చర్యల కోసం ఎదురుచూసే దేశం నుంచి, విపత్తులను ముందుగానే అంచనా వేసి వాటి ప్రభావాన్ని తగ్గించే దేశంగా భారత్ మారాల్సిన సమయం వచ్చింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కేంద్రంపై ఆధారపడకూడదు

కేంద్రప్రభుత్వ నిధులపైన ఎక్కువ ఆధారపడుతూ ఉపాధి హామీ మీద లేదా వీబీజీరామ్ జి మీద ఆసక్తిని తగ్గిస్తున్నాం. దానికి ప్రధాన కారణం డబ్బులు. పనిచేసిన చాలా రోజులకు పడడమే అనే అపవాదు ఉంది.కానీ అది నిజం కాదు. కేంద్ర ప్రభుత్వ నిధులపైన అతిగా ఆధారపడుతూ ఇతర నిధులను సమకూర్చుకోవడానికి ఆసక్తిని కల్పించలేకపోతున్నాం. సర్పంచులను కూడా ఆవైపుగా మళ్లించినం కానీ ఇది లాంగ్‌రన్‌లో ఇబ్బంది పెడుతుంది.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# డిజిటల్ సమానత్వమే లక్ష్యం!

భారతదేశ డిజిటల్ పురోగతిని ఇంటర్నెట్ కనెక్షన్ల సంఖ్యతో మాత్రమే కొలవలేం. మారుమూల గ్రామంలోని విద్యార్థికి నాణ్యమైన విద్యా వనరులు అందుతున్నాయా? తక్కువ ఆదాయ కుటుంబాలు అధిక ఖర్చుల భారం లేకుం డా ప్రభుత్వ సేవలను పొందగలుగుతున్నాయా? దివ్యాంగులు, డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు కూడా ఈ అవకాశాలను వినియోగించుకోగలుగుతున్నారా? అన్నప్రశ్నలే అసలు ప్రగతికి కొలమానాలు కావాలి. సుప్రీంకోర్టు తీర్పు డిజిటల్ సమానత్వానికి రాజ్యాంగపరమైన బలాన్నిఇచ్చింది. ఇప్పుడు దాన్ని ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇంటర్నెట్ కొందరికే అందుబాటులో ఉండే సౌకర్యంగా కాకుండా, ప్రతి ఒక్కరికీ విద్య, ఉపాధి, సమాచారానికి సమాన అవకాశాలను కల్పించే సాధనంగా మారాలి. అప్పుడే ఈ ప్రాథమిక హక్కు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకురాగలదు.

దుంగ జయరాం

ఇంటర్నెట్‌ను పొందడం ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు గుర్తించడం భారత రాజ్యాంగ పరిణామంలో కీలక ముందడుగు. విద్య, ఉపాధి, ప్రభుత్వ సేవలు, ఆర్థిక కార్యకలాపాలు డిజిటల్ మాధ్యమాలపై ఆధారపడుతున్న ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ కేవలం సాంకేతిక సౌకర్యం కాదు. సమాచారాన్ని పొందడానికి, భావాలను వ్యక్తం చేయడానికి, సమాజంలో భాగస్వాములు కావడానికి అవసరమైన సాధనం. అయితే, ఈ హక్కుకు రాజ్యాంగ గుర్తింపు లభించడంతోనే లక్ష్యం నెరవేరదు. ఆర్థిక స్థితి, ప్రాంతం, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చినప్పుడే ఈ తీర్పుకు నిజమైన అర్థం ఉంటుంది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్‌వర్సెస్ ఎస్. హరీష్ కేసులో 2026అక్టోబర్ 15న ఇచ్చిన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 21వ అధికరణతో పాటు 19(1)(ఎ) అధికరణకింద ప్రతి వ్యక్తికీ ఇంటర్నెట్‌ను పొందే, ఉపయోగించే హక్కు ఉందని పేర్కొంది. పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచార వ్యాప్తిని అరికట్టడంలో డిజిటల్ వేదికల బాధ్యతలపై విచారణ సందర్భంగా ఈ అంశం ముందుకొచ్చింది. ఆన్‌లైన్ ప్రమాదాల నుంచి పిల్లలను రక్షించాలనే పేరుతో వారికి ఇంటర్నెట్ వినియోగాన్ని పూర్తిగా నిరాకరించడం సరైన మార్గం కాదని కోర్టు స్పష్టం చేసింది. పిల్లల భద్రతను కాపాడుతూనే వారి హక్కులనూ పరిరక్షించాలన్నది ఈ తీర్పులోని ప్రధాన సందేశం. ఈ తీర్పు గతంలో జరిగిన రాజ్యాంగపరమైన పరిణామాలకు కొనసాగింపు. 2020లో అనురాధా భసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇంటర్నెట్ ద్వారా భావప్రకటన, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే హక్కులకు రాజ్యాంగ రక్షణ ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది. అయితే, ఇంటర్నెట్ ప్రాప్యత స్వతహాగా ప్రాథమిక హక్కా అనే ప్రశ్నను అప్పట్లో తేల్చలేదు. 2025లో ప్రగ్యా ప్రసూన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో డిజిటల్ ప్రాప్యతను గౌరవప్రదమైన జీవనానికి, సమాన భాగస్వామ్యానికి అవసరమైన అంశంగా గుర్తించింది. తాజా ఉత్తర్వు ఇంటర్నెట్‌ను పొందడం, ఉపయోగించడం ప్రతి వ్యక్తి ప్రాథమిక హక్కు అని స్పష్టంగా ప్రకటించింది. రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణకల్పిస్తే, 19(1)(ఎ) అధికరణ భావప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. నేటి పరిస్థితుల్లో ఈ హక్కులను సమర్థంగా వినియోగించుకోవడానికి ఇంటర్నెట్ కీలకంగా మారింది. విద్యార్థులు పాఠ్యాంశాలను తెలుసుకోవడం, రైతులు మార్కెట్ ధరలను పరిశీలించడం, నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను వెతుక్కోవడం, పౌరులు ప్రభుత్వ సేవలను పొందడం వంటి అనేక అవసరాలకుఇది ఉపయోగపడుతోంది. ఇంటర్నెట్ అందుబాటులో లేకపోతే ఈ అవకాశాలను పొందడంలో వెనుకబడిన వర్గాలుమరింత నష్టపోయే ప్రమాదం ఉంది. దేశంలో డిజిటల్ అంతరాన్ని తగ్గించడమే ఇప్పుడు ప్రధాన సవాలు.నెట్‌వర్క్ అందుబాటులో ఉన్నంత మాత్రాన అందరూ ఇంటర్నెట్‌ను ఉపయోగించుకోగలరని కాదు. పరికరాల ధర, డేటా ఛార్జీలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు,డిజిటల్ పరిజ్ఞానంకొరత,స్థానిక భాషల్లో సమాచార లభ్యత వంటి అంశాలు అనేక మందికి అడ్డంకులుగా ఉన్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు, తక్కువ ఆదాయ కుటుంబాలు, దివ్యాంగులు ఈ సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం



డిజిటల్ సదుపాయాల విస్తరణను ప్రజా బాధ్యతగా చూడాలి. వెనుకబడిన ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ ఇంటర్నెట్ సేవలను విస్తరించాలి. పాఠశాలలు, గ్రంథాలయాలు, సామాజిక కేంద్రాల ద్వారా పరికరాలు లేనివారికి డిజిటల్ వనరులను అందుబాటులోకి తీసుకురావాలి. ఆన్‌లైన్ మోసాలు, తప్పుడు సమాచారం, వ్యక్తిగత వివరాల దుర్వినియోగం నుంచి తమను తాము కాపాడుకునేలా డిజిటల్ అక్షరాస్యతను పెంచాలి. ఇంటర్నెట్ సౌకర్యం లేనివారు లేదా డిజిటల్ నైపుణ్యాలు తక్కువగా ఉన్నవారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా ప్రత్యామ్నాయ సేవలను కూడా కొనసాగించాలి. ఈ తీర్పు వల్ల ప్రతి ఒక్కరికీ ఉచితఇంటర్నెట్ అందించాలనే ఆదేశం జారీ అయినట్లు భావించకూడదు. అయితే, ఇంటర్నెట్‌ను అందుబాటు ధరల్లో, అందరికీ ఉపయోగపడేలా చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతకు ఇది రాజ్యాంగపరమైన బలాన్ని ఇస్తుంది. పిల్లల ఆన్‌లైన్ భద్రత ఈ తీర్పులో మరో ముఖ్యమైన అంశం. ఇంటర్నెట్ విద్య,సృజనాత్మకత, సమాచార మార్పిడికి విస్తృత అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ, లైంగిక దోపిడీ, సైబర్ వేధింపులు, హానికరమైన సమాచారం వంటి ప్రమాదాలూ ఉన్నాయి. వీటిని అరికట్టడానికి ఇంటర్నెట్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం కంటే, హానికరమైన సమాచారాన్ని నియంత్రించడం, దాని వ్యాప్తికి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవడం అవసరమని కోర్టు అభిప్రాయపడింది. పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని గుర్తించి తొలగించేందుకు జాతీయ స్థాయిలో డిజిటల్ హ్యాష్‌లు, యూఆర్‌ఎల్‌ల ఆధారంగా పనిచేసే వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఫిర్యాదుల పరిష్కార విధానాలను మెరుగుపరచడం, చట్టబద్ధమైన బాధ్యతలను పదేపదే ఉల్లంఘించే డిజిటల్ వేదికలపై తగిన జరిమానాలు విధించే వ్యవస్థను రూపొందించడం వంటి చర్యలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. చట్టవిరుద్ధమైన సమాచారాన్ని గుర్తించడం, తొలగించడం, సంబంధిత అధికారులకు నివేదించడం వంటి బాధ్యతలను సమర్థంగా అమలు చేయాలని పేర్కొంది. ఈ చర్యలకు సంబంధించి మార్గదర్శకాలు, ప్రామాణిక కార్యాచరణ విధానాలు రూపొందించాలని, అవసరమైతే సమాచార సాంకేతిక చట్టం, దాని నిబంధనల్లో తగిన మార్పులను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ నాటికి అమలులో సాధించిన పురోగతిపై నివేదిక సమర్పించాలని కూడా పేర్కొంది. పిల్లలకోసం ప్రత్యేక భద్రతా విధానాలను రూపొందించాల్సిన అవసరాన్నీ కోర్టు గుర్తించింది. సామాజిక మాధ్యమ ఖాతాలను సాధారణంగా ప్రైవేట్‌గా ఉంచడం, తెలియని పెద్దలనుంచి సందేశాలు, సంప్రదింపులపై పరిమితులు విధించడం, పిల్లలకు కనిపించే ప్రకటనలు, సమాచారాన్ని నియంత్రించడం వంటి చర్యలను పరిశీలించాలని సూచించింది. పిల్లలకు వయసుకు తగిన రీతిలో డిజిటల్ భద్రత, సమ్మతి, వ్యక్తిగత హద్దులు, వేధింపులను గుర్తించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, పాఠశాలలు, ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ రక్షణ చర్యలు ఫలితాన్నిస్తాయి. అయితే, పిల్లల భద్రత పేరుతో విచక్షణారహితంగా ఇంటర్నెట్‌ను నిలిపివేయడం లేదా భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడం సమర్థనీయం కాదు. హానికరమైన సమాచారాన్ని నియంత్రించే చర్యలకు చట్టపరమైన ఆధారం ఉండాలి. అవి సాధించాలనుకున్న లక్ష్యానికి తగిన పరిమితుల్లోనే ఉండాలి. డిజిటల్ భద్రతతోపాటు వ్యక్తిగతగోప్యత, ఇతర రాజ్యాంగ హక్కుల పరిరక్షణకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. భారతదేశ డిజిటల్ పురోగతిని ఇంటర్నెట్ కనెక్షన్ల సంఖ్యతో మాత్రమే కొలవలేం. మారుమూల గ్రామంలోని విద్యార్థికి నాణ్యమైన విద్యా వనరులు అందుతున్నాయా? తక్కువ ఆదాయ కుటుంబాలు అధిక ఖర్చుల భారం లేకుండా ప్రభుత్వ సేవలను పొందగలుగుతున్నాయా? దివ్యాంగులు, డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు కూడా ఈ అవకాశాలను వినియోగించుకోగలుగుతున్నారా? అన్నప్రశ్నలే అసలు ప్రగతికి కొలమానాలు కావాలి. సుప్రీంకోర్టు తీర్పు డిజిటల్ సమానత్వానికి రాజ్యాంగపరమైన బలాన్నిఇచ్చింది. ఇప్పుడు దాన్ని ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇంటర్నెట్ కొందరికే అందుబాటులో ఉండే సౌకర్యంగా కాకుండా, ప్రతి ఒక్కరికీ విద్య, ఉపాధి, సమాచారానికి సమాన అవకాశాలను కల్పించే సాధనంగా మారాలి. అప్పుడే ఈ ప్రాథమిక హక్కు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకురాగలదు. ●

# ఉద్యమాలతో అల్లకల్లోలంగా మారిన ఫ్రాన్స్!

బి. సాంబశివరావు

పెట్టుబడిదారీ విధానాల అమలు ఫలితంగా ఫ్రాన్స్‌లో అన్నివర్గాల ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. లెకార్ను ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వీధుల్లో ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలు దేశం మొత్తాన్ని చుట్టు ముట్టాయి. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతకు, శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల వెడల, తరగతి గదుల్లో సౌకర్యాలు లేకపోవడం, విద్యా రంగానికి కేటాయింపులు తగ్గించడం,పెరుగుతున్న జీవన వ్యయాలు, ఆర్థిక అసమానతలు విద్యార్థులను సమస్యల వలయంలో బంధించాయి. తమ సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా హైస్కూల్ విద్యార్థులు, వాటి పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టారు.వీధుల్లోకి వేలాది మంది వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రోడ్లను దిగ్బంధించారు. వేలాది మంది హాజరైనసర్వసభ్య సమావేశాల అనంతరం దేశంలో సుమారు 90విశ్వవిద్యాలయాలు ఈ ఉద్యమంలో చేరాయి. ఫ్రాన్స్ వ్యాప్తంగా 4,50,000 మంది విద్యార్థులు ఖవాతు చేశారు. అన్ని చోట్ల భారీగా ప్రదర్శనలు జరిగాయి. పాలనా వ్యవస్థ స్థంభించి పోయింది. విద్యార్థులపై ప్రభుత్వం పాశవిక నిర్బంధాన్ని ప్రయోగించింది. లాఠీ చార్జీలు,టియర్ గ్యాస్, తుపాకి కాల్పులతో విరుచుకుపడింది. 4వేలకు పైగావిద్యార్థులను అరెస్టు చేసింది. 18 వందల మంది విద్యార్థులు విచారణను ఎదుర్కొన్నారు. ఒకవైపు విద్యార్థులు ఉద్యమాలతో ఫ్రాన్స్ అట్టుడుకుతుంటే, పెరుగుతున్న జీవన వ్యయాలు, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పేద, మధ్య తరగతి ప్రజలు నిరసనలతో ఆందోళనలు ప్రారంభించారు. ప్రజా అవసరాలైన ఆహార పదార్థాలు,కూరగాయలు, వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడం, పెట్రోల్,డీజిల్ ధరలు, గ్యాస్‌ధరలు విపరీతంగా పెరగడం వల పేద, మధ్యతరగతి ప్రజల కుటుంబ బడ్జెట్ తారుమారైంది. ఈసమస్యల వల్లే ప్రజల ఆందోళన బాటపట్టారు. ఈ ఆందోళనలో అన్నివర్గాల ప్రజలు సుమారు 8లక్షల మంది రోడ్లపైకి వచ్చి ఆందోళన ప్రారంభించారు. ప్రజా ఆందోళన అణచివేతలో భాగంగా ఇప్పటివరకు 18 వందల మందిని అరెస్టు చేశారు. ఉద్యమకారులపై పోలీసులు టియర్ గ్యాస్,వాటర్ క్యాన్లు ప్రయోగిస్తున్నారు. 2018లో ఇంధన ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఫ్యాన్స్‌ను ఊపేసిన ప్రసిద్ధ ఎల్లో వెస్ట్ ఉద్యమ కారులు మరలా సోషల్ మీడియా ద్వారా ఈ ఆందోళనలో చురుకుగా పాల్గొంటున్నారు. విద్యార్థులు, ప్రజలు తీవ్రమైన సమస్యల్లో కొట్టుమిట్టాడటానికి ఫ్రాన్స్ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభమే కారణం. నేడు ఫ్రాన్స్ తీవ్రమైన రుణ సంక్షోభంలో,ఆర్థిక మందగమనంలో చిక్కుకున్నది. ప్రతిసంవత్సరం ప్రభుత్వ ఆదాయంకంటే,ఖర్చులు మితిమీరిపోవడంవల్ల దేశఅప్పులు రికార్డు స్థాయిలో 3.6 ట్రిలియన్ యూరోలకు చేరింది. ఇది ఫ్రాన్స్ మొత్తం స్థూలజాతీయోత్పత్తిలో దాదాపు 119 శాతానికి సమానం. ఐరోపా సమాఖ్య (ఈయు)నిబంధనల ప్రకారం బడ్జెట్‌లో 3శాతం కంటే తక్కువ ఉండాలి.ఫ్రాన్స్ ప్రస్తుతం 5.4 శాతంగా ఉంది. ఇది దేశ ఆర్థిక సంక్షోభ తీవ్రతను తెలియచేస్తున్నది. పశ్చిమాసియాలోజరుగుతున్న గ్యాస్, విద్యుత్ బిల్లులు ఏడాది సగటున 900 యూరోలు పెరిగాయి. ఆర్థిక సంక్షోభంలోకి, అప్పుల ఊబిలోకి నెడుతుంది నేటి ఫ్రాన్స్‌పరిణామాలు మరోసారి రుజువు చేశాయి. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటమే నేడు ఫ్రాన్స్ ప్రజల కర్తవ్యం. ●

# స్థానిక ఎన్నికలు ప్రజలకు అవకాశంగా మారాలి!

డా. ఎ. భాగ్యరాజ్

ప్రజాస్వామ్యంలో పండుగ అంటే ఎన్నికలు, కేవలం ఓటు వేయడం మాత్రమే కాదు, మన జీవితాలను, ప్రాంతాలను ప్రభావితం చేసే పాలకులను ఎన్నుకోవడం, మన గ్రామం, పిల్లల రేపటి భవిష్యత్తును నిర్మించుకోవడం కోసం జరిగే రాజ్యాంగ ప్రక్రియ. మన స్వాతంత్ర్య సమర యోధులు కలలుగన్న స్వరాజ్యం కోసం జరిగే ప్రక్రియే నేడు జరుగుతున్న స్థానిక ఎన్నికలు ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజలకు లభించే గొప్ప అవకాశం. ఎందుకంటే వీధిలోని సమస్య ఏమిటో, మన గ్రామానికి ఏ అభివృద్ధి అవసరమో, తాగునీరు ఎందుకు రావడం లేదో, ప్రభుత్వ పథకాలు ఎవరికి అందడం లేదో, అక్కడి నాయకుల పనితీరు స్థానిక ప్రజలకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవడం ప్రజల హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. మహాత్మా గాంధీ కన్న కలల రూపమే ఈ 'గ్రామ స్వరాజ్యం' గ్రామాలు స్వయం సమృద్ధి సాధించినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వస్తుందని మన స్వాతంత్ర్య సమరయోధులు బలంగా నమ్మారు. కానీ అంబేద్కర్ గ్రామ స్వరాజ్యాన్ని వ్యతిరేకించడానికి కారణం గ్రామాలలోని సామాజిక అసమానతలు, కుల వివక్ష నిర్మూలించబడకుండా అధికారాలు ఇస్తే అవి అగ్రవర్ణాల చేతుల్లో ఆయుధాలుగా మారుతాయని, సామాజిక సమానత్వం లేని రాజకీయ వికేంద్రీకరణ అర్థరహితమని ఆయన గట్టి నమ్మకం. అప్పుడు ఆయన అన్న మాటలు ఇప్పటికీ చూస్తున్నాము. గ్రామాల్లో భూమి, సంపద, సామాజిక అధికారం అంతా అగ్రవర్ణాల లేదా భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయని, అటువంటి వ్యవస్థలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే, అగ్రవర్ణాల వారే మళ్లీ అధికారంలోకి వస్తారు. బలహీన వర్గాలకు, దళితులకు ఓటుహక్కు ఉన్నప్పటికీ, వారు సామాజికంగా ఒత్తిడికి గురై స్వతంత్రంగా ఓటు వేయలేరని,ఫలితంగా గ్రామీణ పంచాయతీలు దళితులను మరింత అణచివేయడానికి సాధనాలుగా మారుతాయని అంబేద్కర్ భయపడ్డారు. నెహ్రూ దృష్టిలో మన స్వరాజ్యం అంటే పంచాయతీరాజ్. ఇందులో పాలించేవాడు, పాలించబడేవాడు అనే తేడా ఉండకూడదు. ప్రజలే దేశాన్ని పరిపాలించే స్థాయికి ఎదగాలి'అని ప్రగాఢంగా ఆకాంక్షించారు. గ్రామీణ ప్రజలకు కేవలం ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాకుండా, స్థానిక ఎన్నికల ద్వారా వారి చేతుల్లోకి రాజకీయ అధికారాన్ని ఇవ్వాలని,అప్పుడే మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు. ప్రతి గ్రామానికి ఒకపంచాయతీ, ఒక సహకారసంఘం, ఒక పాఠశాల ఉండాలని, ఇవేగ్రామీణ అభివృద్ధికి, స్వయం సమృద్ధికి మూలస్తంభాలని నెహ్రూ పేర్కొన్నారు. ఆనాడు అంబేద్కర్, నెహ్రూ వేసిన పునాది వల్లే 1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు రాజ్యాంగ బద్ధత లభించి, నేడు గ్రామ పంచాయతీలు,




మున్సిపాలిటీలు స్వయంప్రతిపత్తితో నడుస్తున్నాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు ప్రజలకు అత్యంత చేరువలో ఉండేపాలనా వ్యవస్థలు. రహదారులు, పారిశుద్ధం, తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ, చెత్త నిర్వహణ, స్థానిక అభివృద్ధి వంటి అనేక మౌలిక వసతుల అంశాల్లో స్థానిక ఎన్నికల పాత్ర కీలకం. మన వీధిలో మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నప్పుడు, తాగునీటికోసం మహిళలు కిలోమీటర్ల దూరం నడుస్తున్నప్పుడు, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేనప్పుడు,అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందనప్పుడు మనం ప్రశ్నించాల్సింది ఎవరిని? అధికారులను, పాలకులను ప్రశ్నించాలి. కానీ మన బాధ్యతను కూడా గుర్తించాలి. ఎన్నికల సమయంలో సరైన వ్యక్తిని ఎన్నుకోకుండా, ఎన్నికల తరువాత అభివృద్ధి జరగలేదని మాత్రమే విమర్శించడం వల్ల సమస్య పరిష్కారం దొరకదు. ప్రజలు నాయకులను ఎన్నుకుంటారు. కానీ నాయకులుఎలా పనిచేయాలో నిర్ణయించేది ప్రజల చైతన్యం,ప్రశ్నించేధైర్యం, నిరంతర పర్యవేక్షణలోనే ఉంటుంది. స్థానిక ఎన్నికల్లో డబ్బు, మద్యం, కులరాజకీయాలు, వ్యక్తిగతప్రయోజనాలు, తాత్కాలిక హామీలు వంటి అంశాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయగలవు. ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థి ఇచ్చే కొన్ని వందల, వేలరూపాయలు లేదా ఒకరోజుప్రయోజనం కోసం,ఐదేళ్లపాటు మన గ్రామానికి అవసరమైనతాగునీరు, రహదారులు, పర్యావరణం,పారిశుద్ధం, విద్య,ఆరోగ్య సదుపాయాలకు ప్రత్యామ్నాయం కాగలవా? అని ఒక్కసారి ఆలోచించాలి. గొప్ప నాయకుడు ఇతరులను ప్రేరేపించి, ప్రోత్సహించడమే కాకుండా లక్ష్యాలను సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను,ప్రశ్నించడాన్ని ప్రజలకు నేర్పిస్తారు. వారు ఇతరులలోని ఉత్తమ ప్రతిభను, సామర్థ్యాలను వెలికి తీయడానికి సహాయపడతారు. వారే నిజమైన నాయకులౌతారు అంతేకానీ ప్రతి చిన్నపనికి నా దగ్గరికే వచ్చి పని చేయించుకోవాలి అనేవారు మంచి నాయకుడు లక్షణంకాదు. ఓటుకోసం డబ్బు ఇచ్చిన వ్యక్తి గెలిచిన తరు వాత ప్రజల సమస్యల కోసం ఎంత బాధ్యతగా పనిచేయగలడు? ప్రజా సేవ కోసం పోటీ చేస్తున్నాడా, లేక ప్రజా పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలను కుంటున్నాడా?లేదా చూడాలి? ఒక అభ్యర్థి మన కులానికి చెందినవాడని, మన కుటుంబానికి పరిచయమున్నవాడని లేదా మనకు వ్యక్తిగతంగా సహాయం చేశాడని మాత్రమే ఓటు వేయడం సరైన ప్రజాస్వామ్య నిర్ణయం కాదు. మన కుకావాల్సింది మన కులానికి చెందిన నాయకుడు మాత్రమే కాదు,మన గ్రామంలోని అన్నికులాలు, అన్నివర్గాలు, పేదలు, మహిళలు, యువత, వృద్ధుల సమస్యలను సమానంగా పరిష్కరించే నాయకుడు, భవిష్యత్ తరాలకు కావలసిన ఒక ప్రణాళికా అభివృద్ధి ఉండాలి. అభ్యర్థిని ఎన్నుకునేముందు అతని నిజాయితీ, గతకాలంలో పనితీరు, ప్రజలతో సంబంధం, అభివృద్ధిపై అవగాహన, నిధుల వినియోగంలో పారదర్శకత, ప్రజలకు అందుబాటులో ఉండే స్వభావాన్ని పరిశీలించాలి.మనకు వ్యక్తిగతంగా ఉపయోగపడే నాయకుడు కంటే, మొత్తం గ్రామానికి ఉపయోగపడే నాయకుడు అవసరం. గ్రామానికి మంజూరైన నిధులు ఎంత?ఏ పనికి ఎంతఖర్చు చేశారు? నిర్మించిన రహదారి నాణ్యత ఎలా ఉంది? తాగునీటి పథకం ఎందుకు పనిచేయడం లేదు? అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లాంటి ప్రశ్నలు వ్యక్తిగత శత్రుత్వంతో కాకుండా ప్రజాప్రయోజనం కోసం అడగాలి. ప్రజలు డబ్బుకు ఓటు వేస్తే డబ్బు ప్రభావిత రాజకీయాలు పెరుగుతాయి. కులానికి ఓటు వేస్తే కుల రాజకీయాలు బలపడతాయి.భయానికి లొంగితే ప్రశ్నించే హక్కు బలహీనపడుతుంది.కానీ పనితీరు,నిజాయితీ, ప్రజాసేవకు ఓటు వేస్తే అభివృద్ధికి అవకాశం పెరుగుతుంది. ●

# వాణిజ్య ఒప్పందంపై తుది దశకు చర్చలు



## నేడు ముంబయికి రానున్న అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో

### భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు కాబోతున్నదని వెల్లడి

**సామర్‌ఖండ్, అక్టోబరు 19:** భారత్‌తో వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. ఇరు దేశాలు ప్రస్తుతం వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, త్వరలోనే దీనిపై తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై ఆంక్షలు, సుంకాల విధింపు విషయంలోనూ అమెరికా పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటోందని వివరించారు. ప్రపంచ ఇంధన సరఫరా, ధరలపై ప్రభావంతో పాటు భారత్‌తో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన రూబియో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఒప్పందానికి ఇరు దేశాలు చాలా దగ్గరగా ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాల్లో జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థిక ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని వివరించారు. ప్రతి దేశానికి భౌగోళిక పరిస్థితులు, ఇంధన అవసరాలు, ప్రత్యామ్నాయ వనరులను అందిపుచ్చుకునే సామర్థ్యం భిన్నంగా ఉంటాయని అన్నారు. కొన్ని దేశాలకు ఒక ఇంధన వనరు నుంచి మరో వనరుకు మారడం తక్షణమే సాధ్యం కాదని చెప్పారు. అయితే, ఇలాంటి పరిస్థితులను సాకుగా చూపడం లేదని, విదేశాంగ విధానానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు అన్ని అంశాల మధ్య సమతుల్యత అవసరమని పేర్కొన్నారు. రష్యా చమురు ఆంక్షలపై కూడా రూబియో స్పందించారు. ప్రతిపాదిత ఆంక్షలు కేవలం రష్యాకే పరిమితం కావని, ఇతర దేశాలపై కూడా ప్రభావం చూపుతాయని చెప్పారు. అందువల్ల వాటిని అమలు చేయడానికి ముందు సాధ్యాసాధ్యాలను విశ్లేషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సుంకాలు, ఆంక్షల కారణంగా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన ధరలు, అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలను పరిశీలించేందుకు ఈ సమయం ఉపయోగపడుతుందని వివరించారు. భారత్ తన ఇంధన వనరులను విస్తరించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి గణనీయమైన స్థాయిలో చమురును దిగుమతి చేసుకుంటోందని గుర్తుచేశారు. ఒక దేశం నుంచి ఇంధన దిగుమతులను తగ్గించి, ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడటం ఒక్కరోజులో సాధ్యమయ్యే పని కాదని వ్యాఖ్యానించారు. అదే సమయంలో భారత్ అమెరికాకు ముఖ్యమైన మిత్రదేశం, వ్యూహాత్మక భాగస్వామి అని పేర్కొన్నారు. ప్రపంచ పరిణామాల ప్రభావం ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు ఇంధన సరఫరాపై ఒత్తిడి పెంచుతున్నాయని రూబియో వివరించారు. ఇరాన్ చుట్టూ నెలకొన్న పరిస్థితులు, హార్మూజ్ వద్ద రవాణాకు ఎదురయ్యే సవాళ్లతో పాటు సౌదీ అరేబియా, హూతీ మిలీషియా మధ్య పెరుగుతున్న ఘర్షణలు కూడా ప్రపంచ ఇంధన మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని, ఇవి అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలకు దారితీసే అవకాశముందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆంక్షలు, సుంకాలకు సంబంధించిన నిర్ణయాలను జాగ్రత్తగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్ పర్యటనలో కీలక భేటీలు**

మార్కో రూబియో భారత్ పర్యటనలో భాగంగా మంగళవారం ముంబయికి చేరుకోనున్నారు. అక్కడ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో సమావేశం కానున్నారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలను పంచుకోవడం, ఇంధన రంగంలో సహకారాన్ని పెంపొందించుకునే అవకాశాలపై చర్చించడం ఈ పర్యటనలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. అనంతరం ఆయన గుజరాత్‌లోని జామ్‌నగర్‌ను సందర్శించనున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన ఈ ప్రాంత పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇంధన రంగంలో భారత్ సామర్థ్యాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో దేశం పోషిస్తున్న పాత్రపై ఈ పర్యటన ద్వారా మరింత అవగాహన ఏర్పడే అవకాశం ఉంది.



# మణిపూర్ హింసాకాండలో నలుగురు మృతి

## సిఎం ఖేమ్‌చంద్ నివాసం వద్ద మృతదేహాలతో నిరసన

**ఇంఫాల్, అక్టోబరు 19:** మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్నది. రెండుచోట్ల జరిగిన కాల్పుల్లో నలుగురు మరణించారు. ఆగ్రహించిన స్థానికులు మృతదేహాలను సిఎం నివాసం వద్ద తరలించి నిరసన తెలిపారు. తాజా హింసాత్మక ఘటనలతో మణిపూర్‌లో భద్రతా పరిస్థితి మరింత దిగజారింది. మొదటి ఘటనలో మైతేయి ప్రజలు, పాంగల్ ముస్లింలు నివసించే ప్రాంతంలో ఒక సంగీత కార్యక్రమం జరుగుతుండగా హింస చెలరేగింది. రాళ్ల దాడి, కాల్పులు జరగడంతో పలువుర గాయపడ్డారు. బుల్లెట్ గాయాలైన 24 యేళ్ల యువకుడు మరణించాడు.

కాగా, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖమెన్‌లోక్ ప్రాంతంలో మరో హింసాత్మక ఘటన జరిగింది. సమీపంలోని కొండల్లో కట్టెల కోసం వెళ్లిన ముగ్గురు గ్రామస్తులను, కుకీ గిరిజన మిలిటెంట్లుగా అనుమానించిన వ్యక్తులు కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో మరో ముగ్గురు వ్యక్తులు కూడా గాయపడ్డారు. అయితే ఈ హత్యలపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కట్టు దిట్టమైన భద్రత ఉన్న ఇంఫాల్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి మృతదేహాలను తరలించి నిరసన చేపట్టగా పోలీసులు వాటిని బలవంతంగా తొలగించారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జి చేశారు.

మరోవైపు రాజ్ మెడిసిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్ చంద్ సింగ్ పరామర్శించారు. సమీపంలోని ఎస్ ఓఒ శిబిరాన్ని తొలగించడంతో సహా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తోక్చోమ్ లోకేశోర్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ హత్యల నేపథ్యంలో నిరసనలు వెల్లువెత్తడంతో ఇంఫాల్ నగరం దాదాపు స్తంభించింది.

# అల్లరి మూకల విధ్వంసంలో 350 మంది అరెస్టు

## ఫ్రాన్స్, మరికొన్ని నగరాల్లో కొనసాగుతున్న ఆందోళనలు



**పారిస్, అక్టోబరు 19:** ఫ్రాన్స్‌లో ఆదివారం జరిగిన విధ్వంసం సంఘటనల్లో ఇప్పటి వరకు సుమారు 350 మంది నిరసనకారుల్ని అరెస్టు చేశారు. పారిస్‌తో పాటు ఇతర నగరాల్లో జరిగిన నిరసన ప్రదర్శన వేళ ఆందోళనకారుల్ని పోలీసులు నియంత్రించలేకపోయినట్లు హోంమంత్రి లారెంట్ నునేజ్ తెలిపారు. ఆదివారం జరిగిన హింస నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కానీ మాక్రన్ ఆ రాజీనామాను అంగీకరించలేదని తెలిసింది. దేశవ్యాప్తంగా పాఠశాల్లో అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయని, పెరిగే ధరల వల్ల రోజువారీ బ్రతుకు జీవనం కఠినంగా సాగుతున్నట్లు గత కొన్నిరోజుల నుంచి ఫ్రాన్స్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. అయితే వారాంతం వేళ సుమారు అయిదున్నర లక్షల మంది వరకు భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లోని ముఖ్యమైన నగరాల్లో ఆ ఆందోళనలు జరిగాయి. కొందరు నిరసనకారులు విధ్వంసానికి దిగారు. సుమారు 1500షాపులను, వ్యాపార కేంద్రాలను లూటీ చేసి ధ్వంసం చేశారు. వాస్తవానికి సెప్టెంబర్‌లో విద్యా ప్రమాణాలు పెంచాలని విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు.

స్కూల్ బిల్డింగ్‌లు క్షీణ దశలో ఉన్నాయని, టీచర్ల కొరత ఉన్నట్లు విద్యార్థులు ఆరోపించారు. అన్ని నగ రాలకు ఆ ఆందోళన పాకింది. కొన్ని చోట్ల హిం సకు దారి తీసింది. అక్టోబర్ 5వ తేదీన జరిగిన నిరసనలో 15 ఏళ్ల విద్యార్థి చేయికి తీవ్రగా యమైంది. టీచర్లు, పెన్షనర్లు, వివిధ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. తొలుత ఆందోళనలు శాంతియుతంగా సాగాయి. కానీ ఆ తర్వాత కాస్త వేడెక్కాయి. మరోవైపు ఫ్రాన్స్‌లో దేశాధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో ఆరు నెలల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడ నున్నది. వచ్చే మే నెలలో జరిగే ఎన్నికల కోసం ఫ్రాన్స్ వీధుల్లోనే ప్రచారం మొదలైనట్లు కొందరు ఆరోపిస్తున్నారు. కానీ ఆదివారం జరిగిన ఘటన పట్ల మంత్రి లారెంట్ నునేజ్ కారణం వెల్లడించే ప్రయత్నం చేశారు. హింసకు బాధ్యుడిగా భావిస్తూ రాజీనామా చేసినట్లు చెప్పారు. కానీ ఆ రాజీనామాను మాక్రన్ తిరస్కరించినట్లు ఎలిసీ ప్యాలెస్ వర్గాలు పేర్కొన్నాయి. సుమారు 2 లక్షల మంది వరకు నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేశామని, కానీ ఆ సంఖ్య 5 లక్షలు దాటిందని నునేజ్ అన్నారు. తాము తీసుకున్న భద్రతా చర్యలు సరిపోలేదన్నారు. పారిస్, లియాన్, మారిసెల్లీలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయలేకపోయి నట్లు ఆ నగరాల మేయర్లు తెలి పారు. లూటీలు ఎందుకు జరిగాయో అర్థం కావ డం లేదని, సుమారు 30 నిమిషాల పాటు లూటీ జరుగుతుంటే పోలీసులు ఏమీ చేయలేకపోయినట్లు మేయర్లు ఆరోపించారు.

సమస్య పరిష్కారానికి హైస్కూల్ విద్యార్థులతో మీటింగ్ నిర్వహించాలని మేయర్లు అభిప్రాయపడ్డారు. జనస మీకరణపై మారిసెల్లిలో ప్రస్తుతం తాత్కాలిక బ్యాన్ విధించారు.



# బాలుడి నోట్లోకి చొచ్చుకుపోయిన ఇనుపరాడ్

## శస్త్రచికిత్సతో తొలగించిన వైద్యులు

**గాంధీనగర్, అక్టోబరు 19:** ఇంటి బయట ఆడుతూ కిందపడిన బాలుడి నోట్లోకి ఒక ఇనుప కడ్డీ చొచ్చుకెళ్లింది. ఆందోళన చెందిన తల్లి దండ్రులు అతడ్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డెంటల్ డాక్టర్ సహాయంతో వైద్యులు సర్జరీచేసి ఐరాన్ రాడ్ ముక్కను బయటకు తీశారు. గుజరాత్‌లోని పటాన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వేద్ గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు ఇంటి బయట ఆడుకుంటూ అదుపుతప్పి నేలపై పడ్డాడు. అక్కడ ఉన్న ఒక సన్న ఇనుపకడ్డీ అతడి నోటిలోకి బలంగా గుచ్చుకున్నది. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఇది చూసిన బాలుడి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించి రాధన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి అతడిని తరలించారు. వైద్యులు ఆ బాలుడిని పరీక్షించారు. దంతాలు, దవడ భాగంలో లోతుగా ఆ ఇనుప కడ్డీ ఇరుక్కున్నట్లు గుర్తించారు. చాలా సున్నిత భాగంలో అది చిక్కుకోవడంతో దానిని తొలగించడానికి ప్రత్యేక శస్త్ర చికిత్స బృందాన్ని ఏర్పాటు చేశారు. అలాగే సహాయం కోసం ఒక ప్రైవేట్ డెంటల్ సర్జన్‌ను కూడా పిలిపించారు. మరోవైపు ఈ వైద్య బృందం సుమారు గంటరన్నర పాటు క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించింది. బాలుడి దవడ, చుట్టుపక్కల కణజాలాలకు ఎలాంటి నష్టం జరుగకుండా వైద్యులు జాగ్రత్తగా ఆ ఇనుప ముక్కను తొలగించి అతడి ప్రాణాలు కాపాడారు. ఇలాంటి ప్రమాదాలు నివారించేందుకు బహిరంగ ప్రదేశాలలో ఆడుకునే పిల్లలను తల్లిదండ్రులు నిశితంగా గమనించాలని డాక్టర్లు సూచించారు.



ఈక్వెడార్‌లోని చర్చిలో ఘోరం

# సిలువ మీదపడి ఫాదర్ మృతి

## మరణ సందేశం ఇస్తుండగానే దుర్ఘటన

**క్విటో, అక్టోబరు 19:** మనిషికి మరణం ఎప్పుడు ఎలా సంభవిస్తుందో అనేది ఎవ్వరూ చెప్పలేం. తాజాగా ఈక్వెడార్‌లోని ఓ చర్చిలో విషాదకరమైన ఘటన జరిగింది. జీవితానికి మరణం అనివార్యమని విశ్వాసకులకు సందేశం ఇస్తున్న క్రమంలో గోడకు ఉన్న ఓ భారీ సిలువ హఠాత్తుగా కుప్పకూలింది. ఆ శిలువ ఫాదర్‌పై పడడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు సంబంధించిన విడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇక ఈ ఘటన ఈనెల 17న రాత్రి అవర్ లేడీ ఆఫ్ పర్పెచ్యువల్ హెల్ప్ అనే చర్చిలో జరిగినట్లు తెలుస్తోంది. ఓవైపు ప్రార్థనలు జరుగుతున్న సమయంలో తలపై జీసస్ సిలువ పడి ఫాదర్ చర్చిలోనే మరణించడంతో అక్కడక ఆందోళనకర, భయానక పరిస్థితులు నెలకొన్నాయి.

ఈక్వెడార్‌లోని గ్వాయాక్విల్ నగరంలో లేడీ ఆఫ్ పర్పెచ్యువల్ హెల్ప్ అనే ప్రముఖ చర్చి ఉంది. ఈ చర్చిలో నిత్యం జీసస్ ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. అవి ఎప్పటికప్పుడు లైవ్ స్ట్రీమింగ్ అవుతుంటాయి. అయితే రోజూ మాదిరిగానే ఈ నెల 17న రాత్రి సమయంలో ఫాదర్ పాట్రిసియో ఆల్ఫ్రెడో సాంచెజ్‌మోలినారి ప్రార్థనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న వారికి సందేశం ఇస్తున్నారు. జీవితంలోని అనిశ్చితి, మరణం గురించి మాట్లాడుతున్నారు. మొబైల్ ఫోన్లలో ఎక్కువ సమయం గడపకుండా దేవుడికి, కుటుంబ సభ్యులకు అలాగే ఆత్మీయులకు తగినంత సమయాన్ని కేటాయించాలని సూచనలు చేశారు. దాంతో పాటు మనిషి జీవితం శాశ్వతం కాదని, ఇతర విషయాల కంటే దేవుడితో గడిపే సమయానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆయన సందేశాన్ని ఇస్తున్నారు. అదే సమయంలో ఫాదర్ పాట్రిసియో ఆల్ఫ్రెడో సాంచెజ్ మొలినారి వెనుక గోడకు ఉన్న భారీ జీసస్ సిలువ ఒక్కసారిగా ఊడిపడి తలపై భాగంలో బలంగా తాకింది. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ ఘటన జరిగిన వెంటనే అత్యవసర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స అందించినా తీవ్రగాయాల కారణంగా ఫాదర్ తుదిశ్వాస విడిచారు. ఈ కార్యక్రమం సోషల్ మీడియాలో లైవ్ స్ట్రీమింగ్ అవుతుండగా సుమారు 27 నిమిషాల తర్వాత శిలువ ఫాదర్ తలపై పడినట్లు స్పష్టమైంది. ఇక గ్వాయాక్విల్ ఆర్చ్ డయాసిస్ ఫాదర్ పాట్రిసియో మృతిని ధ్రువీకరిస్తూ సంతాపం ప్రకటించింది.

# టైగర్ ష్రాఫ్‌పై దాడి చేసిన నిందితుల అరెస్టు

## రైలులో వెళుతుండగా రాజస్థాన్ కోటాలో పట్టివేత



**ముంబయి, అక్టోబరు 19:** పథకం ప్రకారం బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై ఫైరింగ్ చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని కోటాలో వాళ్లను అదుపులోకి తీసుకున్నారు. రైలు ద్వారా ప్రయాణిస్తున్న వారిని కోటా స్టేషన్‌లో అరెస్టు చేశారు. నిందితుల్లో ఇద్దరు హర్యానా వ్యక్తులు కాగా, ఒకరిది మహారాష్ట్ర. అయితే ముగ్గురికీ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో రిలేషన్ ఉన్నది. ట్రైనింగ్ పొందిన షూటర్లు బాలీవుడ్ హీరో హత్యకు ప్లాన్ చేసినట్లు ప్రాథమికంగా దర్యాప్తులో తేలింది. దాడికి ముందు హీరో టైగర్ ష్రాఫ్ కదలికలను రెక్కీ వేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఆదివారం ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు వస్తాడని తెలిసే టైగర్‌పై అటాక్‌కు ప్లాన్ చేశారని అంచనా వేస్తున్నారు. జుహూలో జరిగిన కాల్పుల ఘటన తర్వాత ప్లాన్ ప్రకారం తప్పించుకున్నారు. ఎస్వీ రోడ్డు నుంచి విలే పార్లే, అంధేరీ మార్గంలో వెళ్లారు. అంధేరి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద బైక్‌ను వదిలివెళ్లారు. బోరివాలీ దిశగా వెళ్లే రైలు ఎక్కారు. నిందితులు ముగ్గురు తొలుత మహారాష్ట్ర బోర్డర్‌ను క్రాస్ చేశారని, ఆ తర్వాత పొరుగు రాష్ట్రం గుజరాత్‌లోకి ఎంటర్ అయ్యారని, అక్కడ నుంచి రాజస్థాన్‌లోని కోటాకు వెళ్లినట్లు తెలుస్తోంది. వెంటనేముంబయితోపాటు రాజస్థాన్ యాంటి గూండా స్క్వాడ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. రైలును నిలిపివేసి మొత్తం 15 నిమిషాల్లోనే ఆపరేషన్‌ముగించి నిందితులను అదుపులోకి తీసుకున్నార ు. బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై జరిగిన కాల్పుల ఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులపై ఆ కేసు బుక్ చేశారు. తొలుత జుహూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఆ కేసును ముంబై క్రైం బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహూ ఏరియాలో టైగర్ ష్రాఫ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఫైరింగ్ చేసిన విషయం తెలిసిందే. అయితే అదృష్టవశాత్తు ష్రాఫ్ ప్రాణాలతో తప్పించుకున్నారు. కానీ అతని డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఈ దాడికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహిస్తూ ప్రకటన చేసింది. కానీ ఆ సోషల్ మీడియా స్టేట్మెంట్‌ను పోలీసులు నిర్ధారించే ప్రయత్నంలో ఉన్నారు. భారతీయ న్యాయ సంహితలోని హత్యాయత్నం సెక్షన్ 109(1), నేర చర్యలు 3(5) సెక్షన్ కింద కేసు చేశారు. ఆర్మ్స్ యాక్ట్ కూడా నమోదు చేశారు. ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు అన్ని కోణాల్లో కేసును పరిశీలిస్తున్నారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న లింకులను కూడా ఆరా తీస్తున్నారు.

# డెంగ్యూకు వ్యాక్సిన్ రెడీ

## కడయనల్లూర్‌లో ప్రయోగాలు




**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** ఇండియాలో డెంగ్యూ నివారణ చర్యల్లో ఓ కీలకమైన మార్పు చోటు చేసుకుంది. ఇప్పటివరకు కేవలం దోమలను అరికట్టడం, వ్యాధి బారిన పడిన వారికి చికిత్స అందించడంపైనే దృష్టి సారించిన ఆరోగ్య విభాగం ఇప్పుడు ముందస్తు నివారణ చర్యగా టీకా పంపిణీని ప్రారంభించింది. తమిళనాడులోని తెన్‌కాసి జిల్లా, కడయనల్లూర్ కేంద్రంగా ఇండియాలోనే మొట్టమొదటి డెంగ్యూ టీకా పైలట్ డ్రైవ్‌ను అధికారులు ప్రారంభించారు. డెంగ్యూ వ్యాధి తీవ్రత ఎక్కువగా నమోదవుతున్న ఈ ప్రాంతంలో టీకా ఎంతవరకు ప్రభావవంతంగా పనిచేస్తుందో తెలుసుకోవడానికి ఆరోగ్య శాఖ ఈ ప్రాంతాన్ని ఎంచుకుంది. డెంగ్యూ కేసుల సంఖ్య అత్యధికంగా ఉండే కడయనల్లూర్‌లో ఈ పైలట్ ప్రాజెక్టును చేపట్టడం ద్వారా వ్యాక్సిన్ పనితీరును సమర్థవంతంగా అంచనా వేయడానికి వీలవుతుంది. ఈ ప్రయోగం ద్వారా టీకా తీసుకోవడంలో ప్రజల ఆసక్తి, రెండు డోసులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయడం, ఏవైనా సైడ్ ఎఫెక్ట్స్ కనిపిస్తున్నాయా అని పరిశీలించడం, ఖచ్చితమైన వ్యాధి డేటాను సేకరించడం అధికారులకు సులభతరం కానుంది. ఈ కార్యక్రమంలో జపాన్‌కు చెందిన తకేడా ఫార్మాస్యూటికల్ కంపెనీ అభివృద్ధి చేసిన క్యూడెంగా అనే టీకాను ఉపయోగిస్తున్నారు. ఇది లైవ్ అటెన్యుయేటెడ్, టెట్రావాలెంట్ రకానికి చెందిన వ్యాక్సిన్. అంటే ఇది డెంగ్యూ వైరస్‌కు చెందిన నాలుగు వేర్వేరు రకాలను ఎదుర్కొనేలా మానవ రోగనిరోధక వ్యవస్థకు శిక్షణ ఇస్తుంది. భారత సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఈ టీకాను 4 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారికి ఉపయోగించడానికి జులై 2026లో ఆమోదం తెలిపింది. ఈ వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం 3 నెలల వ్యవధిలో రెండు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది.

# టివికెకు వచ్చిన విరాళాల్లో ఆ ఇద్దరు మంత్రులదే ఎక్కువ

**చెన్నై, అక్టోబరు 19:** మూడేళ్ల క్రితం తమిళనాడు రాజకీయాల్లో ఎంట్రీ ఇచ్చి, ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం విజయ్ పార్టీ తమిళ వెట్రి కజగం పాలనతో పాటు విరాళాల విషయంలోనూ పారదర్శకతను పాటిస్తోంది. తాజాగా ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో తమ పార్టీకి గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన మొత్తం విరాళాలు, అవి ఏయే దాతల నుంచి వచ్చాయో వివరాలు వెల్లడించింది. టీవీకే 2025-26 ఆర్థిక సంవత్సరంలో నలుగురు దాతల నుండి రూ.13.3 కోట్ల మేర స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ప్రకటించింది. ఈ నిధులలో 99 శాతం మంత్రులు ఆధవ్ అర్జున, ఆర్వీ రంజిత్‌కుమార్‌లే ఇవ్వడం విశేషం. ఆధవ్ అర్జున టీవీకేలో కీలక మంత్రి. ఆయన ప్రస్తుతం విజయ్ కేబినెట్లో క్రీడలు, ప్రజా పనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అర్జున రూ. 8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. మరో మంత్రి ఆర్వీ రంజిత్ కుమార్ టీవీకేకు రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి టీవీకేకు లభించిన మొత్తం విరాళాలలో 60 శాతానికి పైగా వాటాతో మంత్రి ఆధవ్ అర్జున పార్టీలోనే అతిపెద్ద దాతగా నిలిచారు. వీరు మినహాయిస్తే మిగిలిన విరాళాల్లో తూత్తుకుడిలోని లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో డీడీ ద్వారా 5 లక్షల విరాళాన్ని అందించింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ ఇంపోర్ట్స్ కూడా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మరో రూ.5 లక్షలను విరాళంగా ఇచ్చింది. మరోవైపు గత ఆర్థిక సంవత్సరంలో విపక్ష అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు పొందినట్లు ఈసీకి వివరాలు సమర్పించింది. ఇందులో టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.135కోట్లు విరాళంగా ఇచ్చి, అతిపెద్ద దాతగా నిలిచింది. ప్రధాన విపక్షం డీఎంకే సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు వచ్చినట్లుగా ఈసీకి నివేదిక ఇచ్చింది. ఇందులోనూ టైగర్ అసోసియేట్స్ రూ.125 కోట్లతో దీనికి అతిపెద్ద దాతగా నిలిచింది. కోల్‌కతాకు చెందిన లాటరీ సంస్థ టైగర్ అసోసియేట్స్‌కు, లాటరీ దిగ్గజం శాంటియాగో మార్టిన్‌కు ఒక ఉమ్మడి వ్యాపార భాగస్వామి ద్వారా సంబంధం ఉంది. దీంతో ఈ రెండు పార్టీల్ని నడుపుతోంది టైగర్ అసోసియేట్స్ అని అర్థమవుతోంది.

# సిఇసిని తప్పించినా ఆందోళనలు ఆగే పరిస్థితిలేదు

## సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ కట్జూ

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడి 13 కోట్ల మంది ఓటర్లను తొలగించేందుకు కారణమయ్యారంటూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం విపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థి సంఘాలు పట్టుబడుతున్నాయి. ఈ మేరకు ఢిల్లీలో నిరంతరం ఆందోళనలు చేపడుతున్నాయి. కేంద్రం మాత్రం జ్ఞానేష్ కుమార్ అభిశంసనకు ముందుకు రావడం కానీ, ఆయనతో నేరుగా రాజీనామా చేయించాలని కానీ ఆలోచించడం లేదు. దీంతో ఈ వ్యవహారం మోడీ సర్కార్ మెడకు చుట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండే కట్జూ స్పందించారు. సీఈసీని తప్పించినా ఈ ఆందోళనలు ఆగే అవకాశం లేదని సుప్రీం మాజీ జడ్జి జస్టిస్ మార్కండే కట్జూ తేల్చిచెప్పేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ఓ ట్వీట్ చేశారు. ప్రస్తుతం భారతదేశంలో జరుగుతున్న ఆందోళన జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసమేనని, పరిస్థితిని సద్దుమణిగేలా చేయడానికి, ఆయనతో రాజీనామా చేయించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉండవచ్చని కట్జూ అంచనా వేశారు. అయితే, ప్రభుత్వం అలా చేసినంత మాత్రాన ఈ ఆందోళన ముగిసిపోదన్నారు.

# నేహా బోరాకు ఢిల్లీ పోలీసుల నోటీసులు

## హైకోర్టును ఆశ్రయించిన ఎఐఎస్ఎ అధ్యక్షురాలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** దేశ రాజధాని పోలీసులు తనకు జారీచేసిన నోటీసులను వెంటనే నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా. ఈ నోటీసులు వెనక్కి తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన వ్యాజ్యంపై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారామె. పోలీసుల నోటీసులు అస్పష్టంగా ఉన్నాయని ఆమె విమర్శించారు. అంతేకాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21లను అతిక్రమిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఏఐఎస్ఏ ఓ ప్రకటన విడుదలచేసింది. బీఎన్ఎస్ఎస్ చట్టంలోని 126, 130 సెక్షన్ల కింద ఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు కావాలని నేహా బోరాను ఢిల్లీ పోలీసులు ఆదేశించారు. విచారణ సమయంలో శాంతి భద్రతలను కాపాడాలని పోలీసులు స్పష్టం చేశారు.

# సంక్షిప్త వార్తలు

## ఆసుపత్రి నుంచి అద్వానీ డిశ్చార్జి



**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** బీజేపీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో ఆయన్ను ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఆస్పత్రి నుంచి సోమవారం డిశ్చార్జ్ చేశారు. ఛాతి ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన్ను ఈనెల 16వ తేదీన ఆస్పత్రిలో చేర్పించారు. అక్టోబర్ 19వ తేదీన ఆస్పత్రి చేసిన ప్రకటన ఆధారంగా న్యూరాలజీ డాక్టర్ వినీత్ సూరీ పర్యవేక్షణలో అద్వానీ చికిత్స పొందారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలి పాయి. 98యేళ్ల అద్వానీని శుక్రవారం ఆస్పత్రి లో అడ్మిట్ చేశారు. డాక్టర్ల బృందం ఆయన్ను అబ్జర్వేషన్‌లో పెట్టి వైద్య పరీక్షలు చేశారు.

## త్వరలోనే రాజకీయ పార్టీ: అన్నామలై



**చెన్నై, అక్టోబరు 19:** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, కర్ణాటక సింఘంగా పేరుగాంచిన అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్తరాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు.

## బల్గేరియాలో ఇజ్రాయెల్ విమానం అత్యవసర ల్యాండింగ్



**టెల్ అవీవ్, అక్టోబరు 19:** ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ నుంచి వియన్నాకు వెళ్తున్న విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఆస్ట్రియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానంలో బాంబు బెదిరింపు రావడంతో అత్యవసరంగా ల్యాండ్‌చేశారు. బల్గేరియా రాజధాని సోఫియాలో విమానం సురక్షితంగా దిగింది. రొమేనియా సరిహద్దు సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో విమాన సిబ్బందికి బాంబు బెదిరింపు సమాచారం అందింది. దాంతో అప్రమత్తమైన సిబ్బంది ఫ్లైట్‌ను సోఫి యాకు మళ్లించారు. ఆ విమానం సోఫియాలో ల్యాండ్ అయ్యే వరకు బల్గేరియా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఫైటర్ జెట్ ఎస్కార్ట్‌గా వచ్చింది.

## నేడు ఐదుగంటలపాటు తిరువనంతపురం ఎయిర్‌పోర్టు బంద్



**తిరువనంతపురం, అక్టోబరు 19:** సాధారణంగా విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలు సాంకేతిక సమస్యలు, ప్రతికూల వాతావరణం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల వల్ల నిలిచిపోతుంటాయి. కానీ కేరళ రాజధాని తిరువనంతపురంలో మాత్రం ఒక పురాతన ఆలయ సంప్రదాయం కోసం విమానాల రాకపోకలను తాత్కాలి కంగా నిలిపివేస్తారు. పద్మనాభస్వామి ఆలయానికి సంబంధించిన సంప్రదాయ మతపరమైన ఊరేగింపుకు మార్గం కల్పించేందుకు తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలను ఐదు గంటల పాటు నిలిపివేయనున్నారు.

## కెనడాలో ఘోరప్రమాదం..నలుగురు సైనికులు మృతి



**అల్బెర్టా, అక్టోబరు 19:** కెనడాలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అల్బెర్టా ప్రావిన్స్‌లోని సైనిక శిక్షణా స్థావరంలో మంటలు చెలరేగి నలుగురు కెనడియన్ సైనికులు మరణించారు. మరో 39 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన వారిలో 19 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. సైనికులు లైవ్ మందుగుండు సామగ్రితో యుద్ధ శిక్షణ పొందు తున్న సమయంలో అక్కడ గడ్డి మైదానంలో మంటలు చెలరేగాయి.

## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక నవరాత్రి ఉత్సవాలు: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** నవరాత్రి ఉత్సవాలు అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లా పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఈ పర్వదినాలు భక్తిభావాన్ని, ధర్మనిష్ఠను పెంపొందిస్తాయని తెలిపారు.సోమవారం సైనిక్‌పురిలోని శృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శారదాశరణ్ నవరాత్రోత్సవాల్లో, హైదరాబాద్‌లోని సమృద్ధి లోక్‌భవన్ ఉద్యోగుల నివాస సముదాయంలో నిర్వహించిన శ్రీ దేవి నవరాత్రి వేడుకల్లో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని ప్రార్థించారు.దుర్గాదేవి ఆరాధనకు విశేష ప్రాధాన్యమున్న నవరాత్రి పర్వదినాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతోపాటు సత్యం, ధర్మం పట్ల నిబద్ధతతో జీవించేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, సమాజంలో ఐక్యతా భావాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఉత్సవాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు

## అసత్యంపై సత్యం విజయానికి ప్రతీక విజయదశమి

### కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** హిందూ బంధువులకు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. శ్రీరామచంద్రుడు రావణాసురుడిపై సాధించిన విజయం, దుర్గామాత మహిషాసురుడిని సంహరించిన ఘట్టం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తాయన్నారు. అధర్మం ఎంత విర్రవీగినా.. కష్టపడి పనిచేస్తే చివరకు గెలిచేది ధర్మమే అని దసరా పండుగ మనకు ధైర్యాన్నిస్తుందన్నారు. దుర్గాదేవి నవరాత్రులు, బతుకమ్మ పండగ ద్వారా మహిళలను, ప్రకృతిని గౌరవించుకునే గొప్ప ఆధ్యాత్మిక వారసత్వం మన సనాతన ధర్మానికే సొంతమని కిషన్‌రెడ్డి అన్నారు.

**దసరా పండుగకు ప్రత్యేకస్థానం: మాజీ సిఎం కెసిఆర్**

రాష్ట్ర ప్రజలకు మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో, సాంప్రదాయ వేడుకల్లో దసరా పండుగకి ప్రత్యేక స్థానం ఉన్నదని కేసీఆర్ అన్నారు. విజయానికి సంకేతంగా నిలిచిన జమ్మి వృక్షానికి పూజ చేయడం, శుభానికి సూచికగా పాలపిట్టను దర్శించుకోవడం, అలయ్ బలయ్‌తో పరస్పరం ప్రేమాభిమానాలను చాటుకోవడం, పవిత్ర మైన జమ్మి ఆకును బంగారంగా భావించి పంచు కోవడం, పెద్దల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకునే మహోన్నత సంస్కృతి సంప్రదాయాన్ని దసరా పండుగ మనకందిస్తున్నదని కేసీఆర్ తెలిపారు.

**విజయాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలి: గుత్తా సుఖేందర్‌రెడ్డి**

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అధర్మంపై ధర్మం సాధించిన గెలుపునకు ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగకు మన సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన స్థానం ఉందన్నారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలను, ఆశయాలను, విజయాలను తీసుకురావాలని కోరుకుంటున్నానని చెప్పారు.

**కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసం నింపాలి: బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు**

తెలంగాణ ప్రజలందరికీ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడు ఎంత బలంగా ఉన్నా చివరికి మంచి మాత్రమే గెలుస్తుందనే నమ్మకాన్ని కలిగించే గొప్ప పండుగ దసరా అని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరిలో కొత్త ఉత్సాహాన్ని, ముందుకు సాగే ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. మన పల్లెలు, పట్టణాలు సుభిక్షంగా ఉండాలని.. అన్నదాతలకు మంచి పంటలు, యువతకు కొత్త అవకాశాలు, మహిళలకు రక్షణు గౌరవం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**ప్రజలందరికీ మంచి జరగాలి : పిసిసి చీఫ్ మహేశ్**

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షి స్తూ రాష్ట్ర ప్రజలకు మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.




నల్గొండ గద్దర్ ఆలపించిన దత్తన్న అలయ్ బలయ్ 2026 పాట ఆవిష్కరణ చేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చిత్రంలో బండారు విజయలక్ష్మి

## దత్తన్న అలయ్ బలయ్ 2026 పాట ఆవిష్కరణ

### 22న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వేడుకలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), అక్టోబరు 19 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే 'దత్తన్న అలై బలై -2026' కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం ప్రముఖ గాయకుడు, నల్గొండ గద్దర్‌గా ప్రసిద్ధిగాంచిన నర్సీ రెడ్డి ఆలపించిన అలై బలై - 2026 పాటను రాంనగర్ లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. అలయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ అలై బలై తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మీయత, సోదరభావాన్ని ప్రతిబింబించే గొప్ప సాంస్కృతిక వేడుక అని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని ఆప్యాయతను పంచుకోవడమే అలై బలై ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తెలంగాణ కళలు, జానపద గేయాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. అలై బలై స్ఫూర్తిని ప్రతిబింబించేలా నర్సీ రెడ్డి ఆలపించిన ఈ గీతం ప్రజల్లో సోదరభావాన్ని, తెలంగాణ సంస్కృతిపై అభిమానాన్ని మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దత్తన్న అలై బలై - 2026 వేడుకలను అక్టోబర్ 22న గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వివిధ కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అలయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు విజయలక్ష్మి, సభ్యులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మధుయాష్కీగౌడ్ భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏపిసి) చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని ఎంసీహెచ్‌ఆర్డీసీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి మధ్య సుమారు గంటన్నర పాటు సమావేశం కొనసాగింది. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వంలో చేసిన సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులపై వడ్డీ భారం తదితర అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం.



సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ లోని ఎంసిహెచ్‌ఆర్డీసీలో మర్యాదపూర్వకంగా కలిసిన మధుయాష్కీ గౌడ్

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి త్వరలో మూడేళ్ల పూర్తికానున్న నేపథ్యంలో, ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరంపై చర్చ జరిగింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, గృహ వినియోగదారులకు ఉచిత కరెంటు, దేశంలో ఎక్కడా లేని విధంగా సబ్సిడీ ధరకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ఉపాధి కల్పన.. మరీ ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో నూతన కంపెనీలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పన తదితర సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు వివరించాలన్న దానిపై చర్చ జరిగింది. సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షలు నిర్వహిస్తూ తదనుగుణంగా ముందుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. ఇతర సంస్థలు, కార్యక్రమాల పనితీరును సమీక్షి ంచేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ప్రోగ్రెస్ రిపోర్టులు తీసుకుంటున్న తరహాలోనే, ప్రభుత్వ శాఖలు, పథకాల అమలుపైనా క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి నివేదికలు తీసుకోవాలనే అంశం చర్చకు వచ్చింది. తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏపిసి)ను రాష్ట్రంలో బలోపేతం చేయడంపై కూడా సమావేశంలో చర్చించారు.

ఏపిసి బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రొఫెషనల్స్‌ను భాగస్వాములను చేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై సమర్థవంతమైన చర్చలకు వేదికగా ఏపిసిని తీర్చిదిద్దే అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. వివిధ రంగాల్లో నిపుణులను తీసిది ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై వారు సమగ్రమైన నివేదికలు ఇవ్వడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఇటు ప్రభుత్వం గానీ, అటు పార్టీ గాని ప్రొఫెషనల్స్ సేవలను సద్వినియోగం చేసుకొని నూతన పాలసీలు, విధానాలు రూపకల్పనలో భాగస్వామ్యం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ వేగం పెంచాలి

### ఆర్థిక సంస్కరణలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై దృష్టి

### డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించేలా వేగం పెంచాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేటాయింపులకు అనుగుణంగా నిధుల వ్యయాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల వినియోగంలో వెనుకబడిన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక శాఖలో సంస్కరణలు, ఆదాయ వనరుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. కేటాయించిన నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చయ్యేలా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కేటాయించిన నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమర్థవంతంగా ఉపయోగపడేలా శాఖలవారీగా వ్యయ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. చట్ట నిబంధనలు, నిధుల ఖర్చులో ఉన్న అంతరాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఖర్చులో ఎక్కువ అంతరం ఉన్న వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ, తరువాత క్రమంలో ఇతర శాఖల కార్యదర్శులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి, నివేదిక రూపొందించాలన్నారు. ఆర్థిక సంస్కరణలతో ఆదాయ వనరుల పెంపురాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు, అదనపు ఆదాయ మార్గాలను గుర్తించాలని పేర్కొన్నారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ, వ్యయ నియంత్రణ, నిధుల సద్వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. నిపుణుల సలహాలతో మెరుగైన ఆర్థిక నిర్వహఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించేందుకు అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, ఆర్థిక రంగ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మధ్య సమన్వయం ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమానికి కేటాయించిన నిధులు అర్హులైన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగం కావడంతోపాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ అవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్‌తో పాటు ఇతర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## ఇంకా మొరాయిస్తున్న భద్రాద్రి థర్మల్ యూనిట్

### సాంకేతిక లోపంతో నెలన్నరగా షట్‌డౌన్

### 258 మిలియన్ యూనిట్ల మేర నిలిచిన ఉత్పత్తి

### 38 రోజులుగా విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** ఓవైపు ఎల్ నినో ప్రభావంతో సాధారణం మించి నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో భానుడి భగభగలు, మరోవైపు అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌తో కరెంట్ కష్టాలు పెరిగి రాష్ట్రం తలాకుతలమవుతోంది. ఇలాంటి అత్యంత సంక్లిష్ట సమయంలో సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి చేసి రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచాల్సిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఇంకా సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, రానున్న రోజుల్లో సాగు, తాగునీటితో పాటు విద్యుత్ సంక్షోభం తప్పదంటూ ప్రభుత్వం హెచ్చరిస్తున్న కీలక సమయంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం ఏర్పడింది. మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తి ఏకంగా నెలన్నర రోజులు కావస్తున్నా ఇంకా ఉత్పత్తి పునరుద్ధరణకు నోచుకోలేదు. కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ యూనిట్3లో సాంకేతిక లోపం తలెత్తడంతో గత 38 రోజులుగా ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. బీటీపీఎస్ మూడో యూనిట్‌లోని రోటర్ ఎక్సైటర్‌లో తలెత్తిన సాంకేతిక లోపమే ఈ షట్‌డౌన్‌కు కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ యూనిట్ ద్వారా రోజుకు 270 మెగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి కావాల్సి ఉండగా, గత 38 రోజుల్లో ఏకంగా 258 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ సమస్యను సరిదిద్దేందుకు అవసరమైన రోటర్ ఎక్సైటర్ పరికరాలు రావడానికి మరో కొద్ది రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. భద్రాద్రి థర్మల్ కేంద్రంలో తరచూ సాంకేతిక సమస్యలు, మరమ్మతులు రావడం సాధారణమైపోయిందని, దీనివల్ల ఉత్పత్తి సామర్థం దెబ్బతిం టోందని అధికారులు చెబుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగినట్లుగా థర్మల్ కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాల్సిన తరుణంలో సాంకేతిక సమస్య లను త్వరితగతిన పరిష్కరించి నిలిచిపోయిన మూడో యూనిట్‌ను యుద్ధప్రాతి పదికన పునరుద్ధరింప చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## రాజీవ్ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

### రాజీవ్ సద్భావనాయాత్ర స్మారక సమితి కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్

### ప్రముఖ యూరాలజిస్ట్ డా. సి. మల్లికార్జున్‌కు సద్భావనా అవార్డు ప్రదానం




ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్.సి.మల్లికార్జున్‌కు సద్భావనా అవార్డును ప్రదానం చేస్తున్న పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 19, ప్రభాతవార్త :** మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ త్యాగ ధనుడు, గొప్ప మహానుభావుడని, రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి సాధించిందని పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో సోమవారం చార్మినార్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఎగురు వేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షులు, రాష్ట్ర బిసి సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారు వి.హనుమంతరావుతో కలిసి ప్రముఖ యూరాలజిస్ట్, ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లి కార్జున్‌కు రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి తరపున సద్భావనా అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు ఎంత గానో కృషి చేశారని, దేశంలో కొత్త టెక్నాలజీ, మొబైల్, కంప్యూటర్ రంగాలను అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. దేశంలో కులాలు, మతాలు పేరుతో దేశ భక్తి గురించి ఆర్‌ఎస్ఎస్, బిజెపి మాట్లాడితే ప్రజలు ఊరుకోరని, బిజెపి మతాలు మధ్య కొట్లాట పెడుతున్నదని, బిజెపి అప్రజాస్వామిక విధానా లకు పాల్పడుతున్నదని ఆయన తెలిపారు. ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున్‌కు సద్భావనా అవార్డును ప్రధానం చేయటం సంతో షంగా ఉందని తెలియజేశారు. ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావత్ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం స్వర్గీయ రాజీవ్ గాంధీ ఎంతగానో కృషి చేశారని, 18 యేళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లా డుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారని, వారికి సముచిత స్థానం కల్పించవలసిన అవసరం ఉందని తెలిపారు.

**సీనియర్లకు, పాతవారికి ప్రాధాన్యత కల్పించాలి : వి.హెచ్**

కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తున్న సీనియర్లకు, పాతవారికి పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పించవలసిన అవసరం ఉందని తెలంగాణ బిసి సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారుల వి.హనుమంతరావు అన్నారు. ఇప్పుడు వచ్చిన వాళ్లు నడిపిస్తున్నారని, పాతవారికి అన్యాయం జరుగుతున్నదని, సీనియర్లకు, పాత వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన తెలిపారు. పార్టీలో సీనియర్లకు తగిన ప్రాధాన్యత కల్పించే విషయమై తాను ఏకీభవిస్తున్నానని మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్,మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్,రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ప్రధాన కార్యదర్శులు జి.ఆనంద్,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 2 వార్‌రూమ్‌ల ఏర్పాటు: శివచరణ్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** త్వరలో జరిగే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 2 వార్ రూమ్‌లనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఆయా జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువజన కాంగ్రెస్ శ్రేణులను వారు సమన్వయం చేస్తారని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల సూచనల మేరకు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు.



డిజిపి కార్యాలయంలో జరిగిన ఆయుధ పూజలో పాల్గొన్న డిజిపి ఆనంద్, శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజ

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** దసరా నవరాత్రుల సమయంలో జరిగే ఆయుధ పూజ సోమవారం డిజిపి కార్యాలయంలో ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఆయుధ పూజలో డిజిపి ఆనంద్‌తోపాటు శాంతిభద్రతల డిజి మహేష్‌భగవత్, పరిపాలనా ఎఐజి రమణకుమార్‌సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. డిజిపి కార్యాలయంలోని ఆయుధాలను పూజలో ఉంచి పూజలు చేశారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకుందాం

### ఓటర్ల తొలగింపు, కేంద్రం రాజ్యాంగ ఉల్లంఘనలపై విహెచ్ మండిపాటు

**హైదరాబాద్ అక్టోబరు 19 ప్రభాతవార్త:** 'ఓట్ చోరీ, కానూన్ చోరీ, సంస్థ చోరీ' వివాదాల నేపథ్యంలో ఆర్‌ఎస్ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థలను కాషాయీకరణ చేస్తోందని ప్రభుత్వ సలహాదారు (బీసీ సంక్షేమం, అభివృద్ధి), మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్ చోరీ ఉదంతంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్ ఎన్నికలను తారుమారు చేయడానికి, అన్ని వ్యవస్థలను కాషాయీకరించడానికి పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశ లౌకిక స్వభావాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆడు తున్న దుష్ట క్రీడలను గమనించి తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

# డబుల్ శాలరీ ఉద్యోగులు ఔట్

### అదనపు చెల్లింపుల రికవరీకి చర్యలు

### వేతన అక్రమాల్లో 3 వేల మందికి ఉద్వాసన

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల నుండి డబుల్ జీతాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 3,300 మంది ఉద్యోగులక సర్కార్ ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. ఒకే సమయంలో రెండు చోట్ల పనిచేస్తున్నట్లు చూపి డబుల్ వేతనాలు తీసుకున్న నేపథ్యంలో వాటిని తిరిగి రాబట్టడానికి, క్రమశిక్షణా చర్యలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టినట్లు ఆర్థిక శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగులు ఒకే సమయంలో రెండు ప్రభుత్వ సంస్థల నుండి జీతాలు పొందుతున్నట్లు రికార్డుల పరిశీలనలో తేలింది. కొన్ని సందర్భాల్లో, ఉద్యోగులు వేర్వేరు జీతాలు తీసుకుంటూనే పలు కార్యాలయాల్లో హాజరు నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సంవత్సరాలుగా జరిగిన ఈ అదనపు చెల్లింపుల విలువ అనేక వేల కోట్ల రూపాయలకు చేరుతుందని అంచనా. అవకతవకలను గుర్తించిన తర్వాత అధికారులు వందలాది మంది ఉద్యోగులకు జీతాల చెల్లింపులను నిలిపివేసి, సుమారు 600 మంది సిబ్బందిని తొలగించారని వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలపై ఈ పరిశీలన జరిగింది. జీతాల చెల్లింపు మరియు హాజరు రికార్డులను పరిశీలించే సమయంలో ఈ అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఉద్యోగులు ఒక కార్యాలయంలో పనిచేస్తూనే, మరో విభాగం లేదా సంస్థ నుండి జీతాలు తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని కేసులు చాలా సంవత్సరాల క్రితం నాటివని కూడా విచారణలో తేలింది. దీంతో, నకిలీ ఉద్యోగ, జీతభత్యాల చెల్లింపులు సుదీర్ఘకాలం పాటు ఎలా గుర్తించబడకుండా పోయాయనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీతాల చెల్లింపునకు బాధ్యత వహించే డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు, ఇతర అధికారుల పాత్రను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినట్లు తేలిన వారిపై శాఖాపరమైన చర్యలు, న్యాయపరమైన విచారణలు కూడా జరిగే అవకాశం ఉంది. ప్రమేయం ఉన్న మొత్తం సొమ్మును నిర్ధారించడానికి మరియు లబ్ధిదారులందరినీ గుర్తించడానికి అధికారులు రికార్డులను ధృవీకరిస్తున్నారు. పరిశీలనలో మరిన్ని కేసులు వెలుగులోకి వస్తున్నందున, రికవరీ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సినిమా రంగంపై మాఫియా పడగ



నిన్నటి వరకు దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌ల హాల్‌చల్.. నేడు బిష్ణోయ్ గ్యాంగ్ హంగామా



## హాలీవుడ్‌లో కాల్పులు..టాలీవుడ్‌లో కిడ్నాప్‌లు, డ్రగ్స్ కేసులు.. మాలీవుడ్‌లో దాడులు, కిడ్నాపులు

**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** భారతీయ సినిమా రంగం ప్రపంచంలో అగ్రశ్రేణి సినీ రంగంలో ఒకటిగా వుందనేది అందరికి తెలిసిందే. హాలీ వుడ్ తరువాత అంతటి క్రేజి వున్నది భారత లో తయారవుతున్న సినిమాలే అనేది విదితమే. ఈ విషయంలో ఒకప్పుడు బాలీవుడ్ సి నిమాలు ముందంజలో వుండగా ఇప్పుడు టాలీవుడ్ సినిమాలు వున్నాయి. ఇటీవల కాలంలో ప్రపంచ స్థాయిలో పేరొందిన అనేక సినిమాలు భారత్‌లో నిర్మాణం కాగా ఇందులో అనేకం విదేశీయులను అలరించాయి. అయితే ఇదే సమయంలో భారతీయ సినీ రంగంపై మాఫియా పడగ నీడ చాలా కాలంగా వుండడం అన్ని వర్గాలను ఆందోళనకు గురిచేస్తున్న అంశం. ఈ క్రమంలో బాలీవుడ్‌లో అనేక మందిని మాఫియా డాన్‌లు కాల్చి చంపగా మరికొందరు గాయపడ్డారు. బాలీవుడ్ యువ హీరో టైగర్ ష్రాఫ్‌పై బిష్ణోయ్ గ్యాంగ్ ఆదివారం రాత్రి కాల్పులు జరపడం దేశ వా వ్యాప్తంగా సంచలనం రేపగా ఈ ఘటన భారతీయ సిని రంగంపై వున్న మాఫియా పడగ మరోసారి తెరమీదకు వచ్చింది. బాలీవుడ్‌తో పోలిస్తే ఇ తర ప్రాంతాలలో వున్న సినీ రంగంపై ఇంతటి దాడులు లేకున్నా టాలీవుడ్‌లో గతంలో నిర్మాతలను కొందరు కిడ్నాప్ చేసిన ఉదంతాలున్నాయి. ఇదే సమయంలో డ్రగ్స్ కేసులో సినీ రంగానికి చెందిన వారు పట్టుబడడం, కొందరు ఆత్మహత్యలకుపాల్పడిన ఘటనలున్నాయి. దక్షిణాది లోని మాలీవుడ్‌లో కొందరు నటులు తమకు ప్రత్యర్థులుగా వున్న వారిపై దాడులకు పాల్పడిన ఉదంతాలు, కిడ్నాప్ చేసిన ఉదంతాలు వున్నాయి.

ఒకప్పుడు బాలీవుడ్ సినీ రంగంలో ముంబాయి అండర్ వరల్డ్ మాఫియా పెట్టుబడులు పెట్టడం బహిరంగ రహస్యమే. ప్రస్తుతం పాకిస్తాన్‌లో తలదాచుకున్న నిన్నటి తరం ముంబాయి అండర్ వరల్డ్ డాన్, ముంబాయి వరుస పేలుళ్ల కేసులో నిందితుడు దావూద్ ఇబ్రహీం బాలీవుడ్ సిని మా రంగాన్ని దశాబ్దాల పాటు తన గుప్పిట్లో వుంచుకున్నాడని పోలీసులు చెబుతారు. బాలీవుడ్ సినిమాల విషయంలో 1980, 1990 దశకంలో దావూద్ ఇబ్రహీం ఎంత చెబితే అంత అన్నట్లుగా వుండేదని సినీ ప్రముఖులు చెబుతారు. అప్పట్లో దుబాయ్‌లో జరిగే క్రికెట్ మ్యాచ్‌లకు దావూద్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిస్తే ఎంతో మంది బాలీవుడ్ తారలు అతని పక్కన వుండేవారు. ముంబాయి వరుస పేలుళ్ల తరువాత దా వూద్ ఇబ్రహీం పాక్‌కు పారిపోగా బాలీవుడ్‌లో ఇప్పుడు అతని అనుచరుల హంగామా చాలావరకు తగ్గిందని పోలీసులు చెబుతున్నారు. అయిన ప్పటికీ ఒకప్పుడు అతని వద్ద పనిచేసిన నేరగాళ్ల సొంతంగా ముఠాలు ఏర్పాటు చేసుకుని బాలీవుడ్ సినీ తారలను బెదిరించి కోట్ల రూపాయల ను వసూలు చేస్తున్నట్లు అభియోగాలు వున్నాయి. తమ మాట వినని వారిపై కాల్పులు జరుపుతున్న నేరగాళ్లు కూడా వున్నారు. మాఫియా నే రగాళ్ల కాల్పులకు బలైన వారిలో గాయకుడు, సంగీత దర్శకుడు గుల్షన్ కుమార్‌తో పాటు పంజాబి గాయకుడు సిద్దూ మూసేవాల, బాలీవుడ్ సి నీ రంగంతో మంచి సంబంధాలు కలిగిన ఎన్సీపి నాయకుడు సిద్దిఖీ వున్నారు. నేరగాళ్ల కాల్పుల్లో గాయపడ్డ వారిలో రాకేష్ రోషన్ సహా మరి కొం దరు వున్నారు. ఇక తాజాగా బాలీవుడ్‌ను టార్గెట్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్‌లో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌తో పాటు గిప్పీ గ్రెవాల్ , గురు రంధ్వా, ఏపీ థిల్లాన్, హీరోయిన్ దిశా పటాని, కపిల్ శర్మ సహా ఇంకొందరున్నారు. ఇటీవల కాలంలో బాలీవుడ్‌ను అండర్ వరల్డ్ గ్యాంగ్ నేరగాళ్ల కంటే బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నట్లు వరుస ఘటనలు చెబుతున్నాయి. ఈ క్రమంలో హీరో సల్మాన్ ఖాన్ సహా మరికొందరికి మహారాష్ట్ర సర్కారు భద్రతను కల్పించింది.

బాలీవుడ్ విషయం ఇలావుంటే టాలీవుడ్‌లోనూ గతంలో నిర్మాతల కిడ్నాపులు జరిగాయి. విశ్రాంత అదనపు ఎస్‌పి తనయులు టాలీవుడ్‌లో ఈ తరహా నేరాలకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. వీరిలో ఒకరిని సహచర నేరగాళ్లే దారుణంగా చంపేశారు. రెండు వేల దశకంలో టాలీవుడ్‌లో కొందరు నిర్మాతలను ప్రత్యర్థులు కిడ్నాప్ చేసి బలవంతంగా వసూళ్లకు పాల్పడిన ఉదంతాలున్నాయి. ఇక ప్రస్తుతం ప్రముఖ నిరా ్మతగా వుండడంతో పాటు సినీ రంగంలో కీలక హోదా కలిగిన నాయకుడు ఏకంగా నకిలీ నోట్ల చలామణిలో అరెస్టయ్యాడు. ఇక డ్రగ్స్ కేసుల గురించి తెలిసిందే. అనేక మంది టాలీవుడ్ తారలు డ్రగ్స్ కేసుల్లో పట్టుబడగా ఇద్దరు నిర్మాతలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇక మాలీవుడ్‌లో మరో రకం మాఫియా రాజ్యమేలుతుంది. తనకు వ్యతిరేకంగా వున్న ఓ హీరోయిన్‌ను మరో హీరో ఏకంగా కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ డం సంచలనం రేపింది. మొత్తం మీద భారతీయ సినీ రంగంపై మాఫియా పడగ నీడలా వెంటాడుతోంది.

# భవిష్యత్తు అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్‌కు శత్రువే

## అధికారుల సమీక్షలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు



**టెల్‌అవీవ్, అక్టోబరు 19:** భవిష్యత్ అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్‌కు శత్రువు కావచ్చునని ఆ దేశ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. ఈ తరుణంలో భారత్, లాటిన్ అమెరికా వంటి బలమైన దేశాలతో పొత్తు పెట్టుకోవాలని నెతన్యాహు తన అధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఈనెల 27న ఇజ్రాయెల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో రెండేళ్లలో ఇజ్రాయెల్ పట్ల శత్రుభావంతో ఉండే వ్యక్తి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టవచ్చునని, వారు పురుషుడు లేదా మహిళ ఎవరైనా కావచ్చునని, మీరు దానిని ఎలా ఎదుర్కొంటారు అని అధికారులను ఉద్దేశించి నెతన్యాహు ప్రశ్నించారు. అగ్రరాజ్యంతో సంబంధాలు ఎలా నిర్వహిస్తారని అడిగారు. అమెరికా విధానంలో సంభవించే పెద్ద మార్పుకు సిద్ధమవుతూ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లోనే ఇజ్రాయెల్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. వచ్చే రెండేళ్లలోనే అమెరికా సాయంతో చేయగలిగినదంతా చేయాలని నెతన్యాహు అన్నారు. అదే సమయంలో భవి ష్యత్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మరిన్ని దేశాలతో సంబంధాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కూటములను ఏర్పాటు చేసుకోవాలని, ఇప్పుడు తాను అదే పని చేస్తున్నానని అన్నారు. భారత్ చిన్న దేశమేమీ కాదని, అలాగే లాటిన్ అమెరికా, బ్రెజిల్‌లలో త్వరలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కూటముల సంఖ్యను విస్తరించుకోవాలని, విలువ పెంచే సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎన్నికలకు ముందు ఇజ్రాయెల్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన ప్రధా న ప్రత్యర్థి అయిన గాడి ఐసెన్‌కోట్ తప్పుబట్టారు. ఇతర దేశాల పేరు చెప్పి నెతన్యాహు ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# అమెరికాలో ప్రతి చిన్నారికి స్పేస్‌ఎక్స్ షేర్ ఇస్తా

## 72 మిలియన్ల మంది పిల్లలకు లబ్ధి చేకూరే అవకాశం

## ఈ బహుమతి విలువ సుమారు రూ.87 వేల కోట్లు: ఎలాన్ మస్క్



**వాషింగ్టన్, అక్టోబరు 19:** ప్రపంచ కుబేరుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ మరో సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఏడాది అమెరికాలోని ప్రతి చిన్నారికి తన అంతరిక్ష చిన్నారికి నా స్పేస్‌ఎక్స్ షేర్లలో ఒక షేర్ ఇస్తాను. ఇది ఇలాంటి కార్యక్రమాల్లో మొదటిది మాత్రమేనని మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రకటనపై స్పేస్‌ఎక్స్ సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ పథకానికి సంబంధించి అర్హతలు, పిల్లల వయోపరిమితి, షేర్ల బదిలీకి అవసరమైన చట్టపరమైన నిబంధనలపై కూడా మస్క్ స్పష్టత ఇవ్వలేదు. బిజినెస్ ఇన్‌సైడర్ నివేదిక ప్రకారం, అమెరికాలో సుమారు 7.2 కోట్ల మంది చిన్నారులు ఉన్నట్లు 2025 జనాభా గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రతి చిన్నారికి ఒక్కో షేర్ చొప్పున అందిస్తే, ఈబహుమతి మొత్తం విలువ సుమారు 10.5 బిలియన్ డాలర్లు ఉండవచ్చని అంచనా. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.87 వేల కోట్లకు పైగా ఉంటుంది. ఫోర్బ్స్ అంచనాల ప్రకారం, ఎలాన్ మస్క్ ప్రస్తుత సంపద సుమారు 908.5 బిలియన్ డాలర్లు. ఈ అంచనా ప్రకారం ఆయన ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా కొనసాగుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ తన షేర్లలో 5 శాతాన్ని ప్రజా ప్రయోజన నిధికి కేటాయించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మస్క్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఆ సంస్థ తీసుకున్న నిర్ణయంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. షేర్లను ప్రజా ప్రయోజన నిధికి ఇవ్వడం కంటే నేరుగా ప్రజలకే అందించాలని ఆయన సూచించారు. ఎలాన్ మస్క్ 2002లో స్పేస్‌ఎక్స్ సంస్థను స్థాపించారు. ఆ సంస్థలో దాదాపు సగం వాటా ఆయనకు ఉన్నట్లు అంచనా. స్పేస్‌ఎక్స్ షేర్ల ఇటీవలి ట్రేడింగ్ ధరల ఆధారంగా ఈ భారీ బహుమతి విలువను అంచనా వేశారు. ఈ కార్యక్రమం భవిష్యత్తులో చేపట్టనున్న అనేక కార్యక్రమాల్లో మొదటిదేనని మస్క్ వ్యాఖ్యానించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఈ ప్రకటన అమలులోకి వస్తుందా, షేర్ల పంపిణీ ఎలా జరుగుతుంది అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మస్క్ ప్రకటన వెలువడిన వెంటనే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందనలు వచ్చాయి.



రూ.50లక్షల చెక్కును మృతురాలు సోన తల్లిదండ్రులకు అందిస్తున్న కాలేజీ యాజమాన్యం

## నాదర్‌గుల్ ఎంవిఎస్‌ఆర్ కాలేజీలో దుర్ఘటన

# మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం

**సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** హైదరాబాద్ శివారు ప్రాంతం నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గత శనివారం సాయంత్రం బతుకమ్మ సంబరాల పేరిట నిర్వహించిన ఈవెంట్‌లో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన విద్యార్థిని సోనా కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ.50 లక్షల ఆర్థిక సాయం (పరిహారం) అందించింది. సంగమం-2026 పేరుతో కాలేజీలో జరిగిన బతుకమ్మ-దాండియా సంబరాల్లో అపశృతి జరిగి లైటింగ్స్ స్టాండ్ కూలడంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న వనపర్తి జిల్లా శంకర్‌గంజ్ ప్రాంతానికి చెందిన సోనా (18) మృతి చెందడంతో పాటు పలువురు విద్యార్థులు గాయపడ్డ సంగతి విదితమే. అయితే జరిగిన ఘటనపై స్పందించిన కాలేజీ యాజమాన్యం మృతురాలి కుటుంబానికి న్యాయం చేయడానికి ముందుకు వచ్చింది. అదే విధంగా ప్రస్తుతం యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్ర విద్యార్థులందరికీ వైద్య చికిత్సలు అందించడానికి ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో నాదర్‌గుల్‌లోని కాలేజీకి తల్లిదండ్రులను రప్పించి అక్కౌంటెంట్ ద్వారా రూ.50 లక్షల చెక్కును అందజేసింది. సోనా తండ్రి అశోక్ చెక్కును తన భార్యతో కలిసి తీసుకున్నారు. నాదర్‌గుల్ ఎంవిఎస్‌ఆర్ కాలేజీలో జరిగిన దుర్ఘటనలో బాధితులైన వారికి బిజెపి అండగా నిలబడిందని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు.

# కల్లుగీత కార్మికుల ఉపాధిని రక్షించాలి

## ప్రైవేట్ కాంట్రాక్టర్ల జోక్యాన్ని అరికట్టాలి

## కల్లుగీత ఉద్యోగుల అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్

**హైదరాబాద్,అక్టోబరు 19, ప్రభాతవార్త:** కల్లుగీత కార్మికులు, కల్లు డిపో కార్మికుల జీవనోపాధిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు హన్మాండ్లు గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికుల సహకార సంఘాలను సబ్‌లీజ్ పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల సాంప్రదాయ గీత కార్మికుల ఉపాధికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కల్లు డిపోల్లో ఆటోమేటెడ్ పాలిథిన్ ప్యాకింగ్, సీలింగ్ యంత్రాలను వినియోగిస్తుండటంతో కల్లు బాట్లింగ్, ప్యాకింగ్, శుభ్రపరిచే పనులపై ఆధారపడిన కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హన్మాండ్లుగౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్మికులకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని, ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కోరారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఎన్. భూమా గౌడ్, ప్రధాన కార్యదర్శి పులి లక్ష్మీపతి గౌడ్, కార్యని ర్వాహక అధ్యక్షుడు లింగాల గోవర్ధన్ గౌడ్, సం యుక్త కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, గౌరవ సలహా దారు అంబటి నారాయణ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి కే.శివన్న గౌడ్, కోశాధికారి జి. నరసింహా గౌడ్, ఆఫీస్‌కార్యదర్శి బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

# 21న హైకోర్టు, జిల్లా కోర్టులకు సెలవు

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** ఈనెల 21వ తేదీన హైకోర్టుకు,జిల్లా కోర్టులకు సెలవు ప్రకటించినట్లుగా రిజిస్ట్రార్ జనరల్ తెలిపారు. దసరా పండుగ సందర్భంగా రెండో రోజు కూడా సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

21వ తేదీన జరగాల్సిన కేసుల విచారణలను వాయిదా వేస్తూ 22వ తేదీ నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

# భవనంపై నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

## మూడు నెలల క్రితమే వివాహం

## దసరా పండుగ వేళ విషాదం



తమ్మిశెట్టి ప్రవీణ్(ఫైల్)

**హైదరాబాద్(ఎల్.బి.నగర్), అక్టోబరు 19 ప్రభాత వార్త:** మూడు నెలల క్రితమే వివాహం చేసుకున్న ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం మూడు నెలల క్రితమే వివాహం చేసుకున్న తమ్మిశెట్టి ప్రవీణ్(34) సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. కాగా షేర్ మార్కెట్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టగా దాంట్లో పూర్తి స్థాయిలో నష్టాలు వచ్చాయి. బంధువులు స్నేహితుల వద్ద పరువు పోతుందనే భయంతో ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# తాగునీరు,విద్యుత్ కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు

## ఉమ్మడి జిల్లాల సీనియర్ ఐఎఎస్ అధికారులతో సిఎస్ సంజయ్ జాజు విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:**ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు,విద్యుత్ కొరత రాకుండా జిల్లా,మండల స్థాయిలోనూ ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడనున్న తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవడానికి రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖల వారీగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేస్తున్నామని, ఇదే విధంగా సూక్ష్మ స్థాయిలోనూ తగు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికే వ్యవసాయానికి, గృహోపయోగ అవసరాలకు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు ఏ విధమైన పవర్ కట్ విధించబడలేదని అన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేశామన్నారు. పగటి పూట అత్యవసర పరిస్థితుల్లో మాత్రం 25 డిగ్రీల పరిమితిలో ఏ.సి లను వాడాలని, సాయంత్రం ఆరు గంటల తర్వాత ఏ.సీ ల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని థర్మల్ స్టేషన్లలో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, యాదాద్రి థర్మల్ కేంద్రంలో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని చేయడానికి ఈ కేంద్రానికి ప్రత్యేకంగా కేటాయించిన ఐదుగురు స్పెషల్ అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని తెలియచేసేందుకు త్వరలో అఖిల పక్ష సమావేశం జరుగుతుందని, అదేవిధంగా క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కూడా ఉంటుందని సి.ఎస్ తెలిపారు. వ్యవసాయ అవసరాలకు స్థానికంగా ఉండే నీటి వనరులనుండి అక్రమంగా ప్రత్యేకంగా మోటార్లద్వారా నీటిని తోడుతున్నారని, దీనిద్వారా, అధిక లోడ్ పడి స్థానికంగా ట్రాన్స్ ఫార్మర్లు కాలి పోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. మంజీరా, సింగూరు ద్వారా నీటి సరఫరా లేనందున, ఈ జలాశయాలనుండి వచ్చే 110 ఎం.జి.డిల నీటిని, ప్రత్యామ్నాయ మార్గాలైన మిషన్ భగీరథ నుండి 60 ఎం.జి.డీ లను, కృష్ణా ఇతర సోర్సుల ద్వారా నీటిని తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో, కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నిబంధనలను అనుసరించి బోరు బావుల తవ్వకానికి అనుమతించాలని, నిర్మాణ ఇతర పనులకు మాత్రం కొత్తగా బోరు బావుల తవ్వకానికి అనుమతించవద్దని, కేవలం తాగునీటి అవసరాలకు ప్రస్తుతం ఉన్న బోరుబావులను మరింత లోతుగా తవ్వడానికి అనుమతిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. నగరంలో నల్లాలకు అక్రమంగా మోటార్లను బిగించి పెద్ద ఎత్తున నీటిని తోడే విధానంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, హైడ్రా తదితర ఏజెన్సీ లతో కలిసి అక్రమ నీటి మోటార్లను ఏరివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ ఒకటవ తేదీనుండి హైదరాబాద్ నగరంలో నిర్మాణ పనులకు ఎస్.టి.పి ల ద్వారా వచ్చే ట్రీట్మెంట్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్ల ద్వారా అందచేయనున్నట్టు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో భూ గర్భ జలాల మట్టం గణనీయంగా పడిపోతున్నందున, తాగునీటికి ఏవిధమైన సమస్య లేకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. నల్గొండ జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత ముమ్మరంగా చేస్తున్నామని ప్రత్యేక కార్యదర్శి హరిచందన తెలిపారు. కరీంనగర్ జిల్లాలో వచ్చే జూన్ మాసం వరకు తాగు నీటి సమస్య లేదని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ.డి.ఎక్కా అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికను రూపొంచి అమలు చేస్తున్నామని కార్యదర్శి ఇలంబర్తి చెప్పారు. మహబూబ్‌బాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు జూన్ వరకు తాగు నీరు అందించాలంటే పాలేరు రిజర్వాయర్‌లో నాలుగు టీ.ఎం.సి ల జలాలు కావాలని, ప్రస్తుతం ఈ జలాశయంలో రెండు టీ.ఎం.సి ల జలాలే ఉన్నాయని ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, మున్సిపల్ శాఖ కార్యదర్శి టీ. కె. శ్రీదేవి, నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సి.ఎం.డి వరుణ్ రెడ్డి, ఎస్.పి.డీ.సీ.ఎల్ సి.ఎం.డి జితేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



వస్త్రాల షాపుల నుంచి వస్తున్న పొగలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

# రికాబ్‌గంజ్ వస్త్రాల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

## కోట్లాది రూపాయలు విలువ చేసే వస్త్రాలు బూడిద

**హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 19 ప్రభాత వార్త:** హైదరాబాద్ పాతబస్తీ హైకోర్టు సమీపంలో ఉన్న రికాబ్‌గంజ్ వస్త్రాల మార్కెట్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిత్యం కొనుగోలుదారులతో ఎంతో రద్దీగా ఉండే రికాబ్‌గంజ్‌లోని వస్త్రాల మార్కెట్లలో ఆ సమయంలో ఎవరూ లేక పోవటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగ లేదు. అగ్ని ప్రమాదం వల్ల దాదాపు ఇరవై షాపులలోని వస్త్రాలు బూడిదయ్యాయి. చార్మినార్ పోలీసులు,డిఎఫ్ఐ వెంకన్న కథనం ప్రకారం హైదరాబాద్ పాతబస్తీ హైకోర్టు సమీపంలో ఉన్న రికాబ్‌గంజ్‌లో వందలాది వస్రాల దుకాణాలు ఉన్నాయి. నిత్యం ఈ మార్కెట్‌లో కోట్లాది రూపాయల వస్త్రాల వ్యాపారాలు జరుగుతుంటాయి. దసరా, దీపావళి పం డుగలు సందర్భంగా వస్త్రాల వ్యాపారులు పెద్ద ఎత్తున వస్త్రాలను ఖరీదు చేసి నిల్వ ఉంచారు. కాగా సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో సునీతా టెక్స్‌టైల్స్ ఎదురుగా ఉన్న వస్త్రాల భవనంలోని మొదటి అంతస్తులో ఆకస్మాత్తుగా మంటలు లేచి షాపులలో ఉన్న బట్టలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న హైకోర్టు, సాలార్‌జంగ్ మ్యూజియం, గౌలిగూడ, మొగల్‌పుర ఫైర్ ఇంజన్లు అగ్ని ప్రమాదం జరిగిన రికాబ్‌గంజ్ మార్కెట్‌కు చేరుకుని మంటలను ఆర్పివేశాయి. కాగా ఆ సమ యంలో ఇంకా షాపులు తెరుచుకోక పోవటంతో పెద్ద ప్రమాదం తప్పిందని డిఎఫ్ఐ వెంకన్న తెలిపారు. చార్మి నార్ నియోజకవర్గం శాసన సభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ సంఘటన స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. అగ్ని ప్రమాదంలో 25 షాపులు కాలి పోయాయని అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం ఇంకా తెలియలేదు. ఈ కేసును చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కరవుపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి

## కేబినెట్ సబ్‌కమిటీకి 23 ప్రశ్నలతో బిఆర్ఎస్

## ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,అక్టోబరు19,ప్రభాతవార్త:** తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరవు, ఎల్‌నినో పరిస్థితులు ప్రకృతి వైపరీత్యంకాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ అన్నారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, నేరపూరిత నిరక్ష ్యంవల్ల ఏర్పడిన మానవ తప్పిద మేనని మండిపడ్డారు. ఎల్‌నినో, కరువు పరిస్థి తులపై వాతావరణ శాఖ ఏప్రిల్‌లోనే హెచ్చరిం చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు నిద్రపోయిందని దాసోజు శ్రవణ్ విమర్శించారు. వర్షకాలం ముగిసి పంటలు ఎండిపోయాక కేబి నెట్ సబ్ కమిటీని వేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో కాళేశ్వరంప్రాజెక్టును బద్నాం చేస్తూ 1,000 టీఎంసీలకు పైగా ప్రాణహిత వరద నీటిని స ముద్రం పాలు చేశారని ఆరోపించారు. విద్యుత్ డిమాండ్‌ను సరిగ్గా అంచనా వేయలేక రోజుకు రూ. 42.92 కోట్ల ప్రజాధనాన్ని అధిక రేట్లకు కొనుగోలు చేస్తూ తగలేశారని అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, సబ్ కమిటీ సభ్యులకు బహిరంగ లేఖను రాశారు. అందులో 23 ప్రశ్నలను సంధించారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో నెం. 1523లో నివేదిక సమర్పించడానికి ఎటువంటి గడువు గానీ, కరవు సహాయక చర్యల కోసం బడ్జెట్ గానీ కేటాయించలేదని, జలాశయాలు అడుగంటి తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న తరుణంలో జిల్లాలకు కేవలం రూ. 1 కోటి కేటాయించడం సిగ్గుచేటని శ్రవణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వం ముందు ఐదు కీలక డిమాండ్లను ఉంచారు. సబ్‌కమిటీకి 15 రోజుల గడువు విధించి తగిన నిధులు సమకూర్చాలని, కరవు పరిస్థితులపై చర్చించేందుకు వెంటనే ఉభయ సభల ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి రూ. 20,000 కోట్ల అత్యవసర సప్లిమెంటరీ బడ్జెట్‌ను ఆమోదించాలని కోరారు. అలాగే కరవు ఖర్చులు, నీటి వృథా, విద్యుత్ కొనుగోళ్లపై సమగ్ర శ్వేత పత్రం విడుదల చేయడంతో పాటు, పంట నష్టపోయిన ప్రతి రైతుకూ, కౌలు రైతులకూ తక్షణమే ఎకరాలవారీగా పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ప్రపంచ తెలుగు మహాసభల తేదీల మార్పు

## డిసెంబరు 19, 20న ఒంగోలులో బాలల మహాసభలు: గజల్ శ్రీనివాస్

**అమరావతి, అక్టోబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు (బాలల) నిర్వహణ తేదీలను మార్చినట్లు పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ తెలిపారు.ప్రకాశం జిల్లా ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ మహా సభలను తొలుత డిసెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించగా, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనూ, పలు ప్రవాస తెలుగు సంఘాల ప్రత్యేక అభ్యర్థనల మేరకూ 2026 డిసెంబర్ 19, 20 తేదీలకు మార్చినట్లు ఆయన వెల్లడించారు. తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడంతో పాటు బాలబాలికల్లో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళల పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని డా. గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ముఖ్యంగా 16 సంవత్స రాలలోపు బాలబాలికలు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వేలాదిగా పాల్గొని తమ సాహిత్య, సాంస్కృతిక, కళా ప్రతిభను ప్రదర్శించనున్నారని మహాసభల సమన్వయకర్తలు డా. కె. మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్ వెల్లడించారు. ప్రపం చవ్యాప్తంగా ఉన్న తెలుగు సంఘాలు, విద్యా సంస్థలు, తల్లిదండ్రులు, బాలబాలికలు మారిన తేదీలను గమనించి, ఈ మహాసభలను విజయ వంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# 'స్వర్ణరథంపై వేంకటాద్రీశుడు': రథంలాగిన మహిళా భక్తులు

**తిరుమల,అక్టోబరు 19 ప్రభాతవార్తప్రతినిధి:** వేంకటేశ్వరుడు బంగారు రథాన్ని వాహనంగా చేసుకుని ఉభయదేవేరులతో కలిసి మాఢవీధుల్లో విహరించాడు. శ్రీదేవి(లక్ష్మీదేవి)సువర్ణమయి. ఆమే బంగారుకాగా ఆమెను భరించే స్వామివారు బంగారురథంలో ఊరేగడం ఎంతో ఆనందం. సప్తగిరులపై శేషాచలదీశుడికి జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం 7గంటలకు శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి బంగారుతేరులో పయనిస్తూ భక్తుల్ని తన కరుణాకటాక్షాలతో అనుగ్రహించాడు. బ్రహ్మోత్సవాల నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరు వాత ఉదయం ఆలయంనుండి మలయప్పస్వామిని వెలుపలకు తీసుకువచ్చారు. ఇక్కడ వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని బంగారు రథంపై అధిరోహింపజేశారు. కర్పూర హారతులిచ్చి ఉదయం 7గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. బంగారు రథంముందు దాస భక్తుల నృత్యాలు, కోలాటలు కోలాహలం, మం గళవాయిద్యాల నడుమ తిరు మాఢవీధులలో కడురమణీయంగా సూర్యోదయంవేళ స్వర్ణరథో త్సవాన్ని అదిరోహించిన ఉభయదేవేరులతో కొలువైన శ్రీవారిని మహిళలు దర్శించుకుని స్వయంగా స్వర్ణరథాన్ని లాగారు. ఈ స్వర్ణర థోత్సవంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య



చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నన్న పనేని సదాశివ రావు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమా తదితరులు పాల్గొన్నారు.



## ఆసియా పారాగేమ్స్ జావెలిన్‌లో

# రింకుకు స్వర్ణం

### అజీత్‌కు రజతం

**ఐచినగోయా:** సోమవారం ఐచినగోయాలో జరుగుతున్న 2026 ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల జావెలిన్ ఎఫ్46 ఈవెంట్‌లో భారత ఆటగాడు రింకు హూడా స్వర్ణం గెలుచుకోగా, అతని సహచరుడు అజీత్ సింగ్ రెండో స్థానంలో నిలిచి రజతం సాధించాడు. రింకు తన చివరి ప్రయత్నంలో ఈ సీజన్‌లోనే అత్యుత్తమమైన 65.11 స్కోరు సాధించి, అజిత్ యొక్క 65.02 అత్యుత్తమ మార్కును అధిగమించి పోడియంపై అగ్రస్థానానికి చేరుకున్నాడు. అజిత్ తన నాలుగో ప్రయత్నంలో సాధించిన మార్క్, ఈ సీజన్‌లోనే అత్యుత్తమమైనది. ఇండోనేషియాకు చెందిన రిజాల్ బాగస్ సక్యోనో 55.30 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ త్రోతో కాంస్యం గెలుచుకున్నాడు. 2022లో జరిగిన గత క్రీడల్లో, ఈ ఈవెంట్‌లో భారత్ పతకాలను కైవసం చేసుకుంది. సుందర్ సింగ్ గుర్జర్ 68.60 మీటర్ల ప్రపంచ రికార్డు త్రోతో స్వర్ణం గెలుచుకోగా, రింకు 67.08 మీటర్లతో రజతం, అజీత్ 63.52 మీటర్లతో కాంస్యం సాధించారు.



## మహిళల ఈవెంట్‌లో సౌమ్యకు స్వర్ణం, రాధకు రజతం

**ఐచినగోయా:** సోమవారం ఐచినగోయా ఆసియా పారా క్రీడల్లో మహిళల 1500 మీటర్ల టి12/టి13 పారా అథ్లెటిక్స్ ఈవెంట్‌లో సౌమ్య స్వర్ణ పతకం గెలుచుకోగా, రాధా వెంకటేష్ రజత పతకం సాధించి భారత్‌కు మరో డబుల్ పోడియంను అందించారు. 18 ఏళ్ల పారా అథ్లెట్ సౌమ్య 5:12.39 సెకన్లలో రేసును పూర్తి చేయగా, చిత్రదుర్గ జిల్లాకు చెందిన 27 ఏళ్ల రాధ 5:30.90 సెకన్లలో రేసును ముగించారు. ఈ ఈవెంట్‌లో పలు కేటగిరీలు ఉన్నందున, రజా పాయింట్ల ఆధారంగా పతక విజేతలను నిర్ణయించారు. సౌమ్య 621 పాయింట్లతో ఫైనల్‌లో అగ్రస్థానంలో నిలవగా, రాధ 421 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.

## లాంగ్ జంప్‌లో నిషాద్‌కు స్వర్ణం

## మహిళల జూడోలో కోకిలకు రజతం



**ఐచినగోయా:** జపాన్‌లోని ఐచినగోయాలో సోమవారం జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల టి47 లాంగ్ జంప్‌లో భారత్ అథ్లెట్ నిషాద్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, మహిళల జె2 52 కేజీల జూడో ఈవెంట్‌లో, కోకిల రజతం గెలుచుకుంది.

రెండుసార్లు పారాలింపిక్ రజత పతక విజేత అయిన నిషాద్ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసి, ఈ గేమ్స్‌లో భారత్‌కు రెండవ స్వర్ణ పతకాన్ని సాధించిపెట్టాడు. ప్రధానంగా హైజంప్‌లో విజయాలకు పేరుగాంచిన నిషాద్ ఫైనల్‌లో రెండుసార్లు 7.11 మీటర్ల దూరాన్ని నమోదు చేశాడు. నిషాద్ 6.95 మీటర్ల జంప్‌తో ప్రారంభించి, తన రెండవ ప్రయత్నంలో 7.09 మీటర్లతో ఆధిక్యంలోకి వచ్చాడు. మూడవ రౌండ్‌లో 7.11 మీటర్ల ప్రయత్నంతో ఆధిక్యాన్ని మరింత పెంచుకున్నాడు. కానీ నాల్గవ ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఐదవ రౌండ్‌లో తన అత్యుత్తమ దూరాన్ని సమం చేసి, 7.07 మీటర్ల జంప్‌తో తన పోటీని ముగించాడు. ఇక మహిళల జె2 52 కేజీల జూడో ఈవెంట్‌లో, స్వర్ణ పతకం కోసం జరిగిన పోరులో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఐబికే ఉలాన్‌బెక్ కైజీ చేతిలో ఓడిపోయిన భారత క్రీడాకారిణి కోకిల రజత పతకాన్ని గెలుచుకుంది. చైనాకు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ యి లియుపై సెమీఫైనల్‌లో అద్భుతమైన విజయం సాధించి, భారత్‌కు పోడియంపై స్థానం కల్పించిన తర్వాత కోకిల ఫైనల్‌లోకి ప్రవేశించింది. అయితే, టైటిల్ పోరులో ఆమె ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది.

# మోనాకు స్వర్ణం, అవనికి రజతం

**ఐచినగోయా:** జపాన్‌లోని ఐచిలో సోమవారం జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో, మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఈవెంట్‌లో భారత షూటర్లు మోనా అగర్వాల్, అవని లేఖరలు వరుసగా స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. ఫైనల్‌లో 250 స్కోరుతో మోనా స్వర్ణం గెలుచుకుని, కొత్త ఆసియా పారా గేమ్స్ రికార్డును నెలకొల్పింది. అవని 249.6 పాయింట్లతో రజతం సాధించింది. ఫైనల్‌లో ఐదవ స్థానం నుండి అద్భుతంగా పుంజుకున్న మోనా, అగ్రస్థానానికి చేరుకుని, తన ప్రత్యర్థులను నిలువరించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆమె సాధించిన విజయ స్కోరు, హాంగ్‌జౌ ఎడిషన్‌లో స్వర్ణం గెలిచినప్పుడు అవని



నెలకొల్పిన 249.6 పాయింట్ల మునుపటి ఆసియా పారా గేమ్స్ రికార్డును అధిగమించింది. దీనికి ముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇద్దరు భారతీయులు ఆధిపత్యం ప్రదర్శించారు. మోనా 629.1 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, చైనాకు చెందిన జాంగ్ కుయిపింగ్ పేరిట ఉన్న పాత మార్కును అధిగమించి, ఆసియా పారా గేమ్స్ క్వాలిఫికేషన్ రికార్డును నెలకొల్పింది. అవని, స్లోవేకియాకు చెందిన వెరోనికా వడోవికోవా సంయుక్తంగా నెలకొల్పిన 629.4 పాయింట్ల ప్రపంచ రికార్డుకు ఆమె చేరువయ్యింది.

## వెస్టిండీస్ సిరీస్‌తో

# బయటపడ్డ టీమిండియా బలహీనతలు



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను 2-2 సమంతో ముగించిన టీమిండియా ఇప్పుడు న్యూజిలాండ్‌కు సిద్ధమైంది. అయితే ఈ సిరీస్‌లో బయటపడిన బలహీనతలు భారత జట్టుకు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ నెల 22న ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌కు భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు బయలు దేరింది. న్యూజిలాండ్ పేస్‌బౌలర్లకు లభించే సహకారం నేపథ్యం లో భారత బౌలింగ్ విభాగానికి ఇది కీలక పరీక్షగా మారనుంది. ఐదు మ్యాచ్‌ల్లో పదేపదే కనిపించిన మూడు సమస్యలు ఇప్పుడు ముందుకొచ్చాయి. పేస్ బౌలింగ్‌లో ప్రత్యామ్నాయాల కొరత, లోయర్ ఆర్డర్‌లో ఫినిషర్ పాత్ర, మిడిలార్డర్ బ్యాటర్లపై మారుతున్న బాధ్యతలు ప్రధాన సవాళ్లుగా మారాయి. కీలక మ్యాచ్‌లో భారత జట్టు అనుభవజ్ఞుడైన పేసర్ భువనేశ్వర్‌కుమార్ తుది జట్టులోకి తీసుకుంది. భారత్‌వద్ద సరిపడా పేస్‌బౌలింగ్ ప్రత్యామ్నాయాలు లేవా? అందుకే మళ్లీ అనుభవజ్ఞుడైన భువనేశ్వర్‌పై ఆధారపడాల్సి వచ్చిందా అనే చర్చ మొదలైంది. కేవలం పరుగులను నియంత్రించడం కాకుండా కీలక సమయాల్లో వికెట్లు తీసి మ్యాచ్ దిశను మార్చగల పేసర్ల అవసరం భారత్‌కు ఉంది. మయాంక్ యాదవ్ రూపంలో భారత్‌కు వేగవంతమైన బౌలర్ ఉన్నప్పటికీ అతడికి ఇంకా అనుభవం, నిలకడ అవసరం. న్యూజిలాండ్‌లో పేసర్లకు సహకారం లభించే పరిస్థితుల్లో ఈ లోపం మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. విండీస్ సిరీస్‌లో భారత బౌలింగ్ వైఫల్యాలు జట్టుకు ఇబ్బందులు తెచ్చాయి. బౌలింగ్ ప్రణాళికలను సరిగ్గా అమలు చేయడంలో జట్టు వెనుకబడింది. ప్రత్యర్థి బ్యాటర్లు దూకుడుగా ఆడుతున్నప్పుడు బౌలర్లు ఒత్తిడిని తట్టుకుని సరైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయాలి. న్యూజిలాండ్‌లో ఈ అంశంపైనే భారత్ మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇక భారత జట్టుకు ఎదురవుతున్న మరో ప్రధాన సమస్య వేగంగా బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్. హార్దిక్ పాండ్యా వంటి ఆటగాడు ఉంటే బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అదనపు ఎంపిక లభిస్తుంది. అలాంటి ఆటగాడు అందుబాటులో లేకపోతే జట్టు కాంబినేషన్‌ను రూపొందించడం కష్టమవుతుంది. శివమ్ దూబే, నితీశ్ కుమార్ ఇద్దరికీ భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఉన్నా, బౌలింగ్‌లో ప్రతి మ్యాచ్‌లో నిర్ణయాత్మక ప్రదర్శన ఆశించడం ప్రస్తుతానికి కష్టమే.

## ప్రపంచ స్కేట్ గేమ్స్..

# ఆనంద్‌కు స్వర్ణం

**పరాగ్వే:** పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్ ప్రపంచ ఛాంపియన్‌గా కిరీటం పొందిన కొద్ది రోజులకే, భారత ఆటగాడు ఆనంద్ వెల్కుమార్ ప్రపంచ స్పీడ్ స్కేట్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 42 కిలోమీటర్ల మారథాన్ టైటిల్‌ను గెలుచుకుని తన రెండవ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. రోడ్ ఈవెంట్‌లో అత్యంత ఎక్కువ సేపు గుంపులో చిక్కుకుపోయిన ఆనంద్, ముగింపు రేఖను దాటేటప్పుడు తన కుడి కాలును ముందుగా చాచి 42 కిలోమీటర్ల మారథాన్ ప్రపంచ ఛాంపియన్‌గా కిరీటాన్ని అందుకున్నాడు. ప్రస్తుత మారథాన్ ప్రపంచ ఛాంపియన్, చివరి దశలో నిర్ణయాత్మకమైన వేగంతో దూసుకువచ్చి ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ మారథాన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఆనంద్ ఈక్రీడలో జూ.సర్క్యూట్ నుండి సునాయాసంగా ప్రవేశించాడు, గత మూడేళ్లలో వరల్డ్ గేమ్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, వరల్డ్ స్కేట్ గేమ్స్‌లో కలిపి మొత్తం ఎనిమిది పతకాలను సాధించి, ప్రధాన ఛాంపియన్ షిప్‌లలో స్థిరమైన పతక విజేతగా తనను తాను నిరూపించుకున్నాడు. వరల్డ్ స్కేట్ గేమ్స్‌లో భారత్ 1 స్వర్ణం, 1 రజతం, 1 కాంస్యం సాధించి సీనియర్ పతకాల పట్టికను ముగించగా, ఈ ఎడిషన్‌లో ఆనంద్ ఏకైక పతక విజేతగా నిలిచాడు.



## జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఓకు భారీ స్పందన

### రూ.8,110 కోట్ల యాంకర్ బుక్‌కు రూ.2.5 లక్షల కోట్ల బిడ్లు





**ముంబయి, అక్టోబరు 19:** రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఓకు సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి భారీ స్పందన లభించింది. రూ.8,110 కోట్ల విలువైన యాంకర్ బుక్‌లో సుమారు రూ.2.5 లక్షల కోట్లమేర బిడ్లు వచ్చినట్లు సమాచారం. అందుబాటులో ఉన్న షేర్ల విలువ కంటే 30 రెట్లకు పైగా డిమాండ్ నమోదైంది. ఈనెల 21న ప్రారంభం కానున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఓకు ముందు ఈ స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయ ఆస్తుల నిర్వహణ సంస్థలు, సావరిన్ వెల్త్ ఫండ్స్, దేశీయ మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు ఈ షేర్ల కోసం బిడ్లు దాఖలు చేసినట్లు సమాచారం. బ్లాక్‌రాక్, క్యాపిటల్ గ్రూప్, ఫిడెలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్, టీ. రో ప్రైస్, ష్రోడర్స్, జేపీ మోర్గాన్ అసెట్ మేనేజ్‌మెంట్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఇన్వెస్కో, జానస్ హెండర్సన్ వంటి ప్రముఖ అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు యాంకర్ బుక్‌లో పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సింగపూర్‌కు చెందిన జిఐసి, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, నార్వేకు చెందిన నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ వంటి సావరిన్ వెల్త్ ఫండ్స్, ప్రభుత్వ పెట్టుబడి సంస్థలు కూడా ఆసక్తి చూపాయి. దేశీయంగా ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్, కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ వంటి సంస్థలు బిడ్లు దాఖలు చేసినట్లు సమాచారం. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బిఐ పెన్షన్ ఫండ్స్, హెచ్‌డిఎఫ్‌సి పెన్షన్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ వంటి బీమా, పెన్షన్ సంస్థలు కూడా ఈ ప్రక్రియలో పాల్గొన్నాయి. యాంకర్ బుక్ ద్వారా పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభానికి ముందే సంస్థాగత పెట్టుబడిదారులకు షేర్లు కేటాయిస్తారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఈ ఐపిఓ ద్వారా రూ.30,213 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 21నుంచి 23 వరకూ బిడ్డింగ్ ఉంటుంది. ఒక్కో షేరుకు రూ.1,065 నుంచి రూ.1,119 వరకు ఉంది. ఈ ఐపిఓ ద్వారా సమీకరించిన నిధులను టెలికాం అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాల చెల్లింపుతో పాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని కంపెనీ భావిస్తోంది.

## అమెరికా డాలర్‌తో బలపడిన రూపాయి



**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** దేశీయ కరెన్సీ రూపాయి సోమవారం సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 9 పైసలు పెరిగి 94.80 స్థాయికి చేరుకుంది. దీంతో వరుసగా మూడో సెషన్‌లోనూ రూపాయి కోలుకున్నట్లయింది. గత శుక్రవారం రూపాయి 10 పైసలు బలపడి 94.89 వద్ద ముగిసింది. రిజర్వ్ బ్యాంక్ చేపడుతున్న విదేశీ మారకపు మార్కెట్ జోక్యాలు రూపాయికి మద్దతునిస్తున్నాయి. అయితే, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగుతుండటం రూపాయి మరింత బలపడటానికి ప్రధాన అడ్డంకిగా మారింది. విదేశీ మారకపు మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, గత ఏడు నెలల్లో రూపాయి అత్యంత వేగంగా పుంజుకుంది. అధిక ముడి చమురు ధరలు, పెరుగుతున్న అమెరికా ట్రెజరీ బాండ్ ఈల్డ్స్, విదేశీ పెట్టుబడుల నిరంతర ఉపసంహారణలు రూపాయిపై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆర్‌బిఐ మార్కెట్‌లో తన జోక్యాలను మరింత పెంచింది. సీఆర్ ఫారెక్స్ అడ్వైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ పబారి మాట్లాడుతూ, గత మూడు ట్రేడింగ్ సెషన్లుగా డాలర్‌తో పోలిస్తే రూపాయి 95 స్థాయి దిగువన కొనసాగుతుండటంతో 94.80-94.70 స్థాయిలపై మార్కెట్ దృష్టి కేంద్రీకృతమైందని తెలిపారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95 స్థాయి దిగువన నిలదొక్కుకోవడంతో తదుపరి లక్ష్యం 94.80-94.70 స్థాయిలుగా కనిపిస్తోంది. 94.80 స్థాయిని నిలకడగా దాటితే, రానున్న వారాల్లో రూపాయి 94 స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు. ముడి చమురు ధరలు అధికంగా ఉండటం ఇప్పటికీ ప్రధాన ప్రమాదమేనని ఆయన పేర్కొన్నారు. చమురు ధరలు తగ్గుతాయా లేదా మరింత పెరుగుతాయా అన్నదానిపైనే రూపాయి తదుపరి కదలిక ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.01 శాతం స్వల్పంగా తగ్గి 101.83 వద్ద నమోదైంది. దేశ విదేశీ మారక నిల్వలు 8.578 బిలియన్ డాలర్లు తగ్గి 726.027 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు వారంలోనూ విదేశీ మారక నిల్వలు 12.952 బిలియన్ డాలర్లు తగ్గాయి. దీంతో ఆ వారాంతానికి నిల్వలు 734.606 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

# స్టాక్ మార్కెట్లలో రెడ్ మండే..





## ఇన్వెస్టర్లకు రూ.4.67 లక్షల కోట్ల నష్టం

### సెన్సెక్స్ 938 పాయింట్లు పతనం, నిఫ్టీ 1.19 శాతం డౌన్

### ప్రైవేట్ బ్యాంక్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

**ముంబయి, అక్టోబరు 19:** దలాల్ స్ట్రీట్‌లో వారపు ట్రేడింగ్ ప్రారంభం ఇన్వెస్టర్లకు నిరాశను మిగిల్చింది. సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50ఒక శాతానికి పైగా పడిపోయాయి. బిఎస్ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్ గణాంకాల ప్రకారం, ఇన్వెస్టర్లు ఇప్పటివరకు సమష్టిగా సుమారు రూ.4.67 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బిఎస్ఇలో నమోదైన అన్ని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4,68,80,280.67 కోట్లకుతగ్గింది. గత శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి ఇది రూ.4,73,46,932.13 కోట్లుగా ఉంది. అంటే ఒక్క ట్రేడింగ్ సెషన్‌లోనే రూ.4,66,651.46కోట్ల మేర తగ్గింది. శాతాల పరంగా చూస్తే ఇది దాదాపు 0.99 శాతం పతనం. బిఎస్ఇ సెన్సెక్స్ 938.41 పాయింట్లు (1.26 శాతం) నష్టపోయి 73,790.87 వద్ద ట్రేడయింది. ఇంట్రాడేలో ఒక దశలో 1,020.74 పాయింట్లు (1.37శాతం) పడిపోయి 73,708.54 కనిష్ఠ స్థాయిని తాకింది. మరోవైపు, ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 సూచీ 274.65 పాయింట్లు (1.19 శాతం) నష్టంతో 22,871.50 వద్ద కొనసాగింది. ట్రేడింగ్ సమయంలో 301.15 పాయింట్లు (1.30 శాతం) తగ్గి 22,845 స్థాయికి చేరింది. గత వారం దేశీయ మార్కెట్లు మంచి లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 2,256.94 పాయింట్లు (3.11 శాతం), నిఫ్టీ 625.70 పాయింట్లు (2.77 శాతం) చొప్పున పెరిగాయి. ఈ రెండు సూచీలకు వరుసగా ఇది రెండో వారపు లాభం కాగా, ఏప్రిల్ 2026 తర్వాత అత్యుత్తమ వారపు పనితీరుగా నిలిచింది. ఐటీ షేర్లలో కొనుగోళ్లు ఈ ర్యాలీకి ప్రధాన కారణమయ్యాయి.

నిఫ్టీ ఐటీ సూచీ గత 18 యేళ్లలోనే అత్యుత్తమ వారపు పనితీరును నమోదు చేసింది. ఈ ర్యాలీలో అన్ని విభాగాల షేర్లు సమానంగా లాభపడలేదు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు ప్రధాన సూచీలతో పోలిస్తే వెనుకబడ్డాయి. సోమవారం సెన్సెక్స్ ఇంట్రాడే కనిష్ఠ స్థాయికి చేరిన సమయంలో, గత వారం సాధించిన లాభాల్లో దాదాపు సగాన్ని కోల్పోయింది. రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. యాక్సిస్ బ్యాంక్ షేరు 4.23 శాతం పడిపోయి రూ.1,235.40 వద్దకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్జిన్లపై ఆందోళనల కారణంగా షేరు 2.76 శాతం తగ్గి రూ.708.75 వద్ద ట్రేడయింది. ఐసిఐసిఐ బ్యాంక్ షేరు 1.02 శాతం నష్టంతో రూ.1,382.80 వద్దకు దిగి వచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రైవేట్ బ్యాంకులకు భిన్నంగా ప్రభుత్వ రంగానికి చెందిన ఈ బ్యాంక్ షేరు 4.68 శాతం పెరిగి రూ.121.74 వద్దకు చేరింది.

రెండో త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ పెరుగుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర సోమవారం 2.49 శాతం తగ్గి బ్యారెల్‌కు 107.12 డాలర్లకు చేరింది. అయినప్పటికీ, గత వారం ప్రారంభంతో పోలిస్తే ధరలు అధిక స్థాయిలోనే కొనసాగుతున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బ్రెంట్ ధర బ్యారెల్‌కు 109.86 డాలర్లుగా నమోదైంది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో ఎక్కువ భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. అందువల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు అధికంగా ఉండటం దేశ ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యోల్బణ పరిస్థితులకు ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది.

## యూనియన్ బ్యాంకు నికరలాభం

# రూ.5537 కోట్లు





**ముంబయి, అక్టోబరు 19:** ప్రభుత్వరంగంలోనియూనియన్ బ్యాంకు రెండోత్రైమాసికంలో నికర లాభం 30.3 శాతం పెరుగుదల నమోదుచేసింది. నికరలాభం రూ.5537 కోట్లకు చేరిందని బ్యాంకు ప్రకటించింది. గత యేడాది ఇదేకాలంలో వచ్చిన రూ.4249 కోట్లతో పోలిస్తే 30.3శాతం పెరిగింది. నికరవడ్డీ ఆదాయం కూడా 20శాతం పెరిగింది. రూ.8813 కోట్లనుంచి రూ.10,582 కోట్లకుపెరిగింది. నిర్వహణ లాభం 19శాతంపెరిగి రూ.6814 కోట్లనుంచి రూ.8108 కోట్లకు చేరింది. నిరర్థక ఆస్తులు 2.42శాతంగా ఉంటే నికర నిరర్థక ఆస్తులుకూడా 0.47శాతంనుంచి 0.42శాతానికి తగ్గాయి. కేటాయింపులు కూడా 979 కోట్లనుంచి రూ.701 కోట్లకు తగ్గించింది. అంతకుముందు త్రైమాసికంలో 979 కోట్లు ఉంటే గత యేడాది ఇదే కాలంలో రూ.1397 కోట్లవరకూ ఉన్నాయి. ఇక కేటాయింపుల నిష్పత్తి కూడా 95.2శాతంగా ఉంది. ఇక స్థూల నిరర్థక ఆస్తులు 23 బేసిస్ పాయింట్లు తగ్గితే నికర నిరర్థక ఆస్తులు ఐదు బేసిస్‌పాయింట్లు తగ్గాయి.



## పండుగల సీజన్‌లో దూసుకెళ్తున్న

# ద్విచక్ర వాహనాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** దేశంలో పండుగల సీజన్‌లో వాహన విక్రయాల నమోదులో ద్విచక్ర వాహనాలు ర్యాలీ తీస్తున్నాయి. పండుగల సీజన్ ప్రారంభ మైన తొలి వారంలో ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 23 శాతం పెరిగాయి. మరోవైపు, ప్యాసింజర్ వాహనాల రిజిస్ట్రేషన్లు 7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. జెఫరీస్ పరిశోధనా నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో రెండు విభాగాల్లోనూ రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరిగినప్పటికీ, వృద్ధి రేటులో తేడా కనిపించింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ప్యాసింజర్ వాహనాల రిజిస్ట్రేషన్లు 28-29శాతం పెరగ్గా, ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు 22 శాతం వృద్ధి చెందాయి. పండుగల సీజన్ గణాంకాల్లో ద్విచక్రవాహనాలు మరింత వేగం పుంజుకున్నాయి. గత యేడాది వస్తు, సేవలపన్ను (జిఎస్టీ) తగ్గింపుల కారణంగా ఏర్పడిన అధిక గణాంకాల ఆధారం ఉన్నప్పటికీ ఈ వృద్ధి నమోదైంది. పండుగల క్యాలెండర్‌లో వచ్చిన మార్పులను పరిగణన లోకి తీసుకుంటూ, జెఫరీస్ ఈనెల 11 నుంచి 17 వరకు వాహన రిజిస్ట్రేషన్లను, 2025 సెప్టెంబరు 22 నుంచి 28 వరకు నమోదైన గణాంకాలతోపోల్చింది. తన ఈక్విటీ పరిశోధనా నివేదికలో, పండుగల సీజన్ ప్రారంభ దశలో ద్విచక్ర వాహనాలు, ట్రక్కులు, ట్రాక్టర్లకు బలమైన డిమాండ్ కనిపిస్తోందని బ్రోకరేజ్ సంస్థ పేర్కొంది. ద్విచక్ర వాహనాల పనితీరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, గత యేడాది జిఎస్టీ తగ్గింపుల తర్వాత ఏర్పడిన అధిక ప్రాతిపదిక ఉన్నప్పటికీ, పండుగల సీజన్‌లో తొలి ఏడు రోజుల్లో ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు వార్షిక ప్రాతిపదికన 23 శాతం పెరిగాయని తెలిపింది. ఇదే సమయంలో ప్యాసింజర్ వాహనాల రిజిస్ట్రేషన్లు కూడా పెరిగినప్పటికీ, వాటి వృద్ధి 7 శాతానికే పరిమితమైందని జెఫరీస్ పేర్కొంది.

దీంతో ప్యాసింజర్ వాహనాలతో పోలిస్తే ద్విచక్ర వాహనాల విభాగం మరింత బల మైన వృద్ధిని సాధించినట్లయింది. వాహన విభాగాల్లో ట్రక్కులు కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. పండుగల సీజన్ తొలి ఏడు రోజుల్లో ట్రక్కుల రిజిస్ట్రేషన్లు గత ఏడాదితో పోలిస్తే సుమారు 101 శాతం పెరిగి దాదాపు రెట్టింపయ్యాయి. గత యేడాది ఇదే సమయంలో ట్రక్కుల రిజిస్ట్రేషన్లు 32 శాతం పడిపోవడంతో ఈసారి వృద్ధి కొంతవరకు తక్కువ ప్రాతిపదిక ప్రభావంతో నమోదైందని జెఫరీస్ వివరించింది. ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్లు కూడా పండుగల సీజన్ తొలి వారంలో 28 శాతం పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# విజయానికి 'దశమి' స్ఫూర్తి



భారతీయ సంప్రదాయంలో పండుగలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. మనకి ప్రతి నెల ఏదో ఒక పండుగ వస్తూనే ఉంటుంది. ఇలా వచ్చే ప్రతి పండుగకి విశిష్టత ఉంది. ఇంత విశిష్టమైన పండుగలలో దసరా పండుగకు మన పెద్దలు పెద్దపీట వేశారనే చెప్పాలి. ఈ పండుగని దేవాల యాల్లో, ఇళ్లల్లో కూడా పిల్లలు, పెద్దలు అందరూ కలిసిమెలిసి అత్యంత వైభవంగా జసరుపు కుంటారు. ఈ దసరా పండుగను ఆశ్వీజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు 9 రోజులు దేవీ నవరాత్రులు, పదవరోజు విజయదశమి కలిపి 'దసరా' అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత నిచ్చే పండుగ. ఈ పండుగను 'నవరాత్రి, శరన్నరాత్రి అని కూడా పిలుస్తారు. మన సనాతన ధర్మంలో పురాణాల్లో విజయదశమికి అత్యంత ప్రాధాన్యత ఉంది. తెలంగాణలో అమావాస్య నుండి బతుకమ్మను గౌరీ రూపం 9 రోజులు ఆటపాటలతో పూజలు చేసి, తర్వాత దసర చేసుకుంటారు.

దేవతలు దానవులు కలిసి పాల సముద్రానికి వెదుతున్నప్పుడు అమృత బాండము బయటకి వచ్చినటువంటి రోజు ఏదైతే ఉందో ఆ రోజే విజయ దశమి. అలాగే రామాయణంలో రాముడు రావణాసురుడిని సంహరించే ముందు అమ్మవారి అనుగ్రహం పొందిన రోజు కూడా ఈ రోజే. అలాగే మహాభారతంలో అర్జునుడు శమీ వృక్షాన్ని పూజించి శమీ వృక్షం మీద దాచుకున్న ఆయుధాలన్ని తీసుకొని యుద్ధానికి బయలు దేరి కౌరవుల మీద విజయం సాధించి నటువంటి రోజు. జ్యోతిష్య శాస్త్రం కూడా విజయదశమిని విజయ మూహూర్తమని అంటారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం విజయ దశమికి ప్రత్యేకమైన ముహూర్తంతో పనిలేదు. ఆ రోజున ఏ పని ప్రారంభించిన తప్పక విజయం సాధిస్తాము దేవీ నవరాత్రులలో తొమ్మిది రోజులు అమ్మ వారిని పూజించిన తర్వాత దశమి రోజు శ్రవణా నక్షత్రం ఉంటుంది. శ్రవణా నక్షత్రం విజయదశమి సుదినంలో రావడంతో ఏ కొత్త పని ప్రారంభించినా విజయం సాధించి ఉన్నత స్థానానికి చేరుకుంటాము. ఈ విజయదశమి రోజున జ్యోతిష్క శాస్త్ర పరంగా అమ్మవారి అనుగ్రహం పొందడానికి చాలా విశేషమైనటువంటి రోజు. ఈ పండుగని జరుపు కోవడం వెనక ఓ పురాణం గాథ ఉంది. పూర్వం మహిషాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. మహిష రూపంలో పుట్టడం వల్ల అతనికి ఆ పేరు వచ్చింది. 'మహిష' అంటే 'దున్నపోతు' అని అర్థం. అతి బలవంతుడైన మహిషా సురుడికి ముల్లోకాలను జయించాలనే దుర్బుద్ధి పుట్టింది. దాంతో నిద్రాహారాలు మాని ఏళ్ళ తరబడి తపస్సు చేయడం మొదలు పెట్టాడు. ఇలా తపస్సు చేస్తే బ్రహ్మ నుంచి వరాలు పొందవచ్చు అన్న ఆలోచన కూడా ఉంది. ఇలా తపస్సు చేస్తుండగా బ్రహ్మ వరం కోరుకోమన్నాడు. ఈ ప్రపంచం లో ఏ పురుషుడి నుండి చావు ఉండకూడదని వరం అడిగాడు. బ్రహ్మ వరం ప్రసాదించాడు. ఇక రాక్షసుడు ముల్లోకాల మీద పడి ప్రజలను హింసించ సాగాడు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఈ రాక్షసుడిని చంపడానికి ఉపాయం ఆలోచించారు. మహిషాసురుడి చావు ఓ స్త్రీ చేతిలో ఉంది. కాబట్టి త్రిమూర్తులు ఓ దేవతని సృష్టించారు. ఆ దేవత దుర్గామాత. మహిషాసురుడితో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్న దుర్గాదేవికి మిగతా దేవతలంతా తమ ఆయుధాలను ఇచ్చారు. దేవేంద్రుడు వజ్రా యుధాన్ని, విష్ణువు సుదర్శన చక్రాన్ని, శివుడు త్రిశూల లాన్ని.. ఇలా దేవతలంతా తమ ఆయుధాల్ని అమ్మకు అందించి అండగా నిలిచారు. ఈ ఆయుధాలు అన్నింటిని తీసుకొని సింహాన్ని వాహనంగా చేసుకుని మహిషాసురుని సంహారించడానికి వెళ్లింది. హోరాహోరీగా 9 రోజులు మహిషాసురుడితో యుద్ధం చేసి పదవరోజు మహిషాసురుడిని సంహా రించింది. అప్పుడు దేవతలంతా సంబరాల జరుపుకుంటారు. ఈ మహిషాసుర సంహారమే విజయదశమికి నాంది పలికింది. ఇలా సంహా రించిన తర్వాత ఆశ్వీజ శుద్ధ దశమి రోజు 'రాజరాజేశ్వరి దేవి'గా దర్శన మిస్తారు. ఈ రోజు ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు అను గ్రహించే తల్లిగా యోగ మూర్తిగా రాజరాజేశ్వరి దేవి నేటికి పూజలు అందుకుంటున్నారు. ఈ రోజు ఏ వృత్తికి సంబంధించిన వారు ఆ వస్తువులకి పూజ చేయడం ఆనవాయితీ. అయితే మనం కూడా విజయం సాధించాలంటే పూజ చేయాలి. ఇలా చేస్తే ఏ పనిలోనైనా విజయం సాధిస్తాం. ఈ రోజు అమ్మవారికి షడ్రసోపేతమైన భోజనం అంటే కట్టె పొంగలి, చక్కెరపొంగలి, పులిహోర, వడపప్పు, పానకం, గారెలు లాంటి పిండి వంటలు నైవేద్యంగా సమర్పించాలి. ఈ రోజు బొమ్మల కొలువు పెట్టుకొని ముత్తయిదువుల్ని పేరంటం పిలిచి వారికి వాయినాలు ఇచ్చి సత్కరిస్తే అమ్మవారు వారి రూపంలో వచ్చి ఆశీస్సులు అందజేస్తారు. తెలం గాణా ప్రజలు దసరా సమయంలో బతుకమ్మ ఉత్సవాలు చేస్తారు. బతు కమ్మ పండుగ ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ (గౌరి) పండగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. నవ రాత్రి మొదట రోజున బతుకమ్మను పూలతో అలంక రించి తొమ్మిది రోజులు ఒక చోట స్త్రీలంతా చేరి ఆట పాటలు పాడి ఆనం దిస్తారు. చివరి రోజున బతుకమ్మను నిమజ్జనం చేసిన తరువాత దసర పండుగ చేసుకుం టారు. ఇది తెలంగాణ కు మాత్రమే ప్రత్యేకమయిన పండుగ. ఈ విజయ దశమి రోజు జమ్మి చెట్టుకి కూడా పూజలు చేస్తారు. సాధారణం గా ప్రకృతిలో ఉన్న అన్ని వృక్షాలకు ఓ ప్రత్యేకత ఉంది. అదే విధంగా 'పంచ పల్ల వాలు' అని చెప్పి మఱ్రి, మామిడి, మేడి, రావి, మర్కటి అంటే జువ్వి చెట్ల ఆకులను కలశాలలో పెట్టి పూజా అనంతరం ఆ నీరుతో సంప్రోక్షణ చేయడం జరుగుతుంది. ఇలా ప్రకృతిలో లభించే అనేక వృక్షాలలో ఔషధ గుణాలు ఉంటాయి. కాబట్టి వాటికి ప్రత్యేకత ఉంది. అలాగే జమ్మి చెట్టుకి కూడా ఉంది. దీనినే 'శమీ వృక్షం' అని కూడా అంటారు. అలాగే ఈ చెట్టుని పూజించి ప్రదక్షణలు చేస్తే శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ జమ్మి వృక్షానికి ప్రదక్షిణలు చేసేప్పుడు 'శమీ శమయతే పాపం/ శమీ వినాశనీ/ అర్జునశ్య ధనుర్దారీ/ రామస్య ప్రియదర్శినం/ 'ఇలా ఈ శ్లోకాన్ని చదువుతూ ప్రదక్షణలు చేయడం వలన ఆ జమ్మి వృక్షం యొక్క అనుగ్రహం కలిగి అన్నింటా విజయం సాధిస్తారు. అలాగే శమీ వృక్షం కనకధారలు కురిపిస్తుందని పెద్దలు చెబుతారు. దీనిని బంగారంగా కూడా భావిస్తారు. ఈ రోజున జమ్మి ఆకులను పెద్దలకు సమర్పించి వారి ఆశీస్సులు తీసుకుంటారు. ఈ ఆకులను బీరువాలో గల్లా పెట్టెలో పెట్టుకొని ధన ధాన్యాలు, సంపదలు అభివృద్ధి చెందాలని కోరుకుంటారు. ఈ విధంగా విజయదశమి రోజున ఋషి పరంపరను, పెద్దలు ఆచరిస్తున్న పద్ధతులను అందరు ఆచరిస్తూ విజయం



**- పింగళి భాగ్యలక్ష్మి**

విజయవాడ కనక దుర్గ
నేటి అలంకరణ

## శ్రీ రాజరాజేశ్వరి దేవి



"అంబారౌద్రిణి భద్రకాళి
బగళా జ్వాలాముఖీవైష్ణవీ
బ్రహ్మాణీత్రిపురాంతకీ
సురనుతాదేదీప్యమానోజ్జ్వలా
చాముండాశ్రిత రక్షపోష
జననీ దాక్షాయణీ పల్లవి
చిద్రూపి పరదేవతా భగవతీ
శ్రీరాజరాజేశ్వరీ"

ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారు రావివృక్షం క్రింద అపరాజితాదేవిగా కొలువై భక్తుల పరాజ యాలను పారద్రోలుతోంది. శరన్నవ రాత్రి ఉత్సవాలలో అమ్మవారి రూపం శ్రీరాజరాజేశ్వరీదేవి. సకల భువన బ్రహ్మాండాలకు ఈమె ఆరాధ్యదేవత. మహాత్రిపుర సుందరిగా ఈ దేవత త్రిపురాత్రయంలో పూజలందుకుంటుంది. ఈమెను అపజయమే ఎరుగని 'అపరాజితాదేవి'గా కూడా భక్తులు పూజించే ఆచారం ఉంది. ఇంద్రకీలాద్రి ప్రత్యక్ష దేవత ఎదురుగా ఉన్న క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి వెనుకవైపున, దుర్గమ్మను దర్శనం చేసుకుని బయటకు వచ్చే మార్గములో రావివృక్షం క్రింద అపరాజితాదేవిగా కొలువై వుంది. ఈమె స్వప్రకాశ జ్యోతి స్వరూపిణి. కోటి సూర్య సమప్రభ. కోటి సూర్యులను ఒకసారి ఒకచోట చేర్చినంత ప్రకాశవంతంగా ఈ తల్లి వెలుగొందు తుంటుంది. పరమేశ్వరుడి వామఅంకం ఈమెకు ఆసనం. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను ఈ మూర్తి తన భక్తులకు వరాలుగా అనుగ్రహిస్తుంది. ఈమె యోగమూర్తి. మాయా మోహిత పూరితమైన మానవ మనోచైత న్యాన్ని శ్రీరాజరాజేశ్వరీదేవి ఉద్దీపితం చేసి, మోక్ష కైవల్యాన్ని కలిగిస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీచక్రానికి ఈమె అధిష్ఠాన దేవత. వస్త్ర **అలంకారం:** ఆకుపచ్చ వర్ణ వస్త్రం, **పుష్పాలు :** సుగంధభరిత పుష్పములు **నివేదన :** పులిహోర, బూరెలు, గారెలు **మంత్రం :**" ఐం క ఏ ఈల హ్రీం, క్లీం హసకహల హ్రీం సౌః సకల హ్రీం" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. శ్రీలలితా సహస్రనామం పారాయణ చేసి కుంకుమార్చన, సువాసినీ పూజ చెయ్యాలి. ఆచార శక్తి గలవారు శ్రీచక్రార్చన చేస్తే మంచిది

**- భట్టిప్రోలు నటరాజకుమార్**

## సౌందర్య సంరక్షణకు తేనె



తేనె ఆరోగ్యానికే కాదు.. సౌందర్య పరిరక్షణకూ ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని కోసం ఉన్న యాంటీ బ్యాక్టీరియల్, ఆంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలే కారణమంటున్నారు. తేనె పూయడం వల్ల పెదాలు పొడిబారకుండా ఉంటాయి. ఇది చర్మకాంతిని పెంచడమే కాకుండా చర్మంలో తేమ నిలిచి ఉండేలా చేసి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. చక్కటి మాయిశ్చరైజర్గానూ ఉపయోగపడుతుంది. తేనె జుట్టుకు సహజ కండిషనర్గా పనిచేస్తుంది. ఈ తేనె, ఆలివ్ ఆయిల్ కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేయడం వల్ల జుట్టు మెరిసే అవకాశం ఉంది.

## పోట్లాటలు వీటిపైనే..

వాదనలు, పోట్లాటలు... దాదాపు ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. ఇవి ఆలూ మగల మధ్యనే కాదు, తల్లిదండ్రులూ, పిల్లల మధ్యా వస్తుంటాయి. ఇవి దేని గురించి ఉంటాయనేదానిపై అమెరికాలో ఓ పరిశోధన చేశారు. ఇంట్లో 417 ఏళ్ల మధ్య వయసు పిల్లలు ఒక్కరైనా ఉన్న 593 మంది తల్లిదండ్రులపైన ఈ అధ్యయనం చేశారు. కమ్యూనికేషన్ సరిగ్గా లేకపోవడమే ఆలూమగల మధ్య వాదనలకు ప్రధాన కారణమట. ఆపై వారి భావోద్వేగాలు, పిల్లల పెంపకం, ఇంటి పనులు, ఆర్థిక అంశాలు.. దోహదపడుతున్నాయి. గత యాభయ్యేళ్లలో ఎన్నో సంస్కృతీ సంప్రదాయాలు, సాంకేతికంగా మార్పులు వచ్చినా దంపతుల మధ్య పోట్లాటలకు కారణాలు మాత్రం మారలేదట. దీన్నిబట్టి భార్యాభర్తల అన్యోన్యతకు అవసరమయ్యే ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. అధ్యయనకర్తలు. తల్లిదండ్రులు టీనేజర్ల మధ్య చూస్తే... ఇంటి పనులు, గది శుభ్రత, సాంకేతిక అంశాలు, ఫోన్ వినియోగంపై వాదనలు ఉంటాయట. త్వరగా నిద్రకు ఉపక్రమించకపోవడం, నచ్చవంటూ ఆహారంలో కొన్నింటిని వదిలేయడం.. లాంటివి చిన్న పిల్లలతో వాదనలకు దారి తీస్తున్నాయట. చదువు, ఆర్థిక పరిస్థితి, వయసు.. లాంటివాటితో సంబంధం లేకుండా అన్ని ఇళ్లలోనూ ఇవి సాధారణంగా కనిపిస్తాయంటున్నారు. కుటుం బాలు ఈ విషయాన్నిదృష్టిలో ఉంచు కుంటే, ఇంట్లో పోట్లాటలు తగ్గి, బందాలు మరింత దృఢమవుతాయంటున్నారు పరిశోధకులు.



# తెర

## 'సంబరాల ఏటి గట్టు' షూటింగ్ పూర్తి



మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'సంబరాల ఏటి గట్టు (ఎస్వైజీ) షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. దర్శకుడు రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్న క్రమంలో కీలక మైలురాయిని చేరు కుంది. బ్లాక్బస్టర్ 'హనుమాన్' చిత్రాన్ని నిర్మించిన ప్రైమ్షో ఎంటర్టైన్మెంట్ కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రైమ్షో ఎంటర్టైన్ మెంట్ సంస్థలో ఇప్పటివరకు తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ ఇది.భారీ స్థాయిలో తెరకెక్కు తున్న ఈ సినిమా కోసం 160 రోజులకు పైగా చిత్రీకరణ జరిపారు. 10కి పైగా భారీ షూటింగ్ షెడ్యూల్స్ను విజయ వంతంగా పూర్తి చేశారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న అంబిషన్, టీమ్ కమిట్మెంట్ను ఈ ఇంటెన్స్ షూటింగ్ తెలియజేస్తోంది. సాయి దుర్గ తేజ్ కెరీర్లోనే బిగ్గెస్ట్ మూవీగా రూపొందుతున్న 'ఎస్వైజీ' ఆయన కెరీర్లో ఒక ప్రత్యేకమైన చిత్రంగా నిలవ నుంది.ఈ సందర్భంగా సాయి దుర్గ తేజ్ తన టీమ్కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సెట్స్లో సందడి వాతావరణం నెలకొంది. టీమ్ సభ్యులంతా కేరింతలు కొడుతూ, ఒకరినొకరు హగ్ చేసుకుంటూ, సరదాగా నీళ్లు, ఫేక్ బ్లడ్ చల్లుకుంటూ షూటింగ్ పూర్తయిన ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. సంబరాల సంక్రాంతి అంటూ మేకర్స్ ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఎస్వైజీ ప్రేక్షకులకు ఓ గ్రాండ్ సినిమాటిక్ సెలబ్రేషన్ అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్కు చెందిన ఓ ప్రముఖ నటుడు కీలక పాత్రలో నటిస్తుండగా, కన్నడ నటుడు ధనంజయ ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు.



## 'కనకదుర్గ' నుంచి తొలి పాట విడుదల

'అమ్మ కనకదుర్గ' అంటూ సాగే భక్తి గీతాన్ని విజయవాడలో ఆవిష్కరించిన తమన్ అండ్ టీమ్.విజయవాడలో ఈ పాటను విడుదల చేయడం వెనుక ప్రత్యేకమైన కారణం ఉంది. శ్రీ కనకదుర్గమ్మవారి ప్రసిద్ధ ఆలయం ఉన్న ఈ నగరానికి అమ్మవారితో విడదీయలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ 'అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. మా నాన్న ఈవివి సత్యనారాయణ గవిజయవాడ కనకదుర్గమ్మకు పరమ భక్తులు. నేను ఇప్పటివరకు ఎన్నో డిఫరెంట్ జోనర్స్ మూవీస్ చేశాను. అయితే తొలిసారి 'కనకదుర్గ'అనే భక్తిరస చిత్రంలో నటిస్తున్నాను. అందుకే ఈ వేడుకను నిర్వహించడానికి విజయ వాడ సరైన వేదిక అని భావించాం. ఈ నవరాత్రుల్లో ఎక్కడ చూసినా మార్మోగిపోయేలా ఒక పాటను కంపోజ్ చేయాలని తమన్ గారిని కోరాను. ఆయన అద్భుతమైన పాటను అందించారు. బిర్లా స్టూడియోస్ సహ నిర్మాత సునీల్ చైనాని మాట్లాడుతూ..'కనకదుర్గమ్మవారి భక్తి విశ్వాసాలతో ముడిపడిన విజయవాడలో, నవరాత్రుల పవిత్ర సమయంలో'అమ్మ కనకదుర్గ పాటను విడుదల చేయడం ఎంతో ప్రత్యేకం. తమన్ తనదైన శైలిలో ఈ పాటకు ప్రాణం పోశారు. అన్నారు. టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాతలు అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి మాట్లాడుతూ.. అమ్మవారితో ఎంతో ఆధ్యాత్మిక అనుబంధం ఉన్న విజయవాడలో అమ్మ కనకదుర్గ పాటను విడుదల చేయడం మాకు ఎంతో ప్రత్యేకమైన సందర్భం. తమన్ ఎస్ సంగీతం, సిరాశ్రీ సాహిత్యం ఈ పాటలో కనకదుర్గమ్మవారి భక్తి భావాన్ని, దివ్యశక్తిని అద్భుతంగా ఆవిష్కరించాయి. జీ మ్యూజిక్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సుజల్ పరేఖ్ మాట్లాడుతూ సంగీతానికి భాష, సంస్కృతి, తరాలకు అతీతంగా ప్రజలను అనుసంధానించే శక్తి ఉందని జీ మ్యూజిక్ కంపెనీ విశ్వసిస్తుంది.

## చిరంజీవి 'రౌడీ అల్లుడు' 35 ఇయర్స్ సెలబ్రేషన్స్



మెగాస్టార్ చిరంజీవి కెరీర్లో'రౌడీ అల్లుడు' చిత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. తెలుగు సినిమా చరిత్రలోనే చిరస్మరణీయమైన కమర్షియల్ ఎంటర్టైనర్లలో ఒకటైన ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ నిర్మించిన సంగతి తెలిసిందే. రౌడీ అల్లుడు 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గీతా ఆర్ట్స్ సంస్థలో ప్రత్యేకంగా వేడుకల్ని నిర్వహించారు. 1991లో విడుదలైన 'రౌడీ అల్లుడు' చిరంజీవి కామెడీ టైమింగ్, స్టైల్, స్వాగ్, డ్యాన్స్లకు కేరాఫ్ అడ్రస్గా నిలిచింది. ఆయన ద్విపాత్రాభిన యం, చిత్రంలోని ఆసక్తికరమైన కథనం, గుర్తుండిపోయే సంగీతం కలసి 'రౌడీ అల్లుడు' ప్రేక్షకుల అభిమాన చిత్రంగా నిలిచిపోయింది.కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో సత్యానంద్ రచనతో రూపొందిన ఈ చిత్రం తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంది. గీతా ఆర్ట్స్ బ్యానర్పై అల్లు అరవింద్ నిర్మించిన ఈ చిత్రంలో శోభన, దివ్య భారతి నటించగా.. బప్పి లహిరి సంగీతం అందించారు.ఇలాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలెన్నో అందించడంలో గీతా ఆర్ట్స్ తెలుగు సినిమా రంగంలో కీలక పాత్ర పోషించింది. టైం లెస్ క్లాసిక్ చిత్రాల్ని అందించడంలో గీతా ఆర్ట్స్ ఎప్పుడూ ముందుంటుంది. 'రౌడీ అల్లుడు' 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ మైలురాయి భారతీయ సినిమాకు ఆ నిర్మాణ సంస్థ అందిస్తున్న నిరంతర సేవకు, మరపురాని సినీ అనుభవాలను అందించడంలో దానికున్న వారసత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది. మూడున్నర దశాబ్దాలు గడిచినా 'రౌడీ అల్లుడు' మెగాస్టార్ చిరంజీవికి ఉన్న అప్రతిహతమైన ఆదరణకు, తెలుగు సినిమా కాలాతీత మాయాజాలానికి నిదర్శనంగా నిలుస్తూనే ఉంది.

## 'భగవంతుడు'లో 'ఓ యెల్లమ్మ' సాంగ్ రిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్, యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'. ఈ సినిమాలో కన్నడ నటుడు రిషి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రవి పనస ఫిలిం కార్పొరేషన్ (పనస మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) బ్యానర్పై ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మాత రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. విద్యా శ్రీ పనస సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న 'భగవంతుడు' సినిమా త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు రాబోతోంది. ఈ రోజు 'భగవంతుడు' సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ యెల్లమ్మ' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటను ఎస్. కృష్ణ ప్రసాద్ డివైన్ ట్యూన్ తో కంపోజ్ చేయగా అడ్డుల జంగిరెడ్డి పాడారు. ఈ పాటకు మూవీ డైరెక్టర్ జి.జి.విహారి లిరిక్స్ రాయడం విశేషం. 'ఓ యెల్లమ్మ' పాట ఎలా ఉందో చూస్తే యెల్లమ్మ అంటే ఎవరనుకున్నరు? సూర్యవంశ రాజులింట రేణుకమ్మ పుట్టెరా, దుర్గమ్మే వరమిచ్చిన ఆదిశక్తి అంశరా, అగ్గిలోంచి పుట్టినట్టి అయోనిజ తల్లిరా, జమదగ్నే మనువాడిన ముత్తైదువ అమ్మరా, తల్లి సేయి తాకి ఇసుక కడవయ్యి నిలుసురా, నాగుపాము తలనెక్కి తలపాగా సుట్టురా, నదులన్నీ ఒదిగొచ్చి కడవ నిండిపోవురా, వనవాసం కోసమని రాణీవాసం వదిలేసిన ధర్మపత్ని రేణుకమ్మురా... అంటూ మనసునిండా భక్తిభావం నింపేలా సాగుతుందీ పాట.

## ప్రొడక్షన్ నెం.3 పూజా ప్రారంభం



చంద్రహాస్ కోట్ల హీరోగా కె. రాఘవేంద్రరెడ్డి సమర్పణలో కుర్ర ప్రొడక్షన్స్ బ్యానర్ మీద దినేష్ కుర్ర నిర్మిస్తున్న నూతన చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. కుర్ర ప్రొడక్షన్స్ బ్యానర్లో ప్రొడక్షన్ నెంబర్.3 గా రాబోతోన్న ఈ సినిమాకి చెందు ముద్దు దర్శకత్వం వహిస్తున్నారు. ఫిల్మ్ నగర్లోని సాయి బాబా గుడిలో సినిమాని ఘనంగా ప్రారం భించారు. ఈ పూజా కార్య క్రమాల్లో ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ రెరా మాజీ ఛైర్మన్ డా. ఎన్. సత్యనారాయణ క్లాప్ కొట్టగా.. గంగరాజు కాకర్ల, రంగారావు వేములపల్లి, సిరాజ్ ఎస్ఎం, మధుసూదన్ స్క్రిప్ట్ అందజేయగా, దీపా ఆర్ట్స్ అధినేత శ్రీనివాస్గౌడ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. టైటిల్ ఇంకా ఖరారు చేయని ఈ మూవీకి శివారెడ్డి ఎస్వీ కెమెరామెన్గా, డి. వెంకట ప్రభు ఎడిటర్గా పని చేయనున్నారు.

## 'పోలీస్ పవర్'3చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి

శివ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్ పై శివ జొన్నలగడ్డ స్వీయ నిర్మాణం లో తయారవుతున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది అలాగే దసరా పండుగ తరువాత ఒకే పెద్ద షెడ్యూల్తో ఈ చిత్రం పూర్తి చెయ్యాలని అనుకుంటున్నాము. కరోనాలో జరిగిన యదార్ధ సంఘటనల తో ఈ చిత్రం తెరకెక్కుతుంది.తారగణం :హీరోగా శివ జొన్నలగడ్డ, విలన్గా రేవెళ్ళ శేషగిరి, మిగత పాత్రల్లో :రాం చందర్ గౌడ్ (కొల్లాపూర్ )prk మారుతి, లక్ష్మణ్ (కామారెడ్డి )లక్కీ చౌదరి, శ్రవంతి, అమృత వల్లి. DOP as రత్నం. కథ, మాటలు, స్క్రీన్ ప్లే దర్శకత్వం నిర్మాత :శివ జొన్నలగడ్డ.



## CULT : ట్రైలర్ లాంచ్ ఈవెంట్



మాస్ కా దాస్ విశ్వక్సేన్, తారక్ సినిమాస్, గ్లోబల్ స్లాషర్ ఫిల్మ్ CULT డెడ్లీ సర్వైవల్ గేమ్ ట్రైలర్ లాంచ్ హీరో విశ్వక్సేన్ మాట్లాడుతూ. మనం ఎప్పుడూ భయం, స్ట్రెస్, యాంగ్జైటీ తీసుకోకూడదు. ఇవ్వాలి.. ఇచ్చి పడేయాలి. ఈ సినిమా లాంచ్ చేసినప్పుడు మా యాక్టింగ్ గురువు తాజుద్దీన్ గారిని పిలిచి డైరెక్ట్ చేయమని చెప్పాను. కాకపోతే ఈ మధ్యకాలంలో నా నుంచి వచ్చిన కొన్ని సినిమాలు అనుకున్నంతగా రాణించలేదు. ఒకరుని ఒడ్డుకి లాగాలంటే నేను ఒడ్డున ఉండాలి. అందుకే ఈ సినిమాని నేనే డైరెక్ట్ చేస్తానని చెప్పాను. ఈ సందర్భంగా ఆయనకు సారీ చెప్తున్నాను. నేను నా డైరెక్టర్ని నమ్ముతాను. ఫలితం ఎలా ఉన్నప్పటికీ అందరం కలిసే సినిమా చేస్తాం. యాక్టర్ ఈజీ మాట్లాడుతూ.. కార్తికేయ, అనిరుధ్ అందరితో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్నిచ్చింది. రవి బస్రూర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. విశ్వక్ అన్నకి థాంక్యూ. అనిరుధ్ మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా హ్యాపీగా ఉంది. నాకు అవకాశం ఇచ్చిన విశ్వక్కి థాంక్యూ. కార్తికేయ మాట్లాడుతూ..ఇది థియేటర్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే సినిమా. జీవితంలో ఎలాంటి స్ట్రెస్ తీసుకోకూడదు. ఏదైతే అది అయిందని ముందుకు వెళ్లాలి. విశ్వక్ అన్న ట్రైలర్లో చెప్పినట్టు ఏదైతే అది అయిందని ముందుకు వెళ్లాలి. తారక్ పొన్నప్ప మాట్లాడుతూ..ట్రైలర్ అద్భుతంగా ఉంది. ఇది నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. 'పుష్పలో చేసిన క్యారెక్టర్ తర్వాత మరో స్థాయిలో చేసిన క్యారెక్టర్ ఇది. సందీప్ కాకరాల మాట్లాడుతూ.. ఇది విశ్వక్ విశ్వరూపం. అక్టోబర్ 30న థియేటర్లలో కలుద్దాం.




Printed and Published by Gireesh Sanghi, CMD, and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. 12, 13A, 13B & 13C Jadcherla Mandal & Village, Mahabubnagar Dist. RNI No. APTEL/2002/9021, Editor: *Damerla Sai Baba, * responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-11